# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జనవరి
2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

**ఆధ్యాత్మిక మాసపత్రిక**

**సంపుటి:** 18 **సంచిక:** 1


**సలహాదారులు, స్ఫూర్తిదాత,**
**కర్త, కర్మ, క్రియ మా ప్రభు**
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| కమనీయం రమణీయం– పుష్యమాసపు ఏకాదశుల వైశిష్ట్యమ్ | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| ముక్కోటి ఏకాదశి | 19 |
| శీల వైభవం | 20 |
| అగ్నుల బోధ అను ఉపకోశలుడి చరితము | 22 |
| తిరుప్పావై | 24 |
| రామాయణ రత్నాకరం | 30 |
| సంక్రాంతి సంబరాలు | 36 |
| ముకుందమాల | 39 |
| మీ ప్రశ్న మా సమాధానం | 43 |
| శ్రీకృష్ణ తత్వం | 44 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 46 |
| గోదాం వందే శ్రీరంగనాయకిమ్ | 50 |
| అక్షతల ప్రాముఖ్యత | 53 |
| తిరుమల సర్వస్వం | 56 |
| హరిహర సుతనే అయ్యప్ప | 61 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## జీవితం జాగ్రత్త

శ్రీవేంకటేశం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ సంవత్సరంలో స్వామివారి కృపా కటాక్షాలతో మనమంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, స్థిరభక్తి కలిగి జీవించాలని కోరుకుంటున్నాము. నేటితో శ్రీవేంకటేశం మాసపత్రిక 17 సంవత్సరములు పూర్తి చేసుకున్నందుకు సంతోషముగా ఉన్నది.

భగవంతుని సాధనకు మానవ జన్మ ఉత్కృష్టమైనది. భగవంతుని సేవ, సాధన చేసేందుకు దేవతలు కూడా మానవులుగా జన్మించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. అందుకే మానవజన్మ ఉత్తమమైనదంటారు. కాని ఇది క్షణభంగురము, ఎప్పుడు నిలిచిపోతుందో చెప్పలేము. కాబట్టి జీవించినన్నాళ్ళు కాలాన్ని వృధా చేయక భగవంతుని కృప పొందుట లక్ష్యముగా జీవించాలి. సదా భగవన్నామ స్మరణ చేయుచు ఉత్తమ జీవితాన్ని అలవరచుకోవాలి. దాన ధర్మాలను విరివిగా చేయాలి. ఇవి పరలోక ప్రయాణములో దారి బత్తెంగా ఉపయోగపడతాయట. ఇతరుల ఆనందమే మన ఆనందమనే తీరులో జీవించాలి. దాచిన ధనాన్ని దాన ధర్మాలకు ఖర్చుపెట్టేస్తే సంపద తరిగిపోతుందేమో అని భయపడనవసరం లేదు. నూతి నీటిని తోడకుంటేనే ఆ నీరు పాడైపోతుంది. మరణం సమీపించినప్పుడు దాన ధర్మాలు చేయాలని తలంచి పాత్రలను వెదకటం "కుక్కను కొట్టాలన్నప్పుడు కర్ర కనిపించదు, కర్ర కనిపించినప్పుడు కుక్క కనిపించదు" అనే చందంగా ఉంటుంది. సంపదలు మరణాన్ని ఆపలేవు కనుక ఉన్నంతలో కొంతైనా దానం చేసి తరించడం మంచిది. ప్రతి జీవి రోజులో కొంత సమయం తప్పక భగవంతుని సాధన అభ్యసించుచుండాలి. ఈ సాధనా క్రమంలో లోకములోని సమస్త విషయాలపై వ్యామోహం నశించి, భగవంతునిపై ఏకాగ్రత పెరుగుతుంది. ఇలా మనము ఒక్క అడుగు స్వామివారి వైపు వేస్తే ఆయన నాలుగు అడుగులు మనవైపు వేసి మనలను అక్కున చేర్చుకుంటారు.

భగవంతుడు కాలస్వరూపుడు, కాలముతో పాటు మనము కూడా మారుతూ ఉంటాము. నేడు నూతన సంవత్సరంలోకి ప్రవేశించామంటే... మన ఆయుస్సు ఒక సంవత్సరం దగ్గర పడ్డదని అర్థం. మిగిలిన ఈ కొద్దిపాటి కాలమును సద్వినియోగము చేసుకుని, లక్ష్యాన్ని సాధించుట మన కర్తవ్యం. చంచలమైన మనస్సును నియంత్రించి జీవించుట మన కర్తవ్యం. సాధ్యమైనంతవరకు అరిషడ్వర్గాలను అణిచి జీవించాలి. భగవంతుడు మనకు ఈ జన్మను ప్రసాదించుట వలన లోకానికి కొంతలో కొంత మేలు చేసినవారమై ఉండాలి. అప్పుడే మనము ఆయన అనుగ్రహానికి పాత్రులము కాగలము. లోకంలో మనం ఎంత అల్పభావన కలిగి ఉంటే... భగవంతునికి అంత ప్రియులము కాగలము. సంఘములో అల్పులుగా జీవించే క్రమంలో కొందరిచే చులకన భావమునకు గురైనప్పటికీ దానిని పట్టించుకోకుండా జీవించాలి. సర్వదా భగవంతుని యందు మనస్సు కలిగి వారిని నిత్యము పూజిస్తూ, నమస్కరిస్తూ, చిత్తము భగవంతుని యందే కలిగి, వారినే పరమ గతిగా ఎన్నుకొను భక్తుడంటే స్వామివారికి ఎంతో ఇష్టం. అలాంటివాడు తుదకు భగవంతుణ్ణి పొందుదురనుటలో ఎలాంటి సందేహం లేదు. ఈ స్థితి సాధనము ద్వారా ప్రతి భక్తుడు అలవరచుకోవచ్చును. తినగ తినగ వేము తియ్యనుండు అనే చందముగ, భగవంతుని యెడల స్థిర విశ్వాసము కలిగి సాధన చేయు భక్తునికి రాను రాను లౌకిక విషయాల పట్ల వైరాగ్య భావన ఏర్పడి భగవంతుని పట్ల ఆసక్తి పెరుగుతుంది. సదా భగవంతుని విషయాలను భక్తులతో చర్చించుట, సద్గ్రంథ పఠనము, ధ్యానము మనిషికి ఉపయోగపడుతుంటాయి. వీటితో పాటు చేతనైనంత దాన ధర్మాలు చేయుట, సమాజము కొరకు ఉపయోగకరమైన పనులను చేయుట మరింత కలిసివచ్చే విషయములు. మన సంపద, బంధుమిత్రులు, 'నా' అన్న ప్రతివారు ఎప్పుడో ఒకప్పుడు మనలను విడిచిపోవువారే. కాబట్టి ప్రతివారూ శ్రీవేంకటేశ్వరుని శరణుజొచ్చి జీవించుట ఉత్తమము.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ____________________

____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________


____________________

పిన్‌కోడ్: ____________________

చందా వివరాలు: ____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో ॥ అతివేలతయా తవ దుర్విషహై**
**రనువేలకృతై రపరాధ శతైః**
**భరితం, త్వరితం వృషశైలపతే**
**పరయా కృపయా పరిపాహిహరే**

తాత్పర్యం – వృషాద్రినాథా! వేంకటేశా! దయాసముద్రుడవగు నీవు కూడా అసహ్యించుకొనునట్లు నేను చేసిన పాపములకు హద్దు లేదు (మేర లేదు). ఇకపై కూడా పాపములలోనే నా మనస్సు ఆసక్తి కల్గి యుంటున్నది. నీవు దయ చూపించిన గాని (నీ అనుగ్రహము చేత) నేను తరించలేను. నన్ను కాపాడుము. నిన్ను శరణు కోరుచున్నాను.

అంతులేని, లెక్కలేని పాపములను చేయుచుంటిని. ఇప్పటికీ నా మనస్సు పాపకార్యములందే ఆసక్తి కల్గియుంటున్నది. నాకు పాపములు చేయకూగదను తలంపు గలుగుటకు కూడ నీ దయా కటాక్షము నాపై ప్రసరించాలి. కనుక నేను పాపరహితుడగుటకు నాపై దయ చూపి రక్షింపుము అని ప్రార్థించుచున్నాడు జీవుడు (భక్తుడు). తిరుమలలో నాటి వృషశైలమే నేడు ధర్మగిరి అని పిలువబడుచున్నది. వృషమనగా ధర్మము. ధర్మము స్థిరమైనది, పర్వతము వంటిది.


**శ్లో ॥ అధి వేంకటశైల ముదారమతే**
**ర్జనతాభి మతాధిక దానరతాత్**
**పరదేవతయా గదితా న్నిగమైః**
**కమలా దయితా న్న పరం కలయే**

తాత్పర్యము – వేంకటాచలంలో నివసించువాడు, ఉదార బుద్ధితో భక్తులు ఆశించిన దానికంటె అధికముగా వరములను అనుగ్రహించుట యందు ఆసక్తి కలవాడు, వేదములచే పరతత్త్వముగా (పరదేవతగా) ప్రతిపాదింపబడినవాడు, పరతత్త్వమగు లక్ష్మీనాథుని కంటె వేరొక పరదేవత కలదని తలంచను.



# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## ఆహిరి

ఆసమీఁద విసు – వౌ దాఁక యీ
గాసిఁ బరచు తన – కపటమే సుఖము ||పల్లవి||

1. తిరమగు కర్మము – తెగుదాఁక తన
గరిమ సుఖము పొడ – గను దాఁక
పరమార్గం బగ – పడుదాఁక తన
పరితాపపు లం – పటమే సుఖము ||ఆస||

2. కాయము గడపల – గనుదాఁక యీ
మాయ తన్నుఁ బెడ – మరుదాఁక
రాయడి మదము క – రఁగుదాఁక యీ
రోయఁదగిన తన – రూపమే సుఖము ||ఆస||

3. లంకెలఁ బొరలి న – లఁగుదాఁక యీ
యంకెల భవము లెర – వౌదాఁక
వేంకటపతిఁ దడ – వినదాఁక యీ
కింకురువాణపు – గెలుపే సుఖము ||ఆస||



భావము:

ఆశపై వేసట గలుగువరకు తన కష్టమునకు కారణమైన తన్ను తాను మోసగించుకొను ప్రవృత్తియే సుఖముగా దోచును. ఆశ ఉన్నంతవరకు ఈ భ్రాంతి వదలదు.

కర్మబంధము తెగునంతవరకును, తానీ సంసార క్లేశములకు అతీతుడనను తత్త్వము గోచరించుటచే కలుగు ఆనంద మనుభవములోనికి వచ్చునంతవరకును, పరతత్త్వ ప్రాప్తి కనువైన త్రోవ కంటబడువరకును, అన్నివిధముల సంతాపకరమగు ఈ సంసారపు లంపటమే సుఖముగా కన్పట్టును.

కాయము నేలపై వ్రాలునంతవరకును, మాయ తన్ను వదలిపోవునంతవరకును, స్పర్థతో కూడిన మదము తొలగునంత వరకును, ఏవగించుకొనవలసిన తన రూపే సుఖముగా స్ఫురించును.

లంపటములలో బడి నలుగునంతవరకును, సంసార క్లేశములు (జన్మబంధములు) తనవి కాకపోవునంతవరకును, వేంకటేశ్వరుని అన్వేషించునంతవరకును ఈ పరాధీనపు బ్రదుకున ఏమో సాధించితిమను భ్రాంతిచే గలుగు విజయోత్సాహమే సుఖముగా గోచరించును.



# కమనీయం రమణీయం

# పుష్యమాసపు ఏకాదశుల వైశిష్ట్యమ్

– చింతలపాటి శివశంకరశాస్త్రి

పుష్యమీ నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం పుష్యమాసం. సహస్యము అను నామాంతరము గల మాసము పుష్యమాసము. ఇది చాలా పునీతమైన మాసం. విష్ణువు, శని, సూర్యుడు, శివుడు పితృదేవతలు ఈ మాసంలో భక్తుల చేత కొలవబడుతారు. పుష్యమాసం లోనే రైతులకు పంటలు పుష్కలంగా పండి చేతికి అంది వస్తుండటం వలన పౌష్యమాసమని అంటారు.

పండుగలు మన సంస్కృతీ చిహ్నాలు, సంప్రదాయ వైభవాలు. పర్వం అనే శబ్దం నుంచి పబ్బం, పండుగ అనే రూపాలు వచ్చాయి. పండుగంటే సంబరం. సంబరాల్లోనే సంస్కృతి వెల్లివిరుస్తుంది. ఏడాది పొడవునా వచ్చే పండుగలు, ఇతర ఆధ్యాత్మిక క్రతువులు దేవీ దేవతల అనుగ్రహానికి సోపానాలుగా నిలుస్తాయి. ఈ మాసం నందు వచ్చే సంక్రాంతి కర్షకుని శ్రమను గుర్తించి, సమాదరించే పండుగగా సాగగా, వైకుంఠ ఏకాదశీ పర్వం దేవదేవుడు, అనంత శక్తిస్వరూపుడు అయిన శ్రీమహావిష్ణువు భక్తుల కష్టాలను తీర్చి, వారి కోరికలను తీర్చి ముక్తిని కలిగింపచేసే పర్వంగా, పునీతులను చేసే పర్వంగా సాగుతుంది.

మాసమునకు రెండు ఏకాదశులు చొప్పున పన్నెండు మాసములకు ఇరువది నాలుగు ఏకాదశులు, అధిక మాసముతో కలుపుకుని మొత్తం ఇరువది ఆరు ఏకాదశులు. ఇరువది ఆరు ఏకాదశులకు ప్రత్యేక నామములున్నను ప్రతి ఏకాదశి మహిమ గలదే. పవిత్రమైనదే. పుణ్యప్రదాయినే. ఉపవాస, జాగరణలు ఏకాదశి వ్రతమునకు ముఖ్యమైన నియమములు. ఏకాదశి శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరం. విష్ణుమూర్తి అనుగ్రహ ప్రాప్తి కొరకు ఏకాదశినాడు వ్రతమును ఆచరిస్తుంటారు. ఉపవాస, జాగరణలతో ఏకాదశి వ్రతమును ఆచరించినట్లయితే దీర్ఘాయువు, ధనధాన్య సమృద్ధి, సుఖసంపద, సర్వపాపముల

నుండి విముక్తి కలుగుటయే కాక, తుదకు విష్ణులోక ప్రాప్తి కూడా ప్రాప్తిస్తుందని వ్రత గ్రంథాలలో చెప్పబడింది.

పుష్య శుద్ధ ఏకాదశి నాడు వైకుంఠ ఏకాదశీ వ్రతమును జరుపుకుంటారు. వికుంఠత అంటే వియోగాన్ని తొలగించడం, కలిసి ఉండవలసిన వారిని, సన్నివేశాలని, పదార్థాలని కలిపి ఉంచే పరమాత్మకు వైకుంఠ శబ్దము సార్థకమైంది. వైకుంఠుడంటే "సర్వేశాం సంశ్లేషియితా" అని వ్యుత్పత్తి. మహాభారతం శాంతిపర్వంలో "మయా సంశ్లేషితా భూమిః అద్భిః వ్యోమచ వాయునా దాయుశ్చ తేజసార్థం వైకుంఠదత్తం అంతతో మయా" అని స్వామి స్వయంగా చెప్పాడు. పంచభూతాల పంచీకరణాదులు చేసేది నేనే. అందుకే నన్ను వైకుంఠుడు అంటారు అన్నాడు. ఆయన చాతుర్మాస్య కాలంలో దక్షిణ దిక్కున తలపెట్టి నిద్రించి మేల్కొని భక్తులకు ఉత్తరద్వార దర్శనం ఇస్తాడు. ఉత్తరద్వార దర్శనమంటే ఆకాశంలో శ్రవణా నక్షత్ర మండలంలో, పాలవెల్లిలో మూడుకోట్ల నక్షత్రాలు (దేవతలు) వెంట ఉండగా విశ్వవ్యాపితమైన శ్రీమన్నారాయణుడిని దర్శించడం అని అర్థం. అందువలన వైకుంఠ ఏకాదశి అనంతమైన పుణ్యాన్ని ప్రసాదించే రోజు. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తరద్వారం నుండి స్వామిని దర్శనం చేసుకున్నవారు అనంతమైన పుణ్యరాశిని దక్కించుకుంటారు. వైకుంఠ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అని అంటారు. ముక్కోటి – మూడు + కోటి. దేవతలు మూడుకోట్లు అని కొందరు, ముప్పది మూడుకోట్లు అని కొందరు భావిస్తారు. కానీ వేదాలు, శ్రుతులు "త్రయః త్రింశత్ వైదేవాః" అని, ముప్పది ముగ్గురు కోట్ల దేవతలున్నారని స్పష్టంగా చెప్పాయి. ద్వాదశ ఆదిత్యులు, ఏకాదశ రుద్రులు, అష్టవసువులు, అశ్వినీదేవతలు వీరు ముప్పది ముగ్గురు. "యే దేవాసోదివ్యా ఏకాదశః పృథివ్యా మధ్యే ఏకాదశస్థ అప్సుక్షత్ మహి ఏకాదశస్థ – తే దేవాసో యజ్ఞమియంజుషధ్వం" అనే మంత్రాన్ని అనుసరించి దివి, భువి, జలం అనే మూడు స్థాయిలలో పదకొండు మంది చొప్పున వ్యాపించి ఉంటాయి. ఇందరు దేవతలు ఒక్కటిగా ముక్కోటి ఏకాదశి నాడు సేవించ వస్తారు కాబట్టి ముక్కోటి ఏకాదశి అయింది.

"తస్యహవా ఏతస్య పంచదేవ సుషయః" అనే మంత్రాన్ని అనుసరించి పరమాత్మను దర్శించడానికి అయిదు ద్వారాలు దాటాలి. పూర్వ ద్వారానికి ఆదిత్యుడు, పశ్చిమ ద్వారానికి అగ్ని, ఉత్తర ద్వారానికి పర్జన్య దేవత అయిన ఇంద్రుడు, ఎగువ ద్వారానికి వాయువు రక్షకులు. ఇవికాక ప్రవృత్తి, వివృత్తి అనే బహిర్ద్వారాలు రెండు. మొత్తం కలిపి సప్త ఆవరణలు, సప్త ప్రాకారాలు, వైకుంఠ ఏకాదశికి సప్త ద్వారాలు తెరిచి ఉంటాయి.

వైకుంఠ వాసుడైన మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన తిథి ఏకాదశి మహిమాన్వితమైంది, కైవల్యదాయకమైనది మరియు భవ్యమైనది, శ్రేష్ఠమైనది.

పూర్వం కుంభుడనే రాక్షసుడు ఉండేవాడు. ఆతని కుమారుడు మృదు మన్యుడు. అతడు శంకరుని ప్రసన్నం చేసుకునేందుకు ఘోరమైన తపమాచరించి అయోనిజ అయిన స్త్రీ వల్ల మృత్యువు లభించేటట్లు వరం కోరుకొనగా తథాస్తు అని పలికి శివుడు వరం అనుగ్రహించాడు. వరగర్వంతో ఆ అసురుడు పేట్రేగి బీభత్సం సృష్టించగా దేవతలందరూ హాహాకారాలు చేస్తూ శ్రీహరిని ప్రార్థించగా శ్రీహరి వారిని ఊరడించి వారిని పంపించివేసి ఒక స్త్రీని సృష్టింపచేసి ఆమెకు ఏకాదశి అని నామకరణ మొనరించాడు. ఏకాదశి కన్య ఆ రాక్షసునితో యుద్ధము చేసి సంహరించింది. దానితో దేవతలు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీమహావిష్ణువు ఆమెకు కొన్ని వరాలను ప్రసాదించాడు. అప్పటినుండి ఆ కన్య మహావిష్ణువకు ప్రీతికరమైన తిథిగా అందరిచేతా పూజింపబడుతోంది.

వైకుంఠ ఏకాదశి మార్గశిర మాసములో మోక్షదైకాదశిగా ప్రఖ్యాతి చెందగా, పుష్య శుక్ల ఏకాదశి నాడు వచ్చిన ఆ ఏకాదశిని 'పుత్రదైకాదశి' అని అంటారు. దీని విశిష్టత తెలిపే కథ ఒకటి ఉంది.

పూర్వం భద్రావతి అనే నగరాన్ని సుకేతువు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతనికి ఎన్ని సంపదలున్నప్పటికిని, కీర్తి ప్రతిష్ఠలు ఉన్నప్పటికిని చాలా కాలం వరకు సంతాన ప్రాప్తి కలగలేదు. సంతానం లేకపోవడంతో వారి జీవితంలో అది తీరని లోటుగా మారింది. పుత్ర సంతానం కోసం మహావిష్ణువుని స్తుతిస్తూ తపమాచరించగా, ఆతని తపమునకు మెచ్చిన శ్రీమహావిష్ణువు పుత్ర సంతానం కలిగేటట్లుగా వరాన్ని అనుగ్రహించాడు. పరంధాముని వరంచే అచిర కాలంలోనే సంతానం కలిగింది. ఏకాదశి తిథి నాడు పుత్రుడు కలుగుటచే ఆ తిథిని పుత్రదా ఏకాదశి అని పిలుస్తారు. సుకేతు దంపతులు భక్తి శ్రద్ధలతో పుత్రదా ఏకాదశిని ఆచరిస్తూ ముక్తిని పొందారు.

వైకుంఠ ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందే లేచి కాలకృత్యములను తీర్చుకుని దగ్గరలో ఉన్న జలాశయానికి వెళ్ళి స్నానమాచరించాలి. నదిలో నడుము లోతువరకు వెళ్ళి స్నానం చేయాలి. స్నానానంతరం విష్ణుమూర్తిని అష్టోత్తర శత సహస్ర నామాలతోను తులసీదళాలతోను పూజించాలి. పిదప విష్ణ్వాలయాలకు వెళ్ళి ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుని యథాశక్తి అర్చించాలి. శ్రీహరికి నివేదించిన ప్రసాదము కొద్దిగా మాత్రమే స్వీకరించి ఉపవాసముండాలి. ఉపవాసమనగా 'ఉప' అనగా సమీపంలో, 'వాసం' అనగా నివసించడం. అనగా శ్రీహరి సమీపంలో ఉంటూ విష్ణుపురాణం చదువుతూ, విష్ణు సహస్ర నామ పారాయణలతో మనసంతా శ్రీహరి మయంగా గడపాలి.

పుష్యమాసపు బహుళ ఏకాదశిని "సఫలా ఏకాదశి" అని అంటారు. సఫలా ఏకాదశికి సంబంధించిన వ్రతకథ ఒకటి ఉంది.

పూర్వము చంపావతీ నగరాన్ని మాహిష్మంతుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతనికి నలుగురు పుత్రులు. పెద్ద తనయుని పేరు లుంపకుడు. దుష్టుల సాంగత్యము చేసి దుష్టునిగా, వేశ్యాలంపటునిగా మారిపోయాడు. బ్రాహ్మణులను, వేద పండితులను, విష్ణుభక్తులను దూషించి బాధలు పెట్టేవాడు. తనయుని దుష్కృత్యాలను తెలుసుకొనిన రాజు అతనిని రాజ్యము నుండి వెళ్ళగొట్టాడు. అడవికి వెళ్ళి అక్కడి పండ్లు మున్నగువాటితో కడుపు నింపుకుంటూ రాత్రిళ్ళు నగరానికి వచ్చి దొంగతనాలు చేసేవాడు. పండ్లతో ఆకలి తీరనప్పుడు జంతువులను తన ఆహారంగా మార్చుకొనేవాడు.

పుష్యమాసపు కృష్ణపక్ష దశమి నాడు చలికి వణుకుతూ, సరిగ్గా నిద్రపట్టక ఆ రాత్రంతా మేల్కొన్నాడు. తెల్లవారుతుండగా అతనికి నిద్ర పట్టింది. ఏకాదశి మధ్యాహ్న సమయానికి సూర్యుని కిరణాలు నేత్రాల మీద పడడంతో మెలకువ వచ్చింది. అశక్తత వలన ఆహారాన్వేషణకు వెళ్ళలేకపోయాడు. సూర్యుడు అస్తమించే సమయానికి చెట్లనుండి రాలిన ఫలాలను ఏరుకొని, రావిచెట్టు క్రిందనుండి దుఃఖముతో శ్రీహరిని ప్రార్థించాడు. ''దేవాధిదేవా! ఈ ఫలములను మీకు అర్పిస్తున్నాను'' అని పలికి శయనించడానికి ప్రయత్నించాడు కానీ దుఃఖాతిశయము చేత నిద్రించలేకపోయాడు.

రాజకుమారుడు అసంకల్పితముగా చేసిన ఉపవాసం, జాగరణలకు భగవంతుడు ప్రసన్నత చెంది అతని సమస్త పాపములను నశింపచేశాడు. మరుసటి రోజు అతని దగ్గరకు ఒక అశ్వము వచ్చింది. దానితో పాటు ఆకాశవాణి కూడా విన్పించింది.

''రాజకుమారా! నీ ఉపవాస, జాగరణలకు భగవంతుడు ప్రసన్నుడైనాడు. నీ పాపములన్నీ నశించిపోయాయి. ఈ అశ్వమును అధిరోహించి నీ జనకుని దగ్గరకు పొమ్ము'' అని పలికింది. ఆకాశవాణి వచనానుసారం రాజకుమారుడు రాజ్యానికి బయలుదేరి వెళ్ళాడు. మహారాజు అతనికి అఖండ స్వాగతం పలికాడు. కొంతకాలం గడిచిన తరువాత రాజకుమారునికి రాజ్యభారం అప్పగించి వనములకు వెళ్ళిపోయాడు. విష్ణుమూర్తి రాజకుమారునికి మరణానంతరం వైకుంఠ ప్రాప్తిని కలిగించాడు.

పుణ్యములను ప్రసాదించు ఏకాదశులను భక్తి శ్రద్ధలతో ఆచరించాలి. మహత్తరమైన ఏకాదశీ వ్రతమును ఆచరించిన వారికి అశ్వమేధ యజ్ఞ ఫలము, అరువది సంవత్సరాల తపః ఫలము ప్రాప్తిస్తాయని పురాణాల ద్వారా తెలియుచున్నది. దుర్లభమైన మనిషి జన్మకు పరమ లక్ష్యం మోక్షం. మోక్షాన్ని అనుగ్రహించే మహావిష్ణువును చిత్తశుద్ధితో, త్రికరణశుద్ధిగా ఆరాధించి అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని ఆశీస్సులను పొంది జీవితమును చరితార్థము చేసుకుందాం.

**నారాయణ నారాయణ జయగోవింద హరే**
**నారాయణ నారాయణ జయగోపాల హరే**
**సర్వేజనాః సుఖినోభవంతు**

# బలరాముడు

## – శ్రీమతి వెలమకన్ని పద్మావతి

బలరాముడు రోహిణీ వసుదేవుల కుమారుడు. శ్రీకృష్ణునికి అన్నగారు. దశావతారములలో ఎనిమిదవ అవతారం బలరామావతారం. బలరాముడు ఆదిశేషుడి అవతారంగా చెప్తారు. సాందీపుడు అనే గురువు వద్ద విద్యాభ్యాసం చేశాడు. బలరాముని రథం పైన వుండే జెండా మీద తాటిచెట్టు గుర్తు ఉంటుంది. బలరాముడు ఎప్పుడూ నీలిరంగు వస్త్రాలనే ధరించేవాడట. ముక్కోటి దేవతలలో బలరాముడు ఒకరుగా గుర్తింపబడ్డాడు.

బలరాముడు గొప్ప యుద్ధవీరుడు. గదావిద్యలో ఆరితేరినవాడు. కానీ పాండవ – కౌరవ యుద్ధంలో బలరాముడు ఎవరి పక్షానా నిలబడలేదు. ఇరువురూ తనకు కావలసినవారేనని భావించి తటస్థుడిగా ఉండిపోయాడు. పైగా యుద్ధ సమయంలో తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు.

బలరాముడికి చాలా పేర్లున్నాయి. ''సంకర్షణుడు'' అనగా శత్రువులను సంహరించువాడని అర్థం. ''బలదేవుడు'' అనగా బలవంతులలో గొప్పవాడు అని అర్థం. ''హలధరుడు'' అనగా నాగలిని ధరించువాడని అర్థం. ''హలాయుధుడు'' అనగా అవసరమైనప్పుడు నాగలినే ఆయుధంగా ఉపయోగించువాడని అర్థం.




బలరాముడు ప్రకృతి ఆరాధకుడు. ప్రకృతి లాగే ప్రశాంతంగా వుంటాడు. శ్రీకృష్ణుడు కావించిన అనేక దుష్టశిక్షణా కార్యక్రమాలలో సోదరునికి వెన్నంటి వున్నాడు బలరాముడు.

''ఓం హలాధరాయ సంకర్షణాయ నమః'' అనే మంత్రాన్ని జపించి బలరాముని అనుగ్రహం పొందవచ్చు.

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 22 వ భాగపు లీలల ప్రచురణ. (జూన్ 2008 నుండి డిసెంబర్ 2008).

## సురేఖను అనుగ్రహించుట

2వ జపసమర్పణ సందర్భంగా, నమో వేంకటేశాయ రథమును నిర్మించి 4 సంవత్సరాలు అవుతోంది కాబట్టి రథానికి ఉన్న పాలిషింగ్ నల్లబడ్డది. మరియు ఈమధ్యన టిటిడి వారు కూడా స్వామివారి రథాలను చేయించి వాటి ముందుభాగాన గరుడుని అమర్చారు. నాకు కూడా మా రథానికి గరుడుని అమర్చాలనిపించింది. దీనికి తోడు రథాన్ని బిగించిన లారీని రిపేరు చేయవలసి వచ్చింది. కాబట్టి రథయాత్ర కంటే ఒక మూడు నెలల ముందునుండి ఈ పనులను మొదలు పెట్టాము. చిన్న చిన్న పనులు మా ఇంటిలో చేసి ఆ తరువాత మెకానిక్ ఈ రథాన్ని మా ఇంటినుండి ఆటోనగర్ కు తేది 10-06-2008 నాడు రిపేరు నిమిత్తమై తీసుకువెళ్ళాడు.

ప్రతి రథయాత్ర సందర్భంగా, నా భార్య సురేఖ ఒక రుంగ చుట్టుకున్న నాగుపాము లేచి తిరుగుచున్నట్లు కల కంటుంది. ఈ రథం రిపేరు జరుగునప్పుడు కూడా ఈ పాములో కదలికలు కనబడినవట. ఒక రకంగా ఎప్పుడు ఈ రథాన్ని తీసినా ఆ పాములో కదలికలు కనబడును. ఈనాడు రథం రిపేరు చేసి గరుడుని పెట్టుటకు వీలుగా రథమును మరింత పొడుగు పెంచుటకై వర్క్ షాప్ కు వెళ్ళింది. ఈ సందర్భంగా సురేఖ ఒక కల కన్నది.

**తేది 11-06-2008 కల :** ఈ కలలో దాదాపు 15" వ్యాసము కలిగి, చాలా పొడుగాటి నాగుపాము బయటినుండి వచ్చి మా ఇంటి గేటులోనికి చొరబడింది. ఆ సమయాన మేము ముందు రూములో కాకుండా ఇంటి లోపల ఉన్నామట. ఈ పామును మా ఎదురింటి వాచ్ మన్ ఆంజనేయులు చూచాడు. అమ్మా... అమ్మా... మీ ఇంట్లోకి ఒక పాము వస్తున్నదని కేకలు వేశాడు. ఈ కేకలను విన్న మా సురేఖ ఇంటి బయటకు వచ్చి మెయిన్ డోర్ నుండి ఆ పామును


చూచిందట. అది చాలా పొడవుగా, లావుగా ఉన్నదట. అంత పొడుగాటి పామును తాను ఎన్నడూ చూడలేదట. అది మెల్లగా మా గేటులోకి ప్రవేశించి, గోడ వెంబడి కాంపౌండ్ లోపల ఉన్న మల్లెచెట్టు ప్రక్కన పడుకున్నదట. ఈ కల ఆమెకు తేది 11-06-2008 నాడు ఉదయం వచ్చింది. ఇదే రోజు ఆమె పుట్టిన రోజు కావటం ఆమె అదృష్టం.

దీనర్థం : రథమును పెంచి గరుడుడిని పెట్టుటను స్వామివారు స్వీకరించారని భావించాను.

## నిజాయితీగా బ్రతుకుదునని మాట ఇచ్చుట

ఒక సందర్భంలో మా ఆర్కిటెక్ట్ శ్రీమాన్ శివలీలానంద్ ద్వారా దుబాయిలో పని చేస్తున్న డా॥ మనోజ్ బాబు గారి ఇంటి నిర్మాణం పనిని ఒప్పుకున్నాను. ఇది హైదరాబాద్ లోని మహేంద్రా హిల్స్ లో గుట్టల మధ్య ఉన్నది. భూమినుండి 40 అడుగుల దిగువ నుండి కట్టుకుంటూ రావాలి కాబట్టి అత్యంత కఠినమైన పని అగుట వలన అనుకున్న సమయం కంటె చాలా నెమ్మదిగా జరిగింది. అనివార్య కారణాల వల్ల తాను సూచించిన కంపెనీ మెటీరియల్ కాకుండా దానికి సమానమైన ఇతర కంపెనీలది ఒకసారి వాడాము. ఈ తప్పులు శ్రీమాన్ మనోజ్ బాబు గారిని బాధించాయి. ఆయనను చూచి నేను కలత చెంది, తనను తృప్తి పరచలేదని బాధపడ్డాను. ఒకరోజు దేవుణ్ణి స్మరించి, నేను మిమ్మల్ని తృప్తి పరచలేదు కావున తప్పుకుంటాను లేదా నా ప్రవర్తన మార్చుకుంటానని డైరెక్టుగ చెప్పాను. మరియు ఆయనతో ఇలా అన్నాను. ''నాకు శక్తి ఉన్నంతవరకు, తెలిసి ఎలాంటి తప్పు చేయను. ఈ పనిలోనే కాదు నా జీవితంలో కూడ ధర్మబద్ధంగా నడుచుకుంటానని, ధన నష్టానికైనా వెనుకాడను కాని అధర్మపనులు చేయనని'' ఆయనతో చెప్పాను. అయినప్పటికి ఆయన తృప్తి చెందలేదు. తేది 25-06-2008 నాడు శ్రీమాన్ శివలీలానంద్ ఆఫీసులో మరి నలుగురి సమక్షంలో, పని వివరణలు, మంచిచెడ్డలు నేను కొనసాగాలా వద్దా అనే విషయమై మాట్లాడాము. నేను స్వామిని స్మరిస్తూ బయటి గదిలో ఉన్నాను. చివరికి వారు చర్చించుకొని, నాకు మంచి గౌరవము ఇస్తూ కొనసాగించమని చెప్పారు. ఈరోజు ఒక కల వచ్చింది.

**తేది 26-06-2008 కల :** నాతోపాటు ఒక ఏడు ఎనిమిది మంది చేరి ఒక విషయమై నాతో చర్చ జరుగుచున్నది. అది నా విషయమే లేదా నేను చేయుచున్న పని విషయము. ఇంతలో ఆ మందిలో నుండి టిటిడి ఎక్స్ ఈ.ఓ శ్రీమాన్ ఎ.పి.వి.ఎన్.శర్మ గారు నిలబడ్డారు. వారి ముఖము నాకు స్పష్టంగా కనబడ్డది. ఆయన V ఆకారపు తిరునామమును పెట్టుకుని నన్ను చూశాడు. అప్పుడు నేను పొందిన అనుభూతి ఏంటంటే... నేను తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నాను... అనే అర్థమును నా మనస్సులో కలిగించాడు. ఇంతే కల. అప్పుడు నేను... ఇక భావి జీవితములో సాధ్యమైనంత వరకు సత్ప్రవర్తనతో ఎదుటివారిని




టిటిడి ఈవో గారు సాయిరెడ్డిని సమర్థిస్తున్నానని తెలుపుట

మోసగించకుండా... నిజాయితీగా... బ్రతకవలెనని నిర్ణయించుకున్నాను. ఇది నేను ఆరోజు స్వామికి ఇచ్చిన మాట.

## 'నమో వేంకటేశాయ'


## ఉత్తమ రథమని చెప్పట

మేము 4 సంవత్సరాల క్రింద తయారు చేసిన నమో వేంకటేశాయ రథానికి చక్కటి పాలిషింగ్ తో పాటు ఈసారి రథం ముందు టిటిడి వారి రథం లాగా గరుడుని పెట్టాము. మేము టిటిడి వారంత డబ్బును ఖర్చు పెట్టలేకున్నప్పటికి వారి రథానికి పోటీ పడాలని, మా రథమే ఈ పోటీలో గెలవాలనే కోరికతో, రథాన్ని అత్యంత సుందరంగా చేశాము. గత 3 నెలల నుండి ఈ పని జరిగింది. మా రథం టిటిడి వారి కంటే బాగుండాలనే విషయాన్ని నా భార్యతో పాటు ఎవ్వరికీ చెప్పలేదు. అది నా మనస్సులోని భావన మాత్రమే. కాని శ్రీవేంకటేశ్వరుడు నా ఈ భావనను గ్రహించి ఒక చక్కని స్వప్నాన్ని నా భార్యకు కలిగించాడు. ఒక రథాల పోటీని చూపి, అందులో మా రథము అత్యంత చక్కగా ఉన్నదన్నట్లు చూపెట్టాడు. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 10-07-2008 కల:** ఒకానొక ప్రాంతములో స్వామివారి రథముల పోటీని ఎవ్వరో ఏర్పాటు చేశారట. ఎవ్వరి రథము బాగుంది, ఎవ్వరు రథమును రంగ రంగ వైభవంగా అలంకరించారనే విషయంపై ఈ పోటీ జరుగుచున్నదట. ఈ పోటీలో మా 'నమో వేంకటేశాయ' రథం పాల్గొన్నదట. సురేఖ మా నమో వేంకటేశాయ రథమును ఆ పోటీలో స్పష్టంగా చూచిందట. అత్యంత బంగారు కాంతిని వెదజల్లుచు ఈ రథం పరుగులు పెడుచున్నదట. కాని ఈ పోటీ ఎవరు నిర్వహించారు, ఇందులో ఇంకెవరు పాల్గొన్నారనే విషయం తెలియదు. ఇంతే కల. మొత్తం మీద మేము చేసే సేవను, మా తపనను స్వామివారు ఈ లీల ద్వారా గుర్తించి ప్రోత్సహించారు.

## రథము ద్వారా భక్తులను అనుగ్రహించుట

ఈ సంవత్సరం తేది 24-08-2008 నాడు గోకులాష్టమి. మేము 6వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పించాలి. కాబట్టి తేది 02-08-2008 నాడు హబ్సిగూడ లోని మా ఇంటినుండి 'నమో వేంకటేశాయ' రథయాత్రను ప్రారంభించాము. ఈ ప్రారంభోత్సవానికి శ్రీ అంగలకుదురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ రామానుజ దాసస్వామి వారితో పాటు టిటిడీ ఈఓ శ్రీమాన్ రమణాచారి గారు, ఎక్స్ ఈఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు, మరికొందరు ముఖ్యులు పాల్గొన్నారు. టిటిడి భక్తి ఛానల్ వారు చక్కగా కవరేజ్ చేశారు. ఈసారి రథం హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ళ, ఒంగోలు, నెల్లూరు మీదుగా తిరుపతి చేరింది. ప్రతి రథయాత్రలో స్వామివారు కొన్ని లీలలను చూపుతారు. ఈ యాత్రలో హైదరాబాద్ లో ఒకటి, గుంటూరులో మరోటి చూపారు. ఆ లీలలు ఈవిధంగా ఉన్నవి. హైదరాబాద్ లోని మహేంద్రాహిల్స్ లో డా॥ మనోజ్ బాబు ఇల్లును నేను కాంట్రాక్టుపై కడుతున్నాను. పరిస్థితుల ప్రభావము వలన ఈ పని చాలా నెమ్మదిగా, కష్టంగా జరుగుతోంది. పైగ ఈయన కొంత అసంతృప్తితో ఉన్నారు కాబట్టి వీరికి తమ ఆశీస్సులు ప్రసాదించమని స్వామివారిని ప్రార్థించాను. దాని సమాధానమే ఈ కల.



రథము ద్వారా భక్తులను అనుగ్రహించుట

**తేది 14-08-2008 కల :** ఈ కలలో ఈరోజు రథం మహేంద్ర హిల్స్ ప్రాంతములో తిరుగుతోంది. మనోజ్ బాబు గారి ఇంటికి వెళ్ళుటకని ఈ రథం ఒక గుట్టపై నుండి మలుపు తిరిగి రోడ్డుపై పోవుచున్నది. ఇంతలో ఈ రథం నుండి ఒక దొప్పలో పులిహోర ప్రసాదం దానంతట అదే పైకి వచ్చి ఈ రథం కంటే వేగంగా, రథం ముందర వారికై పోవుటను నేను కళ్ళారా చూచాను. ఇంతే కల.

దీనర్థం నా ప్రార్థనను స్వామివారు స్వీకరించారు, మరియు వారికి ప్రసాదం రూపంలో ఆశీర్వాదమును

అందించారు. నమో వేంకటేశాయ రథం ఎంతమంది భక్తుల ఇంటి వద్దకు వెళ్ళిందో అందరికీ స్వామి అనుగ్రహం లభించినట్లు భావించాను. మరో లీల గుంటూరులో జరిగింది.

తేది 18-08-2008 నాడు నమో వేంకటేశాయ రథం గుంటూరులో తిరిగింది. దీనిని గుంటూరు నివాసియైన శ్రీ రాంప్రసాద్ గారు ఆహ్వానించారు. అంతకు ముందు నన్ను కాని, మా రథాన్ని కాని ఆయన చూడలేదు. స్వామివారిపై భక్తితో ఈ రథయాత్ర నిర్వహిస్తానని ఒప్పుకున్నాడు. ఈ యాత్ర ఎలా చేయాలి అని ఆలోచించుకుంటూ గత రెండు రోజులు ఉన్నారట. ఇంతలో ఆయనకు ఒక కల వచ్చింది.

**తేది 17-08-2008 కల :** ఈ కలలో ఆయన తన ఊరిలో రథయాత్ర చేస్తున్నట్లు కల వచ్చిందట. అందులో వెనుక నుండి రథము 'ఓం నమో వేంకటేశాయ' అంటూ ఛాంటింగ్ చేస్తూ వస్తోందట. దీనిముందు తాను మరికొంతమందితో నడుస్తున్నాడట. అందులో నేను కూడా రథయాత్ర వేషధారణలో అంటే లుంగీ, షర్టు, ఎఱ్ఱని శ్రీచూర్ణ నామం ధరించి ఉన్నానట. ఇంతే కల. తరువాత తేది 18-08-2008 నాడు సాయంత్రం మేము వారి ఇంటినుండి రథయాత్ర చేశాము. అప్పుడు ఈయన నన్ను గత రాత్రి కలలో చూచానని చెప్పారు. ఈవిధంగా స్వామివారు నాకు ఎంతో మంది స్వామి భక్తులతో పరిచయాలు కల్పించారు. నన్ను అంతకుముందు చూడనప్పటికీ వారి కలలో చూపించి ఆనందభరితుణ్ణి చేశారు.

## 6వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

తేది 23-08-2008 నాడు సాయంత్రం తిరుపతిలోని అలిపిరి, శ్రీ స్వామి వారి పాదాల మండపము పైన ఈ 7 కోట్ల జపమును స్వామి పాదాలకు సమర్పించి పూజించాము. ఈ పూజ అత్యంత సంతృప్తికరంగా జరిగింది. తిరుమల మూలమూర్తి నా ఎదురుగా నిలబడి మా పూజను స్వీకరించారన్న భావన కలిగింది. ఎస్వీబీసీ వారు ఈ కార్యక్రమాన్ని టెలికాస్ట్ చేశారు.

తేది 24-08-2008 గోకులాష్టమి నాడు ఉదయం 8 గంటల నుండి ఎస్వీ డైరీఫాం లోని శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం ముందు హోమ కార్యక్రమము ప్రారంభించాము. మరోప్రక్క శ్రీవేంకటేశ్వర మహామంత్రమును అనుసంధానిస్తూ శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం కూడ జరిపాము. తరువాత సుమారు 12 గంటల ప్రాంతములో ఈఓ శ్రీమాన్ రమణాచారి గారు, ఛైర్మన్ శ్రీమాన్ కరుణాకర్ రెడ్డి గారు మరియు అధికారులు వచ్చారు. యజ్ఞపూర్ణాహుతి కావించి, స్థూపం చుట్టూ ఒక పరిక్రమణ చేసి, జపము వ్రాసినవారి కోరికలను తీర్చమని ప్రార్థించి జపసమర్పణ చేశారు. మరియు సప్తమ పర్యాయంగా 7 కోట్ల జపమునకు శ్రీకారం చుట్టారు. తరువాత భక్తులు తలాకొంత జపమును స్వామివారికి స్థూపంలో సమర్పించారు. దీనిని ఎస్వీబీసి వారు లైవ్ టెలికాస్ట్ చేశారు. ఆ తరువాత కొండకు వెళ్ళి స్వామివారిని దర్శించుకొని తిరిగి 26-08-2008 నాడు హైదరాబాద్ వచ్చాము. ఈ రాత్రి సురేఖ ఒక కల కన్నది.

**తేది 27-08-2008 కల :** ఈ కలలో సురేఖకు ఒక పెద్ద పాము వచ్చి మా తూర్పుగుమ్మం ఎదురుగా, తులసిచెట్ల ప్రక్కన పడుకున్నదట. ఈ పాము చాలా పెద్దగా మరియు దొడ్డుగా ఉన్నదట. రథయాత్ర ముగించుకుని రథము తిరిగి ఇంటికి వచ్చింది కాబట్టి స్వామివారు ఈ లీలను చూపెట్టారని భావించాము.

## మా తల్లి అంతిమ సమయం దగ్గర పడ్డదని సూచించుట

సంవత్సరం 2008 జూన్ / జులైలో ఒక కల వచ్చింది. కాని అప్పుడు నేను భయముచే వ్రాయక తేది 11-11-2008 నాడు వ్రాశాను. ఇది నా జన్మకు సంబంధించింది. నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సేవచేసే భాగ్యమును పొందుటకు వీలుగా, ప్రస్తుతపు ఈ జన్మ గురించింది. నేను పూర్వం ఎన్నో జన్మలను ఎత్తి యుండవచ్చు, ఆయా జన్మలలో నా ప్రభు తిరుమల వేంకటేశ్వరునికి సేవ చేశానో లేదో తెలియదు. కాని ఈ ప్రస్తుత జన్మలో నా స్వామివారికి తనివితీరా సేవలను చేస్తూ ధ్యానిస్తున్నాను. ఇంతటి మహాభాగ్యమును పొందుటకు, ఈ జన్మను ప్రసాదించిన వారు మా తల్లి కీ.శే పుల్లగూర్ల రుక్కమ్మ గారు. ఈ కల ఈమెకు సంబంధించినది, నాకు మాతృ ప్రేమను లేకుండా చేయునటువంటి కల. అందుకే ఈ కల కన్న తరువాత మా తల్లికి ఎలాంటి ఆపద రానీయకుమని స్వామివారిని మనసారా వేడుకున్నాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! నా తండ్రి గారు 1990లో చనిపోయారు, మా తల్లి మాత్రమున్నది. ప్రస్తుతము ఆ తల్లిని కూడ నా నుండి దూరము చేయకుమని వేడుకున్నాను. ఈ భయముచే ఈ కలను వ్రాయలేదు. ఆ కల ఈవిధముగా ఉన్నది.

కల : అది చిన్నగుండవెల్లిలోని మా పాత ఇల్లు. మెయిన్ డోర్ దాటి లోనికి వెళ్ళగానే ఒక లొద్ది (లోగిళ్ళు) ఉంటుంది. ఈ లొద్ది తరువాత భవంతి ఉంటుంది. నేను జన్మించక పూర్వము నుండే మా తల్లితండ్రులు ఈ ఇంటిలో నివసిస్తున్నారు. చిన్న నాటినుండి నా మొత్తం జీవితమును ఈ ఇంటిలోనే గడిపాను. ఈ ఇల్లు చక్కగా ఉంటుంది. ఈ కలలో నేను భవంతిలో ఉన్నాను. నా ఏకైక చెల్లెలు లలిత కూడ నా ప్రక్కనే ఉన్నది. ఈ కలలో మా తల్లి చనిపోయినదట. ఈమె పార్థివ శరీరాన్ని మా లొద్ది (లోగిళ్ళు) లోనే పెట్టామట. మా చెల్లెలు చాలా ఏడుస్తోంది. నేను తిరిగి మా చెల్లెలు వైపు చూచు సమయాన ఆమె ఆరు ఏడు సంవత్సరాల

వయస్సున్న చిన్నపిల్లగా మారిపోయింది. నాకు అమ్మ లేదు అని ఏడుస్తోంది, కొట్టుకుంటోంది. నేను దానిని ఎత్తుకుని నా భుజాలపై పడుకోబెట్టి తన వీపుపై నా చేతితో మెల్లగా కొట్టుచు ఏడవకుమంటు నీకు నేనున్నానని ఊరడించాను. ఇది నేను పొందిన కల. శ్రీవేంకటేశ్వరుడు చూపిన ప్రతి కల నిజమగును కాబట్టి ఈ కల పొందిన వెంటనే మా అమ్మకు ఆపద అనే భయముచే స్వామివారిని దీనంగా వేడుకున్నాను. ఇప్పటికే తండ్రిని కోల్పోయానని, ఇప్పుడు తల్లిని కూడ తీసుకెళ్ళకుమని ప్రార్థించాను. ఆ తరువాత రోజులలో దీని చిహ్నాలు కనబడలేదు, సంతోషించాను. మరియు ఇదే సమయాన శ్రీవేంకటేశ్వరుడు ఎన్నో అద్భుతాలను చూపెట్టుచు, ఈ జన్మ యొక్క మహాత్మ్యాన్ని తెలిపాడు. ఎంతటి అనుగ్రహానికి పరవశించి స్వామి ఋణం తీర్చుకొనుటకు నా పూర్తి జీవితంను సమర్పించానో అలాంటి అనుగ్రహాలు ఈ జన్మలో మొత్తం 14 పొందినట్లు చెప్పాడు. మరో లీలలో దేవతలకు సహితం చూపని లీలలను నాకు చూపానని చెప్పాడు. ఈ లీలల ద్వారా నా ప్రస్తుత జన్మ విలువ తెలుసుకున్నాను. రాజ మహారాజులకు లభించని ఈ భాగ్యం నాకు ఈ జన్మలో లభించింది. దీనిని చూచి నన్ను నేను ఎంతో భాగ్యవంతునిగా భావించుకున్నాను.

## నా మూడవ వంతు పుణ్యంతో మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించ ప్రార్థన

ఇంతలో మరో సంఘటన జరిగింది. ఈ సమయాన మా అమ్మ హైదరాబాద్ లోని రామంతపూర్ లో మా చెల్లెలు లలిత ఇంటిలో ఉన్నది. తేది 12-10-2008 నాడు సాయంత్రము వారింటి బాల్కనీలో నిలబడి బయట వైపు చూస్తున్నదట. ఇంతలో తల తిరిగినట్లై అక్కడనే క్రింద పడిపోయింది. దెబ్బలు చిన్నగనే తాకాయి కాని ఆ సమయంలో భయముచే తన తలలోని రక్త నాళాలు గడ్డ కట్టుకుపోయాయి. దీని ప్రభావముచే కాలము గడిచిన కొద్దీ ఒక్కొక్క అవయవము పనిచేయకుండా పోవునట. ఈ విషయము మాకు తెలియదు. మా చెల్లెలు తనను లోనికి తీసుకువచ్చి పడుకోబెట్టింది. విషయం తెలిసిన వెంటనే నేను, నా భార్య వెళ్ళి చూచాము. అక్కడక్కడ ఒరుసుకుపోయింది తప్ప దెబ్బలు ఎక్కువ తాకలేదు కాబట్టి నిర్భయంగా ఉన్నాము. తెల్లవారి తేది 13-10-2008 సాయంత్రం దాదాపు 6.30 గంటలకు మళ్ళీ నేనొక్కడినే వెళ్ళి చూచాను. అప్పుడు తన చేతి మట్ట కొంచెము వాచింది కాని నిన్నటి నొప్పులు తగ్గాయని అన్నది. ఆ సమయాన నేను ఆమె ప్రక్కన కుర్చీలో కూర్చున్నాను. ఆమె చక్కగా నాతో మాట్లాడుతుంది. ఇంతలో శ్రీవేంకటేశ్వరుడు ఒక లీలను చూపి భయకంపితుణ్ణి చేశాడు. ఈ లీల ద్వారా మా తల్లి అంతిమ రోజులు దగ్గర పడ్డాయని స్పష్టంగా తెలుసుకున్నాను.



**మా అమ్మ**
**కీ.శే. పుల్లగూర్ల రుక్కమ్మ**

లీల : నేను మా అమ్మ ప్రక్కన కూర్చుండి ఆమెతో మాట్లాడుచున్నాను. ఆమె కూడా సంతోషంగ చక్కగా మాట్లాడుతోంది. ఇంతలో నేను మా అమ్మను తదేక దృష్టితో చూచునట్లు ఒక అదృశ్య శక్తి నా ముఖాన్ని గట్టిగా పట్టుకుంది. "చూడు మీ అమ్మను బాగా చూడు, ఇంకా చూడు, నీ తనివితీరా చూడు, ఇదే నీ ఆఖరి చూపు" అనే భావం నా మనస్సులో పదే పదే వచ్చింది. ఆ సమయంలో నా ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుదామనుకున్నా త్రిప్పలేని విధంగా ఆ శక్తి నా తలను గట్టిగా పట్టుకుంది. కొంతసేపు తరువాత సడలించింది. దీనితో మా తల్లి అంతిమ దశ దగ్గర పడ్డదని ఇక తను బ్రతకదని అనిపించింది. వెంటనే నా కళ్ళనుండి నీరు కారింది. దీనిని మా చెల్లెకు గాని అక్కడున్న మరెవ్వరికీ కనబడకుండా జాగ్రత్తపడి ఆత్రుతగా మా ఇంటికి బయలుదేరాను. మార్గమధ్యంలో, ఉప్పల్ మెయిన్ రోడ్డులోని శ్రీ హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రదక్షిణలు చేసి ప్రార్థించాను. అక్కడే ఉన్న శివలింగం ముందు కూర్చుండి దీనంగా వేడుకున్నాను. శివుణ్ణి నా ప్రభు శ్రీవేంకటేశ్వరుడిగా భావిస్తూ ప్రార్థించాను. దుఃఖము విపరీతంగా వచ్చింది. ప్రతిసారి నా తల్లికి న్యాయం చేయండి, ఆమె ఆత్మకు శాంతిని చేకూర్చండి ప్రభూ! అనే మాట మాత్రమే నా నోటి నుండి వచ్చింది. ఈ రాత్రి కూడా మా అమ్మకు శాంతిని చేకూర్చమని స్వామివారిని ప్రార్థిస్తూ పడుకున్నాను.

తెల్లవారి అంటే తేది 14-10-2008 నాడు ఉదయం మా చెల్లెలు భయపడుచు ఫోన్ చేసింది. మా అమ్మ ఏదో విధంగా అరుస్తున్నదని, నోరు వంకర పోయిందని, చాలా నీరసంగా ఉన్నదని చెప్పింది. వెంటనే వెళ్ళి దగ్గరలోని ఒక హాస్పిటల్ లో చేర్పించాము. వారు గ్లూకోజ్ ఎక్కించారు. కాని ఉదయం 9.15 గంటలకు తన మాట పోయింది. నేను మాత్రం మా అమ్మ తప్పక కోలుకొనునని నా ప్రభు తప్పక కరుణించుననే భావంతో ఉన్నాను. మరికొద్ది గంటలలోనే స్పృహ కోల్పోయింది. అందరము ఆమె ప్రక్కనే ఉన్నాము. మధ్యాహ్నం ఇంటికి వచ్చి మా పూజగదిలో శ్రీవేంకటేశ్వరుని మనసారా ప్రార్థించాను. ఈ ప్రార్థన సమయంలో మా అమ్మ నా కొరకు ఎంత కష్టపడ్డది, పెంచి పోషించుటకు ఎలాంటి త్యాగాలు చేసిందనే విషయాలు ఒక్కొక్కటి గుర్తుకొచ్చాయి. వెక్కి వెక్కి ఏడుస్తూ స్వామిని ప్రార్థించాను. మరోప్రక్క ఈరోజు వరకు నేను పొందిన

శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహాలు ఒక్కొక్కటి గుర్తుకొచ్చాయి. సంవత్సరం 2000 లో నా భాగ్యవశాత్తు శ్రీవేంకటేశ్వరుడు దర్శనమిచ్చి "నీకు నేనండగా ఉంటాను" అని చెప్పాడు, నా మనస్సులో భక్తిబీజం నాటాడు. ఆ తరువాత ఆంజనేయుని లాంటి సేవను ప్రసాదించి, ఈ జన్మలో నేను తృప్తి చెందేవరకు తన సేవాభాగ్యమును ప్రసాదిస్తానని మాటిచ్చాడు. నా మొదటి పుట్టిన రోజు పండుగ సందర్భంగా "సాయిరెడ్డి నావాడ"ని అన్నాడు. ఏమి తెలియని నాతో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపాన్ని నిర్మింపచేశాడు. ఆ తరువాత ఈ స్థూపాన్ని స్వీకరించి "నీ జీవితాంతం నీవే ఈ స్థూపాన్ని మేనేజ్ చేస్తావ"ని చెప్పాడు. ప్రతి సంవత్సరం ఒక ఫంక్షన్ చేయమన్నాడు. నాచేత శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపింపచేసి ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ చేయిస్తున్నాడు. నాచే నమో వేంకటేశాయ రథాన్ని నిర్మింపచేసి హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర చేయిస్తున్నాడు. తన పాదసేవా భాగ్యాన్ని ప్రసాదించి "గోవింద దాసు"గ దాస్యనామమిచ్చి సత్కరించాడు. ఒక సందర్భములో "నీ ముందు వెనుక నేనున్నానన్నాడు". ప్రతిక్షణము స్వామివారిని స్మరిస్తూ జీవించమని చెప్పాడు. నాచేత "శ్రీవేంకటేశం" అనే మాసపత్రికను ప్రారంభింప చేశాడు. ప్రతి సేవను సమర్థవంతంగా చేసి తన సాక్షాత్కారమును పొందమని పదేపదే చెప్పాడు. నేను దుఃఖములో ఉన్న ప్రతిసారీ ఆదుకున్నాడు. ఈ జన్మలో నేను పొందిన అనుగ్రహాలను ఒకసారి అర్జునునితో మరోసారి ద్రౌపదితో పోల్చుకున్నాను. ఒకసారి నేనంటే ఇష్టం అని చెప్పుచు ఆలింగనం చేసుకున్నాడు. నన్ను తన భుజములపై ఎత్తుకొని ఆడిస్తూ ఆనందాన్ని నింపాడు. ఒక సందర్భములో నా ఉద్ధరణ కోసం తిరుపతి నుండి ప్రత్యేక గురువును పంపాడు. ఎన్నోసార్లు తన దర్శన భాగ్యాన్ని ప్రసాదించి ధన్యుణ్ణి చేశాడు. ఎంతటి అనుగ్రహానికి పరవశించి నా పూర్తి జీవితాన్ని అంకితం చేశానో అలాంటి అనుగ్రహాలు 14 ప్రసాదించినట్లు చెప్పాడు. దేవతలకు సహితం చూపని అనుగ్రహాలను ప్రసాదించానని చెప్పాడు. మరియు ప్రస్తుతం నేను ధరించిన ఈ శరీరాన్ని ఒక సందర్భంలో స్పృశించి అమితానందమును కలిగించాడు. ఇవి నేను ఈ జీవితంలో పొందిన భాగ్యాలు. ఇంతటి జీవితం ఎవ్వరికి లభిస్తుంది...? ఒకవేళ భగవంతుడు ప్రత్యక్షమై నీకు 1. భారతదేశ ప్రధానిగా 2. భారత రాష్ట్రపతిగా 3. అమెరికా ప్రెసిడెంట్ గా 4. ప్రపంచ కుబేరునిగా లేదా 5. పుల్లగూర్ల సాయిరెడ్డిగా ఏ జన్మ కావాలో కోరుకొమ్మంటే నేను ప్రస్తుతమున్న పుల్లగూర్ల సాయిరెడ్డి జీవితాన్నే కోరుకుంటాను తప్ప మరోదానిని ఆశించను. నాకు ఈ జన్మ అంత ముఖ్యమైంది. అలాంటి ఈ జన్మను ప్రసాదించిన మా తల్లి తండ్రుల ఋణం ఎలాగైనా తీర్చుకోవాలనిపించింది. కాని మా తండ్రి నేను భక్తుణ్ణి కాకపూర్వం సం॥ 1990 లో చనిపోయారు. కాబట్టి ఆయన ఋణం తీర్చుకునే అవకాశం లేకపోయింది. ఇక మా అమ్మ ఉన్నది. కాని ఇప్పుడు ఆమె స్పృహ కోల్పోయింది. అయినప్పటికీ ఆమె ఋణం ఎలాగైన తీర్చుకోవాలనే కోరిక బలంగా కలిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని మా అమ్మకు న్యాయం చేయమని ఏడుస్తూ శ్రీవేంకటేశ్వరుణ్ణి పదే పదే వేడుకున్నాను. నా దుఃఖాన్ని చూచి ఒక సందర్భంలో "మీ అమ్మను బ్రతికించమంటావా?" అనే మాట స్వామివారు అడిగినట్లు అనుభూతి పొందాను. కాని గతంలో రెండు మూడు సార్లు మా అమ్మ తనకు జీవించి ఉండాలని లేదని స్వయంగా చెప్పింది. గత 18 సంవత్సరాల నుండి ఆమె ఏదో రకమైన నొప్పులతో జీవిస్తోంది. ఒకవేళ బ్రతికిస్తే ఆ నొప్పులతో జీవించుట అవసరమా? అనిపించింది. చివరికి ఇలా అన్నాను, ప్రభూ శ్రీవేంకటేశ్వరా! నాకంటే మీకే ఆమె గురించి ఎక్కువ తెలుసు, కాబట్టి ఆమె జీవితానికి ఏది మంచో దానిని చేయమని ప్రార్థించాను.

మరియు ఇలా భావించాను. నేను ఇంతవరకు జీవితంలో మా అమ్మను సుఖపెట్టానో... లేదో... కాని నాకు మాత్రం ఇంతటి జన్మను ప్రసాదించింది కాబట్టి ఆమెకు ఒక చక్కని బహుమానం ఇవ్వాలనిపించింది. ఒక ప్రక్క ఆమె స్పృహ కోల్పోయి కొన్ని గంటలలో ప్రాణం పోవుటకు సిద్ధంగా ఉంది. అలాంటి స్థితిలో ఆమెకు ఒక బహుమానం, అది కూడా తన జీవితానికి ఉపయోగపడేది ఇవ్వాలనిపించింది. ఏమివ్వాలో తెలియక శ్రీవేంకటేశ్వరుణ్ణి దీనంగా ఏడుస్తూ ప్రార్థించాను. ఇంతలో శ్రీవేంకటేశ్వరుడు నా ప్రక్కకు వచ్చి నిలబడినట్లు, నేనేమైనా బహుమానం ఇస్తే దానిని తీసుకెళ్ళి మా అమ్మకు ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నట్లనిపించింది. నేను మాత్రం ప్రభూ... మా అమ్మ ఎవరో కాదు నీ సేవకుడి తల్లి... మరియు శ్రీవేంకటేశ్వర సేవా సమితిలో 3వ సభ్యురాలు... మీకు చేయు ప్రతి సేవ ఈ సేవా సంస్థ ద్వారానే జరుగుచున్నది, కాబట్టి అనుగ్రహించమని పదే పదే వేడుకున్నాను. మరియు ఇలా ప్రార్థించాను. మా అమ్మ తన జీవితంలో ఏ పుణ్యం చేయకపోవచ్చు... అయినప్పటికీ, నాకు తల్లైనందుకు, శ్రీవేంకటేశ్వర సేవాసమితిలో 3వ సభ్యురాలైనందుకు తనను అనుగ్రహించమని వేడుకున్నాను. మా తల్లి ఇప్పుడు స్పృహ కోల్పోయింది, కాబట్టి పుత్రునిగా ఆ ఆస్తి నాదని, ఆ ఆస్తిని మీ చరణాలకు అర్పిస్తున్నానని, మీకు నచ్చిన విధంగా ఆమె సంతోషించే విధంగా అనుగ్రహించమని వేడుకున్నాను. ఇలా భగవంతుని ప్రార్థించుటే కాకుండా నా తరపున ఒక మంచి బహుమానం ఇవ్వాలనిపించింది. ఒకవేళ నేను బహుమానం ఇవ్వకుంటే... నన్ను నేను స్వార్థపరుడిగా భావించుకున్నాను. చివరికి స్వామివారిని ప్రార్థించి ఇలా చేశాను. "ప్రభూ శ్రీవేంకటేశ్వరా... నేను ఈరోజు వరకు పొందిన మొత్తం

పుణ్యములో మూడవ వంతు మా అమ్మకు ధారపోస్తున్నానని, ఈ పుణ్యఫలంతో మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించమని" వేడుకున్నాను. అంటే నేను ఇంతవరకు సాధించిన పుణ్యములో మూడవ వంతు పుణ్యాన్ని నా అకౌంట్ నుండి మా అమ్మ అకౌంటుకు బదిలీ చేసి ఆమెకు వైకుంఠాన్ని ప్రసాదించమని దీనంగా వేడుకున్నాను. ఇదే నేను ఆమెకు ఇచ్చే బహుమానం అని చెప్పాను. మరియు శ్రీవేంకటేశ్వరుడు కూడా దీనికి సంతోషించినట్లు, నా బహుమానాన్ని మా అమ్మకు ఇచ్చినట్లు అనుభూతి చెందాను. దీంతో నా మనస్సు తేలికైంది. బాధ కొంత తగ్గింది.

తెల్లవారి తేది 15-10-2008 ఉదయం 8 గంటల ప్రాంతమున మా అమ్మ స్వర్గస్తురాలైంది. అప్పుడు నేను పొందిన బాధ వర్ణనాతీతం, లోకంలో నాకు ఏమీ లేదనిపించింది. మనిషి జీవితం విలువ తెలిసింది. ఈ విశ్వం నాది కాదనిపించింది. నేను ఏకాకిని, నాకు ఎవ్వరూ లేరనిపించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ జీవితము శూన్యంగా భావించాను. ఇదే రోజు సాయంత్రం మా స్వగ్రామము చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద మా తల్లికి అంత్యక్రియలు నిర్వహించాము.

నాకు తల్లి లేని లోటును తీర్చమని ఆ లక్ష్మీమాతను నాకు తల్లిగా పంపమని స్వామివారిని ప్రార్థించాను.

## వైష్ణవ సంప్రదాయం ప్రకారం అపరకర్మలు చేయుమనుట

తరతరాలుగా మాది శైవ సాంప్రదాయం. ఆ సాంప్రదాయం ప్రకారమే మా తల్లికి 12వ రోజు అపర కర్మలను చేయ నిశ్చయించాము. మా ఇంటి బ్రాహ్మణునికి ఈ కార్యక్రమము నిర్వహించమని చెప్పాము. కాని సరిగ్గా దీనికి ఒక రోజు ముందు నా భార్యకు ఒక కల వచ్చింది.

కల : ఈ కలలో పడగ విప్పి ఉన్న ఒక నాగుపాము చిన్నగుండవెల్లిలోని మా ఇంటిలో సురేఖ చూచిందట. ఈ పాము పడగ విప్పి భూమిపై నుండి కొంత పైకి లేచి తననే చూస్తున్నదట. ఇంతే కల. అప్పుడు దీనర్థమును మేము గ్రహించలేదు. కాని ఇదే రోజు ఉదయం మా ప్రక్క గ్రామము పుల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకుడు మరియు శ్రీవైష్ణవుడైన నా చిన్ననాటి మిత్రుడు శ్రీమాన్ కలకుంట్ల వేంకట లక్ష్మీనరసింహాచార్యులు గారు ఒక పూజారి వస్త్రధారణలో మా ఇంటికి వచ్చి మా అమ్మ అపర కర్మలను శ్రీవైష్ణవం ప్రకారం చేద్దాం అన్నాడు. నేను వెంటనే ఒప్పుకున్నాను. బహుశా శ్రీవేంకటేశ్వరుని అభిమతం కూడా ఇదే అయి ఉంటుందని, రాత్రి కలకు అర్థం ఇదే అని భావించాము. చివరికి మా అమ్మ అపర కర్మలను శైవ సాంప్రదాయంతో పాటు వైష్ణవ సాంప్రదాయం ప్రకారం కూడా నిర్వహించాము. ఆ తరువాత బాధాతప్త హృదయంతో హైదరాబాద్ వచ్చాము.

తెలిసి వేసినా, తెలియక వేసినా, నేను వేసే ప్రతి అడుగు స్వామి వైపే వెళ్ళింది. స్వామివారి ప్రేరణతో మా అమ్మ ఋణం తీర్చుకొనుటకు, నేను నా మూడవ వంతు పుణ్యమును ధారపోశాను. ఇది పైకి చిన్నగ కనిపిస్తుంది. కాని ఈ సంఘటనతో తరువాత రోజులలో స్వామివారు ఒక మహత్తరమైన మలుపు త్రిప్పాడు. ఈ విషయాన్ని సమయం వచ్చినప్పుడు వివరిస్తాను.


ఇంతటితో నేను వ్రాసిన ఆరు అనుభూతుల పుస్తకములలో రెండవ పుస్తకము పూర్తైంది. ఇంతవరకు 250 కంటె పైగా లీలలను ప్రచురించాము. 3వ పుస్తకములో కేవలం 16 లీలలే లభించాయి. మిగిలినవి పోయినవి. ఇప్పుడు మూడవ పుస్తకములోని అనుభూతులను తెలుసుకుందాం!

## తిరిగి దారిలో పెట్టుట

మా అమ్మ చనిపోయిన బాధలో కూడ మేము శ్రీవేంకటేశ్వరుని స్మరణలో ఆటంకము ఏర్పడలేదు, కాని సేవలో ఆటంకము ఏర్పడ్డది. ప్రతి సంవత్సరం 70 వేల జప పుస్తకములను భక్తులకు ఉచితంగ పంచాలి. వీటిని దశల వారీగా ప్రింట్ చేస్తాము. 7వ పర్యాయంగా ముద్రించిన 30 వేల జప పుస్తకములు అయిపోయాయి. మిగిలిన 40 వేల పుస్తకములు ముద్రించుటలో ఆలస్యమైంది. భక్తులు జప పుస్తకాల కోసం మా ఆఫీసుకు వచ్చి లేవని తెలుసుకుని వెళ్ళిపోవుచున్నారు. పెద్ద మొత్తంలో జప పుస్తక వితరణ చేసే భక్తులు కూడా అడుగుచున్నారు. గత ఆరు సంవత్సరాల నుండి ఎప్పుడు జరగని లోటు ఇప్పుడు జరిగింది. అయినప్పటికి నాలో చలనము లేదు. చేద్దాములే... తొందరేముందనే భావనలో ఉన్నాను. శ్రీవేంకటేశం మాసపత్రిక ప్రచురించుటలో కూడా ఆసక్తి తగ్గింది. 6వ పర్యాయం జప సమర్పణ ఫొటోలను ఆఫీసులో డిస్ప్లేలో పెట్టలేదు. ఇంత నిర్లక్ష్యమును ప్రదర్శించాను. గత వారం రోజుల నుండి నేను ఏదో తప్పు చేస్తున్నాను సరి చేసుకోవాలని అనుకుంటున్నాను కాని చేసుకొనుట లేదు. ఇలాంటి సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కటి లీలను చూపి మళ్ళీ మమ్మల్ని పూర్వపు స్థితికి తీసుకువచ్చాడు. ఈ లీల సురేఖకు కలిగించాడు. ఆ లీల ఈ విధంగా ఉంది.

హబ్సీగూడలోని మా ఇంటి డ్రాయింగ్ హాల్ లో మెయిన్ డోర్ కు ఎదురుగా ఉన్న గోడకు ఒక పెద్ద శ్రీవేంకటేశ్వరుని ఫొటో ఒకటుంటుంది. మేము సాధారణంగా ఎవరైనా వస్తే తప్ప ముందు రూంలో ఉండము. ఈ కలలో కూడా మేము ఇంటి లోపల ఉన్నామట.

**తేది 29-11-2008 కల :** ఒక వ్యక్తి హబ్సీగూడ లోని మా ఇంటికి వచ్చినారట. అప్పుడు మేము ఇంటి లోపల ఉన్నామట. నేను ఏదో విషయమై చింతిస్తూ లోపల ఉన్నానట. సురేఖ మాత్రం




ఎవరొచ్చారో చూద్దాం అని బయటకు వచ్చిందట. ఆయన ఎవరో ఈమెకు సరిగ్గా కనపడలేదట. ఆయన ఈమెకు మసక మసకగా, కనబడి కనపడకుండా, ఎవరో తెలియకుండా ఉన్నారట. కాని ఒక వ్యక్తి మా ఇంటికి వచ్చారని మాత్రము ఆమెకు తెలుస్తోంది. ఆయనను తను ఇంతకు ముందు చూచిన దాఖలాలు లేవట. అందుకని ఎవరు వచ్చింది... ? ఎవరది... ? అని అనుచూ... ఆయన వద్దకు వెళుచున్నదట. ఇంతలో ఆ వచ్చిన వ్యక్తి "నన్ను గుర్తుపట్టడం లేదా...? నన్ను మరచిపోయారా...?" అని అన్నారట. ఈమె ఆయన వద్దకు వెళ్ళేకొద్దీ ఆ వ్యక్తి ఆకారము నల్లగా మారుచున్నదట. ఇంకా దగ్గరగా వెళ్ళేకొద్దీ ఆయన నల్లని ముఖము మాత్రమే అగుపడుచూ అందులోని తెల్లని నామము మెల్ల మెల్లగా అగుపడుచున్నదట. ఈమె పూర్తిగా ఆయన వద్దకు వెళ్ళేసరికి గోడపై ఉన్న శ్రీవేంకటేశ్వరుని ఫొటోలోని స్వామివారి ముఖము మాత్రమే పెద్దగా అంటే ఒక మనిషి ముఖమంత సైజుతో కనబడిందట. కల చెదిరింది. ఈ విషయమును నాకు తెల్లవారి చెప్పింది. నా ఒళ్ళు ఝల్లుమంది.

ఈ విధంగా మమ్ములను మళ్ళీ ఆయన సన్నిధిలోకి తెచ్చుకొని, మారుచున్న మా మనస్సును సరైన దారిలో పెట్టారు, నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. వారికి కోటి కోటి ప్రణామాలను అర్పించాము.

## మా మొదటి అమెరికా ప్రయాణము – స్వామి వారి లీలలు

నా భార్య తరపు బంధువులు చాలామంది అమెరికాలో ఉన్నారు. మా సురేఖ యొక్క ముగ్గురు అన్నలు మరియు ఒక అక్క అక్కడ స్థిరనివాసమేర్పరచుకుని ఉన్నారు. 1990 ప్రాంతమున మా అత్తకు అమెరికన్ సిటిజన్షిప్ వచ్చింది. అదే సంవత్సరం చివరలో మా అత్త కీ.శే శకుంతలా దేవి గారు మా మొత్తం కుటుంబానికి అంటే నా భార్యా పిల్లలకు, నాకు గ్రీన్ కార్డు కోసమై స్పాన్సర్ చేసింది. అది ఈమధ్యనే వచ్చింది. నిజానికి మాకు అక్కడ సెటిల్ కావలెనని లేదు కాని చూచి రావలెనని ఉన్నది. నా భార్యకు మాత్రము అమెరికా వెళ్ళాలని కొంచెము ఎక్కువ ఇష్టంగా ఉన్నది. ఇపుడు అమెరికా వెళ్ళుటకు తగిన ఏర్పాట్లు జరుగుచున్నవి. కాని నాకు మాత్రం నేను అమెరికా

వెళ్ళాక స్వామి సేవకు దూరమవుతాననే భయము వెంటాడింది. ముఖ్యంగా స్వామి లీలలను చూడనని, అక్కడ స్వామివారు తన లీలలను ప్రసాదించునా? లేదా? అని అనుమానం వేసింది. నేను నా స్వామిని, ఆయన సేవలను విడిచి ఎలా ఉండగలను అనే ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి ఐనాను. మరోప్రక్క నా స్వామివారు నిర్మించిన ఈ మొత్తం విశ్వమును చూడకపోయినప్పటికీ అవకాశము వచ్చిన కొన్ని దేశములనైనా చూచి ఆనందించుదును కదా అనిపించింది. ఇలా ఉన్న నాకు ఈరోజు రాత్రి ఈ విధంగా కల వచ్చింది.

**తేది 18-12-2008 కల :** నేను నా కుటుంబంతో కలిసి అమెరికా లేదా ఒక విదేశము పోయినానట. అది మన దేశము కంటె సుఖవంతమైన దేశమట. అక్కడికి పోయి స్థిరపడిన వారు, కొంచెం నెమ్మదస్తులుగా, తెల్లగా ఉన్నారు. నేను ఒకరి ఆఫీసులో కూర్చున్నాను. అక్కడ ఉన్నాయన నాతో శ్రీవేంకటేశం మాసపత్రిక గురించి మాట్లాడసాగారు. ఇంతలో ఒక మంచి పేరుగల తెలుగు కవి వచ్చి మా టేబుల్ ప్రక్కన కూర్చున్నారు. ఆయన ముఖమును చూడగనే ఈయన మంచి పేరు గాంచిన తెలుగు కవియని, కాని చాలా రోజుల క్రితము ఈ దేశములో స్థిరనివాసమేర్పరచుకొన్నారని భావించాను. మరియు ఆయన స్వామివారికి మంచి భక్తుడట. దీనితో నా సంతోషం మరింత పెరిగింది. మేమందరము ఈ శ్రీవేంకటేశం పత్రికను ఇంకా మంచి మంచి వ్యాసాలతో బలోపేతము చేయాలని మాట్లాడుకున్నాము. తరువాత మేము ఒక హోటల్ కు వెళ్ళాము. అక్కడ మాకు సప్లై చేయువారు ఎవ్వరూ లేరు. మేము స్వయం సేవగా వడ్డించుకోవాలట (సెల్ఫ్ సర్వీస్). కాని అక్కడివారు కూడా తెలుగువారే. తరువాత సీను మారింది. మా కుటుంబము ఒక ఇంటినుండి ఎక్కడికో వెళ్ళుటకని బయలుదేరి రోడ్డుపైనుండి ప్రయాణిస్తున్నాము. అప్పుడు 25-30 సంవత్సరాల వయసున్న ఒక పూజారి అంటే పంతులుగారు పంచె, ఉత్తరీయము ధరించాడు, ముఖానికి విభూతి ధరించి ఒక లూనా పైన మాకు అడ్డంగా అంటే ఆ రోడ్డుకు ఒకవైపు నుండి ఇంకోవైపుకు వెళ్ళాడు. ఆయన వెళ్ళేవైపున క్రింద ఒక గంగ లాంటి పుణ్యక్షేత్రమున్నదట. ఈ పూజారి అక్కడ పూజ నిర్వహించుటకు అక్కడికి వెళ్ళుచున్నాడట. ఈయన కూడా చాలా రోజుల క్రింద తెలుగు ప్రాంతం నుండి వచ్చిన పురోహితుడు కావటం విశేషం. ఆయన మమ్ములను, నన్ను చూసి రండి నేను క్రిందికి పోవుచున్నాను, మీకు పూజను నిర్వహించగలననే సైగ చేయుచూ వెళ్ళాడు. మేము ఆయన సైగను చూచి సరే వచ్చేదమని మనస్సున అనుకుని మా ప్రయాణము సాగించాము. కాని మేము పూజ వైపు కాక వేరేవైపు వెళ్ళిపోయాము. కల చెదిరింది. అంటే దీనర్థం అమెరికాలో కూడా ఇండియాలో లాగా దైవపూజలు జరుగును కాని కొంచెం విధి విధానాలలో భేదముంటుంది. అక్కడివారు ఇక్కడ కంటే సుఖవంతమైన జీవితమును గడుపుతారు. భగవంతుని కృప అక్కడ కూడా మనతో సమానంగా ఉండునని అర్థం.

నా దశ : నిజాయితీగ బ్రతుకుదునని స్వామివారికి మాట ఇచ్చాను. రథమును త్రిప్పిన ప్రతి ఇల్లును స్వామివారు అనుగ్రహించారు. నా మూడవ వంతు పుణ్యాన్ని ధారపోసి మా తల్లికి వైకుంఠాన్ని ప్రదర్శించమని ప్రార్థించాను.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050, 93482 12354



తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
**దిశానిర్దేశము**



స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్

# ముక్కోటి ఏకాదశి

**– ఎస్.ధర్మారావు**

ముక్కోటి దేవతలు శ్రీవైకుంఠంలో చేరి శ్రీమన్నారాయణుని సేవించుకునే పర్వదినమే ముక్కోటి ఏకాదశి. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన తరువాత వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు భక్తి శ్రద్ధలతో ఎవరైతే ఉపవాసముండి భగవన్నామ సంకీర్తనం, జాగారంతో గడుపుతారో వారికి తప్పక మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.

ఈ ఏకాదశిని మోక్షదా ఏకాదశిగా వేదవ్యాస మహర్షి కీర్తించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు శేషశయ్యపై జగద్రక్షణా చింతనా పరమైన యోగనిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువు నాలుగు నెలల తరువాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొని బ్రహ్మాది దేవతలకు దర్శనభాగ్యం ప్రసాదించే పర్వదినం ఇదని, సృష్ట్యాదిలో విశ్వసృష్టికి సంకల్పం చేసిన రోజని శాస్త్రాలు చెబుతున్నాయి.

భగవద్దర్శనం కోసం పరితపించే దేవతలందరూ ఈ నాలుగు నెలలు దీక్షతో ''చాతుర్మాస్య వ్రతం''గా ఆచరిస్తారని ''యత ధర్మ సముచ్చయం'' అనే ధర్మశాస్త్రం చెప్తోంది. సకల జీవరాసులలో విష్ణురూపంగా, అంతర్యామిగా ఉన్న పరమాత్మకు విశ్రాంతి (యోగ కాలమైన ఈ నాలుగు మాసాలలో అందరూ దైవచింతనతో ఉండాలని ''ఆర్షవాణి'' బోధిస్తుంది). అందుకే యతీశ్వరులు, సన్యాసులు తమ నిత్య సంచారం మానివేసి ఏదో ఒక పవిత్రమైన చోట జప తపాదులతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.

చాతుర్మాస్య వ్రతానికి ఫలంగా వచ్చే మార్గశిర శుద్ధ ఏకాదశియే ఈ ముక్కోటి ఏకాదశి. సంక్రమణాన్ని అనుసరించి ఒక్కొక్కసారి పుష్యశుద్ధ ఏకాదశి నాడు కూడా ఈ ఉత్సవాన్ని ఆచరిస్తారు. పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి యున్న శ్రీమహావిష్ణువును ఎవరైతే సేవిస్తారో, వారికి భగవదనుగ్రహం, మోక్షం తప్పక కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఉత్తర ద్వార దర్శనం వల్ల జన్మరాహిత్యం, మోక్షం తప్పక కలుగుతాయని ''పరమ పురుష సంహిత'' అనే ఆగమ శాస్త్రం తెలుపుతోంది. అల వైకుంఠపురములో, నగరిలో, ఆ మూల సౌధంబులో అని మహాభాగవతంలో పోతన అన్నట్లు ధ్రువ మండలానికి ఈశాన్యంగా, బ్రహ్మాండానికి ఆవల త్రిపాద్విభూతిగా వేదం కీర్తించిన శ్రీవైకుంఠంలో శ్రీమహావిష్ణువు ఉత్తరద్వార ముఖంగానే పరివేష్టించి ఉంటాడని ''అర్చిరాది'' గ్రంథంలో ఉంది. ''స్వస్తిక'' గృహం వలె నాలుగు ద్వారాలతో విరాజిల్లే శ్రీవైకుంఠ భవనానికి ఉత్తరద్వారం నుంచే శ్రీమన్నారాయణుని సేవించాలని నిర్ణయించడం జరిగింది.



ఉత్+తర = ఉత్తర అనగా బ్రహ్మాండమును తరింపచేసే విష్ణు పదములను పొందించునది అని అర్థము. సాధకుడగు పురుషుడు స్నాన సంధ్యావందనాది నిత్య కర్మానుష్ఠానములు సలిపి కల్పోక్త ప్రకారంగా నానా విధ వేద మంత్రములు చేతగాని, పురుషసూక్తము చేతగాని శ్రద్ధా భక్తి యుక్తుడై పూజ చేయవలెను. ఎలాగంటే ప్రథమమందు పంచామృత స్నానం గావించి ఆ పిమ్మట శుద్ధోదకముచే అభిషేకమొనర్చి మహావిష్ణువును సర్వ వస్త్రములచే అలంకరించి నానా విధములగు పుష్పముల చేతను, ధూపదీపముల చేతను పూజించి, భక్తిపురస్సరముగా నైవేద్యమునిచ్చి, దక్షిణ తాంబూలములనిచ్చి, ఆ పిదప కర్పూర నీరాజనములను సమర్పించవలెను.

లోకములందు ఎవ్వరేనియు ఈ ప్రకారము పూజ గావించెదరో వారు సకల పాపాలచే విడువబడి సమస్త సంపదలు సమృద్ధిగా కలిగి మిక్కిలి జయశాలురై ఉందురు. పూజ చేసిన తర్వాత సంతుష్టుడు గాను, స్వచ్ఛమైన మనస్సు కలవాడు గాను కాగలడు.

పూజ కాలమునందు ధూప దీపములు చేసినవాడు గంగాస్నాన ఫలము పొందును. పాపము గల వారెవ్వరైనను నీరాజనమును చూచినట్లైతే వాని పాపమంతయు నిప్పులో పడిన పత్తిపోగు వలె మండిపోవును. ఎవరు నీరాజనమును నేత్రములయందు, శిరస్సునందు అద్దుకొనునో వారికి విష్ణులోకము కలుగును.

**సర్వేజనాః సుఖినో భవంతు**

# శీల వైభవం

– మందరపు
వి.జి.శంకరాచారి

**తత్తు కర్మ తథా కుర్యాద్యేన శ్లాఘ్యేత సంసది**
**శీలం సమాస్ నైతత్ కలితం కురుసత్తమ...**

అంటే... ఏ పని చేస్తే నలుగురి మెప్పుని పొందుతామో అటువంటి పనినే తలపెట్టాలి. ఇలాంటి ఆమోదయోగ్యమైన పనులు చేసే వ్యక్తిత్వాన్నే "శీలం" అని అంటారు.

ఇటువంటి శీలం నిర్మితమవాలంటే మన మనసులలో ధర్మం, సత్యం, బలం, సిరి (లక్ష్మి) మొదలగు లక్షణాలన్నీ సవ్య మార్గంలో పయనించాలి. అలా పయనించాలంటే గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడే దానికి బీజం పడాలి. అందుకు ప్రథమ దోహదకారి జన్మనిచ్చిన తల్లి. తను గర్భం దాల్చినప్పటినుండి భక్తి మార్గంలో పయనించాలి. అందుకు సంబంధించిన రామాయణ, భాగవత గాథలను వినాలి. అధ్యయనం చేయాలి. సత్సంగంలో సాధ్యమైనంతవరకు పాల్గొనాలి. అప్పుడు ఈ పుడమిపై పడిన శిశువుకి మంచి లక్షణాలు అబ్బుతాయి. తదనంతరం వయసు పెరిగే క్రమంలో ఎదురుపడే చెడు లక్షణాలు, సావాసాలు దరికి చేరకుండా నిర్వీర్యమై సత్శీలం నిర్మాణమౌతుంది.

ఈవిధంగా సత్శీలమును నిర్మించుకున్న వ్యక్తి బాలప్రహ్లాదుడు. తల్లి గర్భము నందు ఉన్నప్పుడే నారద మహాముని భక్తితత్వ బోధనలను విని విష్ణుభక్తుడిగా మారాడు. సర్వకాల సర్వావస్థలయందు స్మరించే నారాయణ మంత్రమే అతడి రక్షా కవచం అయింది. తన భక్తుడిని రక్షించుట కొరకై కొత్త అవతారాన్ని ధరించి హిరణ్యకశిపుణ్ణి వధించాడు శ్రీమన్నారాయణుడు.

హిరణ్యకశిపుడి మరణానంతరం రాజ్య పట్టాభిషిక్తుడయ్యాడు ప్రహ్లాదుడు. అతడి యొక్క పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో, భక్తి తత్పరతతో జీవిస్తూ ఉండేవారు. జనరంజకమైన పాలన... ప్రహ్లాదుని వ్యక్తిత్వాన్ని ద్విగుణీకృతం చేసింది. ముల్లోకాలు అతడి పాదాక్రాంతమైనాయి.

అమరావతి అధిపతి ఇంద్రుడి ఆధిపత్యం మరుగున పడింది. ఇంద్రలోక ప్రజలంతా అతడి వ్యక్తిత్వానికి దాసోహమయ్యారు. అతడి పాలనలోకి అమరావతి వచ్చింది. ఇంద్రుడు తన పదవిని కోల్పోవడంతో నిరాశ నిస్పృహలకు గురయ్యాడు. ఏవిధంగానైనా ప్రహ్లాదుని దగ్గరనుండి తిరిగి రాజ్యాన్ని పొందాలని అనుకున్నాడు. అయితే అతడిపై యుద్ధానికి తలపడే సాహసం చేయలేదు. కారణం... ప్రజలంతా ప్రహ్లాదుని వ్యక్తిత్వానికి, రాజ్యపాలనకు ఇష్టపడి అతడి అధినాయకత్వంలో తాము నివసించాలని అనుకున్నారు. చివరికి ఇంద్రుడి సేవగణం కూడా ప్రహ్లాదుడికి సేవకులుగా మారిపోయారు.

ఈ స్థితిలో దిక్కుతోచని ఇంద్రుడు దేవతల గురువైన బృహస్పతి దగ్గరకు వెళ్ళి తన గోడును వెళ్ళబుచ్చుతాడు. అది విన్న బృహస్పతి ప్రహ్లాదుణ్ణి నిర్జించడం సాధ్యం కాదు. అతడ్ని ఎదిరించడం అంతకంటే సాధ్యం కాదు. పరిమితులు లేని అతడి భక్తి సమస్త ప్రజానీకం దాసోహమన్నట్లుగా చేసింది. ఈ విషయంలో తను ఏమీ చేయలేనని, అయితే రాక్షస గురువైన శుక్రాచార్యుడి వద్దకు వెళ్ళి ఈ సమస్యను తీర్చే తరుణోపాయాన్ని అడగమని సూచిస్తాడు.

ఆగ మేఘాలతో ఇంద్రుడు శుక్రాచార్యుని వద్దకు వెళ్ళి తన యొక్క ఇంద్ర పదవిని ప్రహ్లాదుడి దగ్గర నుండి తిరిగి పొందే మార్గమును చూపమని అడుగుతాడు. అప్పుడు శుక్రాచార్యుడు ప్రహ్లాదుడు సద్గుణశీల సంపన్నుడు. అతడిపై యుద్ధానికి వెడితే ఓటమి తప్పదు. అయితే ముందుగా నీవు ప్రహ్లాదుడి దగ్గరకు వెళ్ళి శిష్యుడిగా మారమని చెబుతాడు. కొంతకాలం పాటు గురువుకి శుశ్రూష చేస్తూ ఉండమని చెబుతాడు. శిష్యుడి వినయ విధేయతలకు మెచ్చి ఏ వరం కావాలో కోరుకోమని అడుగుతాడు. అప్పుడు మారువేష రూప ధారియైన ఇంద్రుడు "గురువర్యా! తమరు ఈ ముల్లోకాలకు అధిపతి ఎలా అయ్యారు? ఏ లోకంలోనూ రణభేరి మోగించలేదు. కానీ అన్ని లోకాలు మిమ్మల్ని అధిపతిగా పూజిస్తూ మీ మాటను అనుసరిస్తున్నారు" అని అడుగుతాడు.

అప్పుడు ప్రహ్లాదుడు "నాయనా! ఈ వైభోగం అంతా భగవంతుడు నాకిచ్చిన సత్శీలత వలనే సంభవించింది. త్రిలోకాలకు రాజునని ఏనాడూ పొంగిపోలేదు. బిచ్చగాళ్ళను ఏనాడూ తక్కువగా చూడలేదు. మట్టియైనా, మాణిక్యమైనా నా



దృష్టిలో ఒక్కటే. సంపదలు ఒనగూరినపుడు పొంగిపోలేదు. ఒకవేళ సంపదలు హఠాత్తుగా కోల్పోయినా కృంగిపోయే మనస్తత్వం నాకు లేదు. పట్టు పరుపులపై నిద్రించమన్నా, లేక కఠిన నేలపై నిద్రించమన్నా సంతోషంగా నిద్రపోతాను. నా మనసులో ఒకరికి కీడు చేయాలనే ఆలోచన ఉండదు. నిందించే తత్వమూ లేదు. ఈ సృష్టిలోని పదార్థాలన్నింటినీ ఒకేలాగ చూస్తాను. సమస్త ప్రజలలో నేను దైవత్వాన్నే చూస్తాను. ఇదంతా సత్శీలం వలననే సాధ్యమయింద''ని చెబుతాడు.

అప్పుడు ఇంద్రుడు అయితే మీ యొక్క శీల సంపదను నాకు ధారపోయమని అడుగుతాడు.

అందుకు ప్రహ్లాదుడు ''ఏదైనా ఇవ్వవచ్చును గానీ, శీలాన్ని ఇచ్చేస్తే ఎలా? నా తేజస్సుని కోల్పోతాను. అయినా సరే శిష్యుడిగా నీ వినయ విధేయతలకు మురిసి నా శీలాన్ని నీకు ధారాదత్తం చేస్తున్నాను'' అంటూ తన సత్శీలాన్ని ధారపోస్తాడు.

ఆ మాట ప్రహ్లాదుడి నోటివెంట వచ్చిన వెంటనే అతడి శరీరం నుండి దివ్యమైన తేజస్సుతో ఒక పురుషుడు బయటకు వస్తాడు. అతడ్ని చూసిన ప్రహ్లాదుడు ''ఎవరు నీవు'' అని ప్రశ్నిస్తాడు. దానికి అతడు నువ్వు దానం చేసిన శీలాన్ని అంటాడు. ఇంతలో మరియొక పురుషుడు బయటకు వస్తాడు. అతడ్ని చూసిన ప్రహ్లాదుడు ''నువ్వెవరు?'' అని అడుగుతాడు. ''నేను ధర్మాన్ని.. శీలం ఎక్కడుంటే నేను అక్కడ ఉంటాను'' అని చెప్పి ఇంద్రుడి శరీరంలోకి వెళ్ళిపోవడం గమనిస్తాడు ప్రహ్లాదుడు.

వెంటనే మరియొక పురుషుడు బయటకు వచ్చి ఇంద్రుడి శరీరంలోకి వెళ్ళబోతుంటే ''నువ్వెవరు?'' నానుండి వేరుపడి మరియొక శరీరంలోకి వెళ్ళిపోతున్నావు?'' అని అడుగుతాడు. దానికి ఆ పురుషుడు ''నేను సత్యాన్ని, శీలం, ధర్మం ఎక్కడ ఉంటే నేను కూడా అక్కడే ఉంటాను'' అని చెప్పి శీలం, ధర్మం కలిగియున్న ఇంద్రుడి శరీరంలోకి సత్యం కూడా వెళ్ళిపోతుంది.

ఈవిధంగా శీలం, ధర్మం, సత్యం వెళ్ళిపోయిన మరుక్షణమే ఇంకొక పురుషుడు బయటకు వస్తాడు. అప్పుడు ప్రహ్లాదుడు అతడిని ''నువ్వెవరు?'' అని అడుగుతాడు. దానికి అతడు ''నేను నీ బలాన్ని. శీలం, ధర్మం, సత్యం ఎక్కడ మనుగడ సాగిస్తాయో నేను కూడా అక్కడే ఉంటాను'' అని చెప్పి ఇంద్రుడి శరీరంలోకి వెళ్ళిపోతాడు.

బలం వెళ్ళిపోగానే ప్రహ్లాదుడి శరీరం కృంగిపోతుంది. ఇంకొంత సేపటికి ఒక స్త్రీ రూపం బయటకు వస్తుంది. అప్పుడు ప్రహ్లాదుడు నిస్సత్తువగా ''నీవెవరమ్మా?'' అని అడుగుతాడు.

''నేను నీ యొక్క సిరిని. అంటే లక్ష్మీదేవిని. శీలం, ధర్మం, సత్యం, బలం ఎక్కడుంటాయో నేను కూడా అక్కడే ఉంటాను'' అని చెప్పి ప్రహ్లాదుడి శరీం నుండి విడివడి ఇంద్రుడి దేహంలో భాగమైపోయింది. అప్పుడు ప్రహ్లాదుడికి తన శిష్యుడు ఎవరై ఉంటారన్న సందేహం వచ్చి ''నువ్వెవరివి? ఇంతకాలం నుండి శుశ్రూష చేశావు. నా లోని శీలాన్ని కోరడానికా?'' అని అడుగుతాడు.

అప్పుడు ఇంద్రుడు ''మహారాజా! నన్ను క్షమించండి. మీ శీలవైభవం వలన నేను నా రాజ్యాన్ని కోల్పోయాను. నేను వేరెవరినో కాను. అమరావతికి రాజైన ఇంద్రుణ్ణి. నీ శీల వైభవం వల్ల నేను నిన్ను ఎదిరించి రాజ్యాన్ని దక్కించుకోలేను. కాబట్టి మీ గురువు గారి సలహా మేరకు బ్రాహ్మణ రూపంతో వచ్చి మీకు శుశ్రూష చేశాను. మీ శీలసంపదనంతా నాకు దానం చేయడం వలన నేను తిరిగి రాజ్యాన్ని పొందుతాను'' అని చెప్పి స్వర్గ లోకానికి వెళ్ళిపోతాడు.

శీలవైభవాన్ని కోల్పోయిన ప్రహ్లాదుడి దగ్గరకు విష్ణుమూర్తి వచ్చి ''నువ్వు ఇచ్చిన శీలం ఇంద్రుడిలో ప్రహ్లాదశీలంగా ఇంద్రుడికి సంపదలు ఇస్తుంది. నువ్వు శీలవైభవాన్ని కోల్పోయానని చింతించనవసరం లేదు. నీకు నాతో సమానమైన శీలాన్ని ఇస్తున్నాను. నేను ఎన్ని లీలలు చేయగలనో అన్ని లీలలు నువ్వూ చేయగలవు అని ప్రహ్లాదుడికి సత్శీలాన్ని అనుగ్రహించి పాతాళ లోకానికి రాజుని చేసి తన భక్తుణ్ణి రక్షిస్తాడు శ్రీమన్నారాయణుడు.

★ ★ ★

# అగ్నుల బోధ అను ఉపకోశలుడి చరితము

– చిల్లర సీతారామారావు

పూర్వకాలమున విద్యాబోధన అరణ్యప్రాంతములలో, ప్రశాంత వాతావరణమునందు, మహర్షులచే ఏర్పాటు చేయబడిన గురుకులములలో జరుగుతుండెడిది. ధనికుడి పిల్లలయినా, రాజుగారి పిల్లలయినా, పేదవాడి పిల్లలయినా గురుకులమున చదవవలసిందే. గురుకులమునందు ప్రవేశించిన విద్యార్థి, విద్యాబోధన పూర్తయ్యేవరకు, గురుకులములోనే ఉండాలనే నియమం ఉండేది. గురువుగారు ఏది చెప్పినా, ఏది చెయ్యమని ఆజ్ఞాపించినా, దానిని విద్యార్థి గురువుగారి వచనము, మా శ్రేయస్సు కొరకే అని భావించి కర్తవ్య నిష్ఠతో దానిని పూర్తి గావించెడివారు. గురుకులమునందు ప్రవేశము లభించిన వెంటనే విద్యాబోధన ఆరంభమయ్యేడిది కాదు. గురువుగారు విద్యార్థి శారీరక, మానసిక స్థితిగతులను పరీక్షించిన తరువాతే విద్యాబోధనను మొదలుపెట్టెడివారు. విద్యాబోధన ముగిసిన తరువాత 'సమావర్తనము' అను ఉత్సవమును జరిపెడివారు. వేదాధ్యయనము ముగించుకొని గృహస్థాశ్రమ స్వీకారం కోసం, గృహమునకు తిరిగి వెళ్ళునప్పుడు గురువుగారి సమక్షములో జరిగే ఒకానొక వేడుకను 'సమావర్తనము' అని అంటారు.

అది ఒక ప్రశాంతమైన గురుకులము. ఆ గురుకులము చుట్టూ వివిధ రకములైన కూరగాయ పాదులతో ఆహ్లాదకరమై ఒప్పారుచున్నది. ఆ గురుకులమునకు అధిపతి సత్యకామ జాబాలి. ఈయన గోవుల ద్వారా జ్ఞానము పొందిన మహనీయుడు. కామల కుమారుడైన ఉపకోశలుడు వేదాధ్యయనము కొరకు సత్యకామ జాబాలి ఆశ్రమమునకు వచ్చాడు. ఉపకోశలుడి మందకొడితనాన్ని గమనించిన గురువుగారు, దానిని పోగొట్టుటకు అతడికి గోసంరక్షణ బాధ్యతను అప్పగించాడు. గోవులను ఉదయమే మేపడానికి తీసుకొనిపోయి, అవి కడుపారా మేసిన తర్వాత, సాయంకాలం వాటిని గురుకులాశ్రమమునకు తీసుకొని రావడము ఉపకోశలుడి బాధ్యత. రెండు సంవత్సరములు గడిచిపోయాయి. కాని ఉపకోశలుడిలో గురువుగారు ఆశించిన మార్పు కనబడలేదు. గురువుగారు ఉపకోశలుడికి విద్యాబోధన మొదలుపెట్టలేదు. ఈసారి నిత్యాగ్నిహోత్రములను సేవించు బాధ్యతను అప్పగించాడు. ఈ సేవలో అతనికి పన్నెండు సంవత్సరములు గడిచిపోయాయి. ఈ పన్నెండు సంవత్సరములలో గురువుగారు అనేకమందికి సమావర్తన మహోత్సవములను జరిపి వారిని గృహములకు పంపించి వేశారు. ఇంతకాలము గడిచినప్పటికీ గురువుగారు ఉపకోశలుడికి బ్రహ్మవిద్యను బోధించలేదు. మరొక సంవత్సరము గడిచిపోయింది. అగ్నుల సేవలో నిమగ్నుడైన ఉపకోశలుడికి సమావర్తన మహోత్సవ కోలాహలం విన్పించింది. అగ్నుల సేవను విడిచి బయటకు రాలేదు. కాని ఈసారి అంతర్గతముగా మథనపడసాగాడు.

సత్యకామ జాబాలి ధర్మపత్ని ఒకరోజు ఆయనతో – మీరు ఉపకోశలుడికి విద్యాబోధన గావించడం లేదు. అతడు వచ్చి చాలా కాలమయింది. మీరు చెప్పిన పనులన్నీ సవ్యంగా చేస్తున్నాడు. అతడికి బ్రహ్మవిద్యను బోధించండి అని కోరింది. ఆయన ఏమీ మాట్లాడకుండా అక్కడనుండి వెళ్ళిపోయాడు. కాని ఆయనకు తెలుసు ఉపకోశలుడు అగ్నులకు తాను చేస్తున్న సేవల ద్వారా వారిని సంతృప్తిపరుస్తున్నాడు. వారి ద్వారానే బ్రహ్మోపదేశమును పొందగలడు. ఈ కారణము చేతనే ధర్మపత్నికి సమాధానము ఇవ్వలేదు.

ఉపకోశలుడికి గురుపత్ని తనను గురించి, గురువుగారి దగ్గర ప్రస్తావించడము, గురువుగారు సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోవడం మున్నగు విషయాలు తెలిశాయి. మనసుకు చాలా బాధ కలిగింది. నేను బ్రహ్మోపదేశమును పొందడానికి అయోగ్యుడిని. కనుకనే గురువుగారు నాకు బోధించడం లేదు. గురువుగారు మనసు మార్చుకుని నాకు బ్రహ్మోపదేశము గావించువరకు ఉపవాసము ఉంటాను అని నిశ్చయించుకున్నాడు. ఉపకోశలుడు భోజనమునకు రావడం లేదని గురుపత్నికి తెలిసింది. ఆమె ఉపకోశలుడి దగ్గరకు వచ్చి భోజనమునకు ఎందుకు రాలేదు? అని అడిగింది. తల్లీ! ఈ నిర్భాగ్యుడి మనస్సులో అనేక కోరికలు ఉన్నాయి. ఆ కోరికలు నెరవేరడము లేదు. మానసిక వేదనకు లోనయినాను. నాకు నిరాహార దీక్షయే సరియైనదని భావించి భోజనమునకు

రావడము లేదు. నన్ను క్షమించు తల్లీ! అని పలికాడు. గురుపత్ని మౌనంగా అక్కడినుండి వెళ్ళిపోయింది.

అగ్నులు మూడు రకాలు. గార్హపత్యాగ్ని, అన్వాహార్య పచనాగ్ని, ఆవహనీయాగ్ని – ఈ మూడు అగ్నులను కలిపి త్రేతాగ్నులు అని పిలుస్తారు. భక్తి శ్రద్ధలతో తమను సేవిస్తున్న ఉపకోశలుడి మనో వ్యాకులతను త్రేతాగ్నులు గమనించాయి. ఉపకోశలుడికి బ్రహ్మము గురించి ఉపదేశిద్దామన్న నిర్ణయానికి వచ్చాయి. త్రేతాగ్నులు ఉపకోశలుడికి బోధించడం మొదలుపెట్టాయి. ఓయీ బ్రహ్మచారీ! 'ప్రాణము, బ్రహ్మము, కం బ్రహ్మము, ఖం బ్రహ్మము అని అర్థం చేసుకొనుము అని పలికాయి. ఉపకోశలుడు వారితో 'ప్రాణము బ్రహ్మము అని నాకు తెలుసు. కాని 'కం', 'ఖం' వీటిని గురించి నాకు తెలియదు' అని జవాబిచ్చాడు. అంత త్రేతాగ్నులు అర్థము కాలేదని చింతింపకుము. మేము వివరిస్తాము. 'కం'ను 'ఖం'గా భావించుము. 'కం' అంటే ప్రాణము అని అర్థం. 'ఖం' అంటే ఆకాశం అని అర్థం. ప్రాణము, ఆకాశము ఈ రెండు అభిన్నములు అని వివరిస్తూ త్రేతాగ్నులు విడివిడిగా, ఒక్కొక్కరు బోధించడం మొదలుపెట్టారు. మొదటిది గార్హపత్యాగ్ని ఇలా బోధించింది. పృథ్వి, అగ్ని, అన్నము, ఆదిత్యుడు – ఇవి నా శరీరములోని భిన్న భిన్న రూపాలు. ఆదిత్యుడిలోని పురుషుడను నేనే అగ్నిని, ఆదిత్యుడిలోని ఈ రూపాన్ని గుర్తించి ఆరాధించినవారు అవశ్యము అగ్ని లోకమును పొందుతారు. వాళ్ళకు దీర్ఘాయువు ప్రాప్తిస్తుంది. జీవితం సుఖమయంగా, సువిభాజనంగా సాగిపోతుంది. వంశము అభివృద్ధి చెందుతుంది. ఇహలోకము నందు, పరలోకము నందు అతనికి అగ్నిరక్షణ లభిస్తుంది. గార్హపత్యాగ్ని అనగా ఇంటియందు ఎల్లప్పుడు రక్షింపబడునది అని అర్థము. రెండవది అన్వాహార్య పచనాగ్ని. ఆ అగ్ని ఇలా బోధించింది. జలము, దిశ, నక్షత్రము, చంద్రుడు నా శరీరములోని భిన్న భిన్న రూపాలు. చంద్రుడిలోని పురుషుడను నేనే. అగ్నిని. చంద్రుడిలోని ఈ రూపాన్ని గుర్తించి, ఉపాసించినట్లయితే పాపము వారిని అంటదు. లోకములకు అధిపతి అవుతాడు. సంపూర్ణ ఆయుర్దాయమును పొందుతాడు. అతని వంశము అభివృద్ధి చెందుతుంది. ఇహ, పర లోకములందు అగ్ని అతనికి రక్షణగా ఉంటుంది. అన్వాహార్య పచనాగ్ని అనగా గార్హపత్యాగ్ని నుండి అన్నము పక్వము చేయుటకు గ్రహింపు అగ్ని అని అర్థము. మూడవ అగ్ని ఆవహనీయ అగ్ని. ఈ అగ్ని ఈ విధముగా బోధించింది. ప్రాణము, ఆకాశము, ద్యులోకము, విద్యుత్తు – ఇవి నా శరీరములోని భిన్న భిన్న రూపాలు. విద్యుత్తులో కనిపించు పురుషుడను నేనే, అగ్నిని. విద్యుత్తులోని ఈ రూపాన్ని గుర్తించి ఆరాధించినట్లయితే వారికి ఎప్పుడూ శుభములే కలుగుతాయి. రక రకాలయిన సుఖ సమృద్ధులు, సత్సంతానము, దీర్ఘాయువు, స్వస్థత మున్నగు విషయములందు బాధ్యత, రక్షణ ఈ అగ్ని స్వీకరిస్తుంది. ఉపదేశానంతరము త్రేతాగ్నులు ఈవిధముగా అన్నాయి. ఉపకోశలా! సౌమ్యా! మాకు సంబంధించిన విద్యను అనగా ఆత్మవిద్యను బోధించాము. ఈ విద్య ఫలప్రాప్తి గురించి ఆచార్యుడు నీకు బోధించును. విద్యలు రెండు రకములు. మొదటిది ఆత్మవిద్య, రెండవది అగ్నివిద్య. పిండము నందు గల ప్రాణమే బ్రహ్మము అని తెలియజెప్పునది ఆత్మవిద్య. బ్రహ్మాండగత బ్రహ్మము యొక్క రూపములే అగ్నులు అని చెప్పునది అగ్ని విద్య. అగ్నుల బోధనలు ఉపకోశలుడికి అమితమైన ఆనందమును కలిగించాయి.

గురువు మాత్రమే శిష్యుల ప్రతిభా పాటవాలను గుర్తించగలుగుతాడు. ఉపకోశలుడు భవిష్యత్తులో ప్రతిభాశాలి కాగలడని, తన బోధనల కంటె ముందు అగ్నుల బోధలు జరగాలని ఆశించాడు. ఆ కారణము గానే ఉపకోశలుడి బోధన విషయంలో జాప్యం చేశాడు. బయటకు వెళ్ళిన ఆచార్యుడు తిరిగి గృహమునకు వచ్చాడు. ఉపకోశలుడిని పిలిచాడు. గురువుగారి పిలుపునందుకొని వచ్చిన ఉపకోశలుడు గురువుగారికి పాదాభివందనము గావించాడు. గురువుగారు ఉపకోశలుడి వదనము బ్రహ్మ తేజస్సుతో ప్రకాశించడం గమనించాడు. దానికి కారణం బ్రహ్మోపదేశమే అని గ్రహించాడు. అగ్నులు ఉపకోశలుడికి బ్రహ్మోపదేశము చేశాయి అని గ్రహించిన ఆచార్యునికి అమితానందము కలిగింది. ఏమీ తెలియనట్లు – ఉపకోశలా! బ్రహ్మవేత్తలాగా నీ వదనములో శాంతి తొణికిసలాడుతోంది. నీకు బ్రహ్మోపదేశము ఎవరు బోధించారు? అని ప్రశ్నించాడు. ఉపకోశలుడు సమాధానమిస్తూ అగ్నులు నాకు బోధించాయి అని పలికాడు ఉపకోశలుడు. ఆచార్యుడు ఆనందించి, ఉపకోశలా! తామరాకు మీద నీటిబిందువులు నిలువలేవు. ఆకునకు అంటవు. అలాగే పాప ప్రక్షాళనము ఫలింపచేయు జ్ఞాన సంపదను నీకు సంపూర్ణముగా బోధిస్తాను వినుము. గమనించాల్సిన విషయమేమిటంటే నేత్రములలో కనిపించు పురుషుడే ఆత్మ. ఆత్మను ఏ భయాలు ఆటంకపరచలేవు. ఆత్మయే అమృతము, అభయము. ఇదియే బ్రహ్మము అని తెలియచేస్తూ బ్రహ్మ విద్యా రహస్యములను బోధించాడు.

ఉపకోశలుడు గురువుగారి పాదపద్మములకు ప్రణమిల్లాడు. ఆచార్యా! నేను చాలా మూర్ఖుడిని. మీ మనస్సును అర్థము చేసుకోలేక పోయాను. అగ్నుల ద్వారా నేను ఉపదేశము పొందుటకు గాను ఇంతకాలము మీరు మౌనముగా ఉన్నారని అర్థము చేసుకోలేకపోయాను. నన్ను క్షమించండి అని పలికాడు. ఆచార్యుడు అతడిని ఆశీర్వదించాడు. సమావర్తన మహోత్సవమును ఘనముగా జరిపించి, గృహస్థాశ్రమ స్వీకరణకు అనుమతి నొసంగి పంపించివేశాడు.

★★★



# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**

శ్రీశైలేశ దయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవం।
యతీంద్ర ప్రవణం వన్దే రమ్యజామాతరం మునిమ్॥
లక్ష్మీనాథ సమారమ్భాం నాథయామున మధ్యమాం।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురుపరంపరామ్॥
యోనిత్యమచ్యుత పదామ్బుజ యుగ్మరుక్మ
వ్యామోహతస్తదితరాణి తృణాయమేనే।
అస్మద్గురో ర్భగవతోస్య దయైకసిన్థోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే॥
మాతాపితా యువతయస్తనయా విభూతిః
సర్వం యదేవ నియమేన మదన్వయానామ్।
ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా॥
భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగివాహాన్।
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోస్మి నిత్యమ్॥
శ్రీ గోదాదేవ్యై నమః
శ్రీమతే రామానుజాయ నమః

మానవుని విపరీత ధోరణికి విసిగి, మంచి నేర్పడానికి అవతరించిన మాధవుడు నీళాభవనంలో నిదురించినాడు. బిడ్డల దోషాలను క్షమించి, లాలనతో సన్మార్గం చూపడం పెద్దల వంతు. అంతేగాని వారిని మరచి, విడచుట తగదు; లేలెమ్మని శ్రీకృష్ణుని మేల్కొల్పి కర్తవ్య బోధ చేసిన ఉదార చరిత శ్రీ ఆండాళ్.

శ్రీ విల్లిపుత్తూరు పట్టణంలో విష్ణుచిత్తులనే భక్తశిఖామణికి తులసివనంలో అయోనిజగా ఈమె లభించింది. ఈమె కూడా 'భగవంతుని కొక మాలిక' యని భావించి 'కోతై' అని శ్రీ విష్ణుచిత్తులు పిలిచారు. ఆ పేరే 'గోదా'గా మారింది.

తండ్రి భగవానుని కోసం గుచ్చిన మాలికలను ముందుగా తాను ధరించి తగుదునా స్వామికి అని చూస్కొనేది బాల గోదా. ఒకనాడు తండ్రి కంట పడింది. తగదీ పని అంటూ తండ్రి ఆమెను దండించి, ఆ మాలలను దేవునికి పంపలేదు. స్వప్నంలో సాక్షాత్కరించిన స్వామి తనకామె దాల్చిన మాలలే కావాలన్నాడు. అచ్చెరువొందిన విష్ణుచిత్తులు 'తనను రక్షించు తల్లి ఈమె', 'ఆండాళ్' అంటూ ప్రశంసించగా అదే ఆమె పేరయ్యింది. 'ఆముక్త మాల్యద'గా ఆమె ప్రసిద్ధి చెందింది. భగవంతుని పాదాలని పంతం కట్టి, గోపికలు శ్రీకృష్ణునికై వ్రేపల్లెలో చేసిన కాత్యాయనీ వ్రతాన్ని అనుకరిస్తూ 30 దినాలు ఒక వ్రతమాచరించింది. రోజుకొక పాటను స్వామి ముందు ఆశువుగా గానం చేసింది.

తన ఊరే గోకులముగా, తోడివారంతా గోపీజనముగా, స్వామిమందిరము నందనందనుని భవనముగా, తానె గోపెమ్మగా భావించి గోపీత్వం పూర్తినందినది. చివరి దినాన శ్రీకృష్ణుడు ప్రసన్నుడై తన అభీష్టమును నెరవేరుస్తానన్నాడు. సకల భోగాలు ప్రసాదిస్తానన్నాడు.

గోదాదేవి భోగములందిన దినమే 'భోగి' అయింది. భగవంతుని ప్రాప్తికై ఆమె పాడిన తిరుప్పావై, సర్వమానవాళికి

సన్మార్గాన్ని, ఉపనిషత్సారాన్ని ప్రదర్శించే అపూర్వ, అపురూప విజ్ఞానఖని. సర్వశాస్త్ర సారమ ఇందులో ఇమిడి ఉంది. ఇది పాడిన వారికి సకలాభీష్టములు సులువుగా సమకూరుతాయని గోదాదేవి తన ఆచరణలో నిరూపించింది.

ధరించి విడిచిన ఒక మాలతో స్వామిని బంధించింది. స్మరించి పలికిన పాటల మాలలో బంధించింది. ఆశ్రితుల రక్షణలో భగవానుని నిర్బంధించింది. ఆ పాశురముల నొక్కొక్కటిగా అందుకొని, ఆ మార్గమనుసరించుట మానవ జన్మకు సార్థకాన్ని, సాఫల్యాన్ని ఇస్తుంది. తనవంటి యోగ్యతను మనకూ ప్రసాదించమని ఆమెను ఈ శ్లోకంతో ప్రార్థిద్దాం.

నీళాతుఙ్గస్తనగిరితటీ సుప్తముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతిశత శిర స్సిద్ధమధ్యాపయన్తీ ।
స్వోచ్ఛిష్టాయాం స్రజి నిగళితం యా బలాత్కృత్య భుఙ్క్తే
గోదా తస్యై నమ ఇదమిదం భూయ ఏవాస్తు భూయః ॥
అన్నవయల్ పుదువై యాండాళ్ అరఙ్గర్కు,
పన్ను తిరుప్పావై పల్ పదియం, ఇన్నిశైయాల్
పాడిక్కొడుత్తాళ్ నఱ్పామాలై పూమాలై
శూడిక్కొడుత్తాళై చ్చొల్లు
శూడిక్కొడుత్త శుడర్కొడియే తొల్పావై,
పాడియరుళవల్ల పల్వళైయాయ్, నాడినీ
వేఙ్గడవఱ్కెన్నై విది యన్ఱ ఇమ్మాత్తమ్,
నామ్ కడవా వణ్ణమే నల్గు.

ఇక మన ఊరు వదలి గోదాదేవి వెంట వ్రేపల్లెకు మనమూ పోదాం.

వయసొచ్చిన ఆడపిల్లలు కంటపడితే ఏడిపిస్తాడు కృష్ణుడని, ఈ ఊరివారంతా కృష్ణుడికి కనిపించకుండా గోపికలను దాచారు. ఆ పిల్లల అదృష్టం వల్ల ఆ ఏడాది వానలు కురవలేదు. పంటలు లేవు. గోవులకు గ్రాసం లేదు. జనజీవనం స్తంభించింది. పెద్దలనడిగారు. ఆడపిల్లలు వ్రతం చేస్తే వానలొస్తాయన్నారు. వ్రతానికి నాయకుడొకడు కావాలన్నారు. ఇష్టం లేకున్నా కృష్ణుడిని తమ స్వార్థం కోసం ప్రార్థించారు. తమ పిల్లలను కృష్ణుని చేరపెట్టి తమ అవసరాలను తీర్చే వ్రతం చేయించుకున్నారు.

అయిష్టంగాను, బింకంగాను అంగీకరించాడు స్వామి. అంగీకరించారు గోపికలు ఒకరినొకరు కలువవచ్చుకదా అని. వ్రతమేమిటో, ఎలా చేయాలో, ఏమి కావాలో చెప్పాడు శ్రీకృష్ణుడు గోపికలకు. చాల రాత్రి అయిందని తెలతెలవారుతూ తన భవనానికి వస్తే వ్రత సంభారాలన్నీ ఇస్తానని, అందరూ కలిసి రమ్మని చెప్పి వారి వారి నెలవులకు పంపాడు స్వామి. వ్రతమాచరించారు. ఊరివారి కోరికలు తీరాయి. తమ జన్మ ధన్యమైంది.

దేవుని ద్వేషించేవానికైనా, భౌతిక సుఖాలడ్డు కలిగితే అవి తీరడానికి దేవుని ఆశ్రయిస్తాడు. ఎలా ఆశ్రయించినా, తనను కోరితే చాలు అవసరములు తీర్చే కరుణామయుడు కదా స్వామి!

## 1వ పాశురము

మార్గళి త్తింగళ్ మదినిఱైన్ద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరి ళైయీర్ !
శీర్ మల్గుమ్ ఆయ్ ప్పాడి చ్చెల్వచ్చిఱుమీర్ గాళ్ !
కూర్వేల్ – కొడు న్దొళిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్ న్దకణ్ణి యశోదై యిళం శిఙ్గమ్
కార్ మేని చ్చెంగణ్ కదిర్ మదియమమ్బోల్ ముగత్తాన్
నారాయణనే ! నమక్కే ! పఱై తరువాన్
పారోర్ పుగళప్పడిన్దేలో రెమ్బావాయ్ !

తాత్పర్యము : భగవంతుని పొందదలచిన వెంటనే అనుకూలమైన మార్గశీర్షమాసము లభించినదే ! పైగా చల్లని చంద్రుడు కాంతులీను మంచిరోజులు ! కృష్ణ విరహము తీర వ్రత స్నానమాడదలచిన వారందరూ విచ్చేయుడు. సుందరాభరణ ధారిణులై, గోసంపద, గోవింద గుణసంపదలు అనుక్షణము పెరుగుచుండెడి గోకులమందు ఆ సంపదలతో తులతూగు బాలికలారా! ఇట్లు చేయబోవు మనకు, వాడియైన బల్లెమును దాల్చి సుతుని రక్షించుటకు హింసలు కూడ చేయ వెనుకాడని నందగోపుని యొక్క నమ్రుడైన పుత్రుడు, సౌందర్యముతో విప్పారిన కళ్ళార గాంచు యశోదమ్మకు సింహకిశోరమునైన నల్లని మేఘము వంటి మేను, ఎఱ్ఱతామరల వంటి నేత్రములు, ప్రియునకు చల్లని చంద్రుని వలె, శత్రువులకు తీక్ష్ణ సూర్యుని వలె తోచు దివ్య ముఖమండలము గల నారాయణుడే, అతనినే తప్ప కోరని మనకే పఱై అను పేరుకల ఒక వాద్య విశేషమును (వాయించునది) అనుగ్రహించును. ఇది కని లోకులందరూ సంతోషించునట్లుగ ఈ వ్రతము నాచరింతము రండి!

### అందరూ యోగ్యులే

విశేషార్థము : చెలియల్లారా! ఏమి భాగ్యము మనది మంచి పనులే చేయాలనుకుంటే అన్నీ చక్కగా కలిసివస్తాయి. మార్గశిర మాసము, వెన్నెల చంద్రుడుండే మంచి రోజులు. నంద వ్రజమున సంపద పొందిన గొల్లపడుచులారా! భగవదనుభవ స్నానమాచరించ కోరిక చాలు, అదియే అర్హత. ఆ కోరిక తీర్చు స్వామి మన నందగోపుడను ఆచార్యునికి అధీనుడై కుమారునివలె పెరుగుచున్నాడు. యశోదమ్మ ముద్దుల లేతసింహమై విహరించువాడు. నీలమేఘశ్యాముడు. ప్రేమ నిండిన నేత్ర యుగళికల మన స్వామి సాక్షాత్తు నారాయణుడు. ప్రేమించిన మన కోరికల నీడేర్చును. రండి! వ్రతమునకు సిద్ధము కండు అంటూ గోదా గోపిక వివరించింది.

మనిషిలోని దైవీశక్తులు మేల్కొనే కాలము ఉత్తరాయణ



పుణ్యకాలం. దానికి ముందున్నమాసం మార్గశీర్షమాసం బ్రాహ్మీముహూర్తం లాంటిది. సత్కార్యముల గురించి ఆలోచించే సాత్విక సమయం బ్రాహ్మీ ముహూర్తం. ఏడాదిలో జన్మను చరితార్థం చేసుకునే పనులకు అనువైన నెల మార్గశీర్షము.

పాడిపంటా ఈ నెలలో చేతికొచ్చినట్లే జ్ఞాన సస్యాన్ని ప్రేమ పంటనూ కూడా పొందించే నెల ఈ మార్గశీర్షం. కనుకనే "మాసానాం మార్గశీర్షోహం" – నేనే మార్గశీర్షమాస ప్రతిపాద్యుడనని భగవద్గీతలో భగవానుడు పలికాడు. కోరినవన్నీ తానిస్తానన్నాడు.

మనిషికి సుఖ సాధనాలుగా కర్మ, జ్ఞాన, భక్తి లాంటి సాధనాలెన్నో ఉన్నాయి. అవన్నీ భగవానుడి మీద ఆధారపడ్డవే. అచేతనాలు కూడ అవన్నీను. భగవానుడినే సాధనముగా అవలంబించిన వారికి ఇతర సాధనాల పని లేదు. ఫలప్రాప్తిలో లోటు లేదు. పురుషార్థ ప్రాప్తికి ఆలస్యమూ లేదు. కనుకనే అన్ని మార్గముల కంటే శిరస్థానీయమైన మార్గము భగవానుడు. అతడే "మార్గశీర్షము". అతణ్ణి ఆశ్రయించడం సులభము, సుకరమని చెప్పేదే మార్గశీర్షవ్రతం. ఇదే ఉపనిషత్తులు బోధించిన ఉత్తమ రహస్యం.

'ఓం' అనే అక్షరం వేదసారం. ఇదే ధనుస్సు. ఇందు సంధించవలసిన శరము జీవుడు. పరమానంద స్వరూపుడగు సర్వేశ్వరుడు లక్ష్యము ఇతర సాధనములు వదలి, ఆ బ్రహ్మయే సాధనమనే విశ్వాసంతో ఉన్నవానికి నిత్యానంద ప్రాప్తి ఖాయమని తెల్పిన ఉపనిషద్భోధ, ఆండాళ్ తిరుప్పావై ద్వారా చిన్నారి గోపికల శ్రీవ్రతముగ లోకానికందింది కనుక 'ధనుర్మాస క్రతు'వని అంటారు.

భగవానుడు దయ చూడగలడు. కాని 'భగవానుని చూపే గురువు' దయను తప్ప మరేమీ ఎరుగనివాడు. భగవానుడు సూర్యుని వలె తీక్షణమైనవాడు. అతని అనుగ్రహాన్ని తెల్పు ఆచార్యుడు చంద్రుని వలె చల్లనివాడు. మానవునిలో జ్ఞాన సస్యాలు పండించి, బ్రహ్మానందాన్ని పొందించే చంద్రుడు ఆచార్యుడే. ఆచార్యుని కృప లభించిన రోజే జీవితంలో జ్ఞాపకముంచుకొనదగిన రోజు. ఆచార్య కృపకు నోచని జీవి బ్రతుకు నీటిని వదలిన కమలము వలె నిరర్థకము – పరిత్యాజ్యమున్నూ. ఆచార్యుని వద్ద లొంగి ఉండే పరమాత్మ ఆచార్యుని మంత్రోపదేశం ద్వారా శిష్యుని హృదయారామంలో స్వేచ్ఛా సంచారములు చేస్తూ తన వైభవమంతటితో వీనిని లోకపూజ్యునిగా తీర్చిదిద్దుతాడు. ఇట్టి స్థితి పొందడానికి జాతి, కుల, మత, లింగ, వయో తారతమ్యాలేవీ అడ్డు రావు. బాగుపడాలనే 'కోరిక' ఒక్కటి చాలును. 'నీరాడప్పోదు వీర్' – పొందాలనే కోరికయే గొప్ప యోగ్యత సుమా! అంటూ ఈ ధనుర్మాస వ్రతఫలితాన్ని తెలిపి, ఎవరు అర్హులో తెలిపి, ఫలింపచేసేదెవరో మొదటి గాథలో వివరించినది మన ఆండాళ్.

## 2వ పాశురము

వైయత్తు వాళ్వీర్గాళ్! నాముమ్ నమ్ పావైక్కు
శెయ్యుం కిరిశైగళ్ కేళీరో, పాఱ్కడలుళ్
పైయిత్తుయిన్ఱ పరమనడిపాడి
నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్ నాట్కాలే నీరాడి
మైయిట్టె ళుదోమ్ మలరిట్టు నామ్ ముడియోమ్
శెయ్యాదన శెయ్యోమ్ తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్
ఐయముమ్ పిచ్చైయుం ఆన్దనైయుం కైకాట్టి
ఉయ్యుమాఱెణ్ణి ఉగన్దేలో రెమ్బావాయ్!

తాత్పర్యం : దుఃఖ భూయిష్టమైన ఈ భూమియందు జన్మించియు భగవంతుని దలచి సుఖించు వారలార! మరి మనము చేయబోవుచున్న తిరుప్పావై అను ఈ మార్గశిరస్నాన వ్రతమున కాచరించు విధానములను వినెదరా మరి పాలసముద్రాన నిశ్శబ్దముగ మొఱలాలకించుటకు పవ్వళించియున్న పురుషోత్తముని పాదములనే కీర్తింతము, విలాస వస్తువులగు పాలు త్రాగము, మరియు తెల తెల వారకయే స్నాన మాచరింతము, కాటు పెట్టుకొనము, పుష్పముల నలంకరించుకొనము, అంతేకాదు చేయదగని పనులను చేయనే చేయము. పరుల నొప్పించు మాటలాడము. పెద్దలను ఘనముగ

సత్కరించుట, సన్యాసి, బ్రహ్మచారులు యిత్యాది సత్పాత్రలలో భిక్ష నొసంగుటయును, చేతనైనంతవరకు దాపరికము లేక చేయుదము. ఈ రకముగ ఆనందముతో శాశ్వత సుఖాన్నొసగు ఉజ్జీవనను పొందుదము. ఇదియే మన వ్రతము.

విశేషార్థము : అద్యమే సఫలం జన్మ సుప్రభాతమే నిశా –

'నా చీకట్లు తొలిగాయి. జన్మ తెల్లవారింది. శ్రీకృష్ణ సందర్శనం కాబోతోందని ఆనందంతో అక్రూరుడన్న మాటలివి.

రోజులు జంతుకోటికీ గడుస్తాయి. అవి లెక్కపెట్ట తగినవి కావు. శ్రీకృష్ణ భగవానునికి సంబంధించిన జ్ఞానం కలిగిన రోజే మంచిరోజు. భగవానుని ఎదిరించక ప్రేమించే జన్మయే జన్మ. ఆ విశ్వాసాన్ని పెంచే కాలమే ధనుర్మాసం. అది గుర్తించడమే మార్గశీర్షవ్రతం.

ఆచార్యానుగ్రహం వల్ల దైవ విశ్వాసం ఏర్పడుతుంది. భగవానుడు సూర్యుడు. ఆచార్యుడు చల్లని చంద్రుడు. జన్మలనే రాత్రుల చీకట్లను ఆచార్య చంద్రుడు తొలగించి జ్ఞాన జ్యోత్స్నను నింపుతాడు. భగవత్ప్రేమ మదిలో నిండి కాపాడుకొను ఆచార్యుడే నందగోపుడు. అతని అధీనంలో ఉండే మంత్రజ్ఞానం శిష్యులకు యశస్సు ఇస్తుంది. ఆ మంత్రమే యశోద. యశోదచే కట్టబడిన మంత్రాధీన తత్వమే నారాయణ తత్వం. యశోద వద్ద కృష్ణ సింహం వలె ఈ తత్వం మంత్రమందు విహరిస్తుంది. అతడు సర్వమానవాళి సముద్ధరణ కోసం అనేక రుతువులు దాల్చుతాడు. రామునిగా కృష్ణునిగా ఒకనాడవతరించినట్టే అర్చామూర్తిగా ఈనాడూ ఉన్నాడు.

అతనిని 'పొందాలనే' కోరిక కలవారంతా ఈ వ్రతానుష్ఠానానికి యోగ్యులే. బాహ్య జాత్యాదులు అడ్డం కావు. అలాంటివారికి గొల్లతనం, స్త్రీత్వం, యవ్వనం, సంపదలు ఉండాలి. ఇవి కూడా మనమనుకొనే బాహ్య లక్షణాలు కావు. అన్నీ కృష్ణునివే. అతడిచ్చినవే అగుట గొల్లతనం, అతని ఆదేశానికి అనుగుణంగా ప్రవర్తించడమే స్త్రీత్వం.

శ్రీకృష్ణుని సేవకై అంకితం కావడం యవ్వనం. శ్రీకృష్ణానుగ్రహం తప్ప వేరే కోరకపోవడమే 'సంపద'. ఇవి కలవారంతా నందవ్రజ శ్రీకృష్ణ పరివారమే అవుతారు. ఇది సాధించడానికి ఎలాంటి శ్రమా అవసరం లేదు. ఏ కషాయాలు త్రాగనక్కర లేదు. విధులేమీ లేవు. శ్రీకృష్ణునియందు ప్రీతితో ప్రేరితులై వీరేమి చేస్తే అదే విధి. అవే నియమాలు. లోకులకవి ఆదర్శాలు. ఇది మానాలి అది చేయాలనే విధి పరతంత్రం వీరికి ఉండదు. చేయకుండా ఉండలేక కొన్ని పాటిస్తారు. అవి ఏమిటో 2వ పాశురంలో ఆండాళ్ గోపిక తనను చేరిన సఖియలందరితో వివరిస్తుంది.

ముందుగా ఇందరిని చూచి భూమిపై ఉంటూ సుఖించదలచిన వారందరికీ స్వాగతమన్నది. దేశ, ప్రాంత, భాష సరిహద్దులు తొలగించింది మన తల్లి. శ్రీకృష్ణ ప్రేమ కలిగి ఉన్నవారంతా ఒక కుటుంబమన్నది. రండి దేహాలంకారాలు కాక ఆత్మకు అలంకారాలు కోరుకొనే మనం, ప్రాణికోటి పుట్టుటకు ఆధారమైన పాల్కడలి పరంధాముని పాదపద్మాలను మేల్కొంటూ పాడుదాము. నోటికి అది ప్రయోజనం. భోగ సాధనాలైన పాలు, పెరుగులను తినము. మితాహారమే తీసుకుంటాం. సత్వవృద్ధి కోరి ఉషః కాలంలో శీతలజల స్నానం చేస్తాం. కాటుకలు, సిగపూలు లాంటి విలాసవస్తువులను తాకనే తాకము. అందరితో పంచుకొంటాం. మన పెద్దలు ఆచరించని కృత్యాలను చేయబోము. పరులను పీడించు పలుకులను పరిత్యజించి 'మాట' నొక తపస్సుగా, పవిత్ర పరికరంగా వాడుతాము. కలిగినదానిలో దాపరికం లేక పెద్దలకు దానము, భూతహితంగా ధర్మకార్యాలను శక్తికొద్దీ చేద్దాము.

జీవించడమే కాక, ఉజ్జీవించే మార్గాలను అనుసరించుదాం. పైవన్నీ ఆనందంతో చేస్తాము. బాధతో కాదు. దేవ దానవ, మానవులకు ఒక్క 'ద'కారమునే బ్రహ్మ ఉపదేశించినాడట. దేవతలు భోగలాలసత మాని 'దమము' నేర్వాలనీ, రాక్షసులు క్రౌర్యము మాని 'దయ'ను సంపాదించాలనీ, మానవులు ఆశతో ప్రోగుచేసుకొనే లోభము మాని 'దానము' చేయనేర్వాలనే దాని అర్థం.

శ్రీకృష్ణనామ స్మరణ పూర్వకమైన స్నానం అన్నమయ కోశాన్ని శుద్ధి చేస్తుంది. మితాహారం, వాగ్వ్యవహార త్యాగాలు ప్రాణమయ కోశాన్ని శుద్ధిపరుస్తాయని సూచిస్తుందీనాడు మన ఆండాళ్.

## 3వ పాశురము

ఓఙ్గి యులగళన్ద ఉత్తమన్ పేర్పాడి
నాఙ్గళ్ నమ్పావైక్కు చ్చాత్తి నీరాడినాల్
తీఙ్గిన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారిపెయిదు
ఓఙ్గు పెరుంశెన్నెల్ ఊడు కయలుగళ
పూఙ్గువళై ప్పోదిల్ పోఱివండు కణ్ పడుప్ప
తేఙ్గాదే పుక్కిరన్దు శీర్ త్తములైపత్తి
వాఙ్గ – క్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్
నీఙ్గాద శెల్వమ్ నిఱైన్దేలో రెమ్పావాయ్!

తాత్పర్యం : బలిచక్రవర్తి నుండి దానము పొందగలిగిన సంతోషముచే ఆకాశమందంతటను పెరిగిపోయి లోకాలను కొలచిన పురుషోత్తముని దివ్యచరణారవిందముల నామములను పాడి, మనమంతా ఈ తిరుప్పావై వ్రతమను పేర స్నానము లాచరించినచో దుర్భిక్షము కలుగక దేశమందంతటను నెలకు మూడు వర్షములు కురియును. పంటచేలన్నియు త్రివిక్రముని వలె పెరిగి సస్యముల మధ్యములలో బలిసిన చేపలు త్రుళ్ళిపడుచుండ, సుందర కలువలలోని తేనెలారగించిన తుమ్మెదలు మత్తుగ

నిదురించుచుండ, తమ సమృద్ధిని చాటుకొనునవిగ నగును. మరిక గో సమృద్ధి విషయమందురా గోశాలలో ప్రవేశించి స్థిరముగ కూర్చొని బలిసిన పొదుగుల నంటగనే కుండలనేకము నింపు ఔదార్యము గలవిగ గోవులు తయారగును. ఎంత అనుభవించినా తరగని ఐశ్వర్యము లభించును. కనుక ఈ వ్రతము నందరూ ఆచరింతము.

విశేషార్థము : లంకాపురిలో మంచి పలుకులు వినాలంటే ''నక్తా శ్రోతా చ దుర్లభః'' అంటాడు వాల్మీకి.

ఈ భూమిపై జన్మనెత్తినందుకు ఆండాళ్ ఆ మార్గాన్ని వేదాలలో గుప్తంగా ఉన్న ధనుర్మాస వ్రతాన్ని ఆవిష్కరిస్తుంది. శరీరము, దీర్ఘాయువు మనిషి బాగుపడడానికి కావాలి. ఆపై శాస్త్రం పట్ల విశ్వాసం కూడా ఉండాలి. పెద్దల మార్గాన్ని విడువకుండడం, భగవంతుని యందు ప్రేమ, మంచిని పొందాలనే త్వర, సాత్వికాహార స్వీకారము అలవరచుకోవాలి. ఇవి ఉంటే ఏ జాతివాడైనా తరించి తీరుతాడు.

పరిపూర్ణుడైన భగవానుడు అర్చామూర్తిగా ఆలయంలో ఉన్నాడనే జ్ఞానం కలిగితే పరమపదాన్నో, అంతర్యామినో కోరరు బుద్ధిమంతులు. ఆ అర్చామూర్తినే ఉపాసించి, అఖండైశ్వర్యాన్ని పరమానందాన్ని పొందుతారు. మన ఆండాళ్ జీవితము ఈ వ్రతము అందుకు నిదర్శనము.

భగవత్ప్రేమ కలవాడికి స్వార్థం ఉండదు. అయినా కూడా కొన్ని నియమాలను పాటిస్తాడు. ఫలితాలేమీ తనకు కావాలనడు. లభించినవన్నీ లోకులందరకూ పంచడమే అతనికి తృప్తి. ధనుర్మాస వ్రతానికి ప్రధాన ఫలం బ్రహ్మాదులకు కూడా దుర్లభమైనది శ్రీకృష్ణ దివ్యానుగ్రహం.

'సర్వ లాభాయ కేశవః' అని సుబాలోపనిషత్ చెప్పింది. దేవతలు ఏవో కొన్ని తాత్కాలిక, అల్ప ఫలాలిస్తారే తప్ప అన్నీ ఇవ్వలేరు. కాని మన శ్రీకృష్ణుడు వారిచ్చే వాటికంటే ఉత్తమము, శాశ్వతము, శ్రేయస్కరము అయిన ఫలితాలనివ్వగలడు. ఈ వ్రతం చేస్తే అవి కూడా ఇస్తాడు.

మన వ్రతానికి ఇతరులలో మంచిని కూడా వేలెత్తి దోషంగా చూపించే చెడ్డగుణం 'అసూయ' తగదు. అందరికీ శ్రేయస్సు కలగాలనే కాంక్ష ప్రధానం. ఈ కాంక్ష ఉన్నవారు ఒక్కరున్నా అక్కడ ఈతి బాధలుండవు. అరిష్టాలు ఆగుతాయి. సస్యాలు పండుతాయని మహాభారతంలో భీష్ముడు కౌరవులతో చెప్తాడు. మన వ్రతాన్ని ఆచరించేవారికి అసూయ లేకపోవడమే ప్రధాన గుణం అంటున్నది ఆండాళ్. ఆమె ప్రభావం వల్ల, వ్రత మాహాత్మ్యం వల్ల నియమం తప్పక ఆచరించిన చోటల్లా సుఖాలు కలుగుతాయి. దుఃఖాలు తొలగుతాయి.

ఈ వ్రతంలో నోరున్నందుకు నామసంకీర్తనం చేయాలి. అది ఉత్తముని నామాన్ని పాడాలి. ఉత్తముడంటే నిస్వార్థంగా పరుల ప్రయోజనం కోసం తానేమైనా సరే ఫర్వాలేదని ప్రవర్తించగలిగేవాడు. అట్టి పురుషోత్తముడు మన స్వామి శ్రీకృష్ణుడు. శ్రియః పతియై ఉండి కూడా, ఒకనాడు వామనుడైనాడు. బలిని భిక్షమడిగాడు. దండించే బలం ఉన్నా కూడా యాచనకు దిగాడు. ఇంద్రాది దేవతల ప్రయోజనానికై తన ప్రభావాన్ని ప్రక్కన పెట్టి మూడడుగుల నేలను కోరాడు. ఇస్తానన్నాడు బలి. ఆనందంతో పొంగిపోయాడు స్వామి. ముల్లోకాలు పట్టనంతటి ఆనందపు పొంగు కలిగింది. ఆయన ఉత్తముడు. బలిని నొప్పించక ఇంద్రుని కోరిక తీర్చాడు. ఎవ్వరూ అతనిని గుర్తించలేదు ఆనాడు. కీర్తి దక్కిందనుకొన్నాడు బలి. రాజ్యం దక్కిందనుకొన్నాడు ఇంద్రుడు. మోసం చేశావన్నారు సైనికులు. అయినా తాను చేసే లోకోపకారం పూర్తి అయిందని సంతోషించాడు స్వామి. అలాంటి వాడి నామాన్ని పాడాలి. ఎవరైనా పాడవచ్చు నా నామాన్ని. ఏమవుతుంది పాడితే?

ఈ నామం వల్లనే ద్రౌపదికి వస్త్రాలు లభించాయి. పాండవులకి రక్షణ, రాజ్యం వంశపరంపరగా నిలిచాయి. కుచేలునికి సకల సంపదలు సిద్ధించినాయి. అలానే మనకూ సంపదలు, శుభముల పరంపర దక్కుతుంది. అంతేకాదు. అరిష్టములన్నీ తొలగుతాయి. అవి ఆరు.

1.అతివృష్టి 2. అనావృష్టి 3. పంటలను నాశనం చేసే మిడతలు లాంటి కీటకాలు 4. పండిన తరువాత పాడుచేసే పక్షులు 5. పంట ఇల్లు చేరిన తరువాత నాశనం చేసే ఎలుకలు 6. అన్నీ చేసినా సుంకాలు, పన్నులు వేసి అంతా దోచుకొనే ప్రభుత్వాల రంపపు కోతలు.

ఈ అరిష్టాలేమీ ఉండవు. ఆండాళ్ శ్రీవిల్లిపుత్తూరు లోనే వ్రతం చేసినా లోకానికంతటికీ ఇట్టి సౌభాగ్యం కలగాలంటున్నది.

ఈ స్థితి కలగడానికి అనుకూలముగా నెలకు మూడు వానలు కురుస్తాయి. తొమ్మిది దినాలు ఎండ తరువాత ఒకనాడు వర్షం. పంటలు వాతావరణ దోషాలు అంటకుండా పరిశుద్ధమవుతాయి. మూడు రకాల శుభాలు మనుషులకు ఏర్పడతాయి. స్త్రీలు శుద్ధ భావాలు కలవారవుతారు. వీరివల్ల గృహవ్యవస్థ బాగుపడుతుంది. పాలకులు ధార్మిక భావన కలవారవుతారు. రాష్ట్రాలు బాగుపడతాయి. బ్రహ్మవేత్తలు నియమపాలన చేసే బోధకులవుతారు. వీరివల్ల ప్రపంచమంతా న్యాయ, ధర్మబద్ధమవుతుంది. ఇలాంటి మూడు శుభాలు చేకూరుతాయి.

ఆకాశమంత ఎత్తెదిగిన వామనుని కీర్తించడం వల్ల కలిగే సౌభాగ్యాన్ని ప్రకృతి కూడా పంచుకుంటుంది. జీవనాధారమైన వరిచేలు కూడా స్వామితో పోటీపడ్డట్టుగా ఏపుగా పెరుగుతాయి. క్షేత్ర సమృద్ధిని సూచిస్తూ చేలంతా తగిన నీటితో నిండి ఉంటాయి. దుబ్బులమధ్య బలిష్టమైన కాడలపై పెరిగిన కలువలు, పద్మాలు వింజామరలు వీస్తున్నట్లుంటాయి. వాటిని ఊపుతున్నట్లు బలిసిన

చేపలు అందాలొలికే నేత్రాలవలె నీట సంచరిస్తూ ఉంటాయి. విరబూసిన తామరల తేనెలు గ్రోలడానికి భృంగరాజములు జంటలుగా ఝంకార నాదాలతో చేలంతా నిండుతాయి. తేనెలు త్రాగి మత్తుతో తూగుటుయ్యాలలో నిదురించే మోసపురుషులవలె తుమ్మెదలు కనిపిస్తాయి. ఇంతటి సస్య సమృద్ధి మన ధనుర్మాసం వల్ల కలుగుతుంది అంటున్నది ఆండాళ్. అంతేనా? మరి ఊరిలోనే సమృద్ధి చూడవద్దూ?

పాడిగల ఉదారమైన పెద్ద పెద్ద పశువులు శ్రీకృష్ణ నామామృతాన్ని గ్రోలి పెరిగినవి కనుక అతని ఉదారగుణాన్నే అవీ కలిగి ఉంటాయి. ఎంత బలిష్ఠునికైనా పశుశాలలో ప్రవేశించాలంటే ఓ పెద్ద కసరత్తు చేస్తే తప్ప పితుకలేనంత క్షీరసమృద్ధి. యాదవ బాలలు పిలిచినా పలికేవాడు, ఏమి కోరినా ఇచ్చేవాడు కృష్ణుడు. అతని మురళీరవాన్ని విన్న పశువులు అదే గుణంతో ఉండి చిన్నపిల్లలకైనా, ఎప్పుడు కోరినా పాలిచ్చే ఉదారత కలిగి ఉంటాయి. కుండ పెట్టనివానిది లోటే తప్ప, పెడితే నింపకపోవడం లేదు. ఇలాంటి అక్షయ సంపదలన్నీ ఈ వ్రతాచరణ వల్ల కలుగుతాయి. దేశమంతా, పశుపక్ష్యాది జీవరాశి అంతా, పాడిపంటలన్నీ, వాతావరణమంతా పరిశుద్ధమై, సాత్వికమై, సోదరభావం పొంగి, అందరూ సుఖసంతోషాలతో తులతూగేటట్లు ఈ మార్గశీర్ష స్నానవ్రతం చేస్తుందని ఆండాళ్ ప్రతిజ్ఞ చేస్తోంది.

పరమాత్మ అంతటివాడు పరులకోసం పడరాని పాట్లు పడి, భిక్షమెత్తి లోకాలన్నీ కొలిచి తన పాదాలను ఎంత శ్రమింపచేసుకున్నాడో కదా! మరి మనమెంత? మన దేశము వారికీ, మన ప్రజలకు, మన జాతికి, మానవాళికంతటికీ మహదానందాన్నిస్తుందంటే ఈ వ్రతాన్ని ఆచరించవద్దూ? ఆ మాత్రం కూడా మనం చేయలేమా? సంకల్పమాత్రం చేస్తే అది మానవ తపస్సు అవుతుంది. దానివల్ల మనోకోశం నిర్మలమవుతుంది.

మనకు పట్టిన దేహాత్మాభిమాన, స్వాతంత్ర్య, పరదాస్య, స్వరక్షణే, స్వాన్వయ, బంధులోలత, విషయ విలాసాలనే ఆరు దోషాలు తొలగుతాయి. జ్ఞానమనే పంట పండుతుంది. సర్వప్రాణికోటిని ప్రేమించగలుగుతాము. భగవదనుగ్రహంతో ఆత్మోజ్జీవనం పొందగలుగుతామని మూడవ పాశురంలో ఆండాళ్ అన్నది.

**(సశేషం)**

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిపే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



ధారావాహికం



# రామాయణ రత్నాకరం

**– రాళ్ళబండి శ్రీనివాసన్**

**గత సంచిక తరువాయి**

ఈమె కోసమే నేను సముద్రాన్ని దాటాను. నాగలితో దున్నగా యజ్ఞక్షేత్రంలో నుంచి వచ్చింది ఈమె. దశరథ మహారాజు పెద్ద కోడలైంది ఈమె. రామునికి ప్రియ భార్య అయ్యింది ఈమె.

రాముని కోసం సమస్త భోగాలు త్యజించింది. నిర్జనారణ్యానికి వచ్చింది. కందమూల ఫలాలతో సంతృప్తి పడింది. భర్తకు సేవలు చేయాలనే వచ్చింది. అడవిని అయోధ్య అనుకుంది. మహారణ్యంలో కాపురం పెట్టింది. అంతటి జనకరాజ సుత, అంతటి ధర్మశీల, అంతటి పతివ్రత ఇపుడు రాక్షసాంగనల వశమైంది. ఈ జానకి మళ్ళీ రాముని సన్నిధి చేర్తుంది. అందుకే రాక్షస స్త్రీలని చూడటం లేదు. పూల చెట్లని చూడటం లేదు. ఫలవృక్షాల్ని చూడటం లేదు. రాముణ్ణే చూస్తోంది (చిత్తమంతా రామధ్యాసే). రాముడు కూడా కృశించిపోలేదు. ప్రాణాలు నిలబెట్టుకుని ఉన్నాడు. ఇది నిజంగా దుష్కర కార్యమే.

హనుమంతుడు దుఃఖపడుతున్నాడు. సీతారాముల్ని తలుచుకుని చింతిస్తున్నడు. 'క్ష' అనే అక్షరాన్ని పలకటం కొంచెం కష్టం. ఆ అక్షరం హనుమంతుని దుఃఖాన్ని సూచించేట్లుంది. అది వాల్మీకి రచనా శిల్పం.

**క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ**
**యా రక్షితా రాఘవ లక్ష్మణాభ్యామ్ ।**
**సారాక్షసీభి ర్వికృతే క్షణాభిః**
**సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే ॥**

ఓర్పులో భూదేవి సీతమ్మ. పద్మాల్లా నేత్రాలు కలది. రామలక్ష్మణుల చేత రక్షింపబడేది. ఇపుడు మాత్రం రాక్షసుల చేత రక్షింపబడుతోంది. వాళ్ళ చూపులు కూడా భయంకరంగా ఉన్నాయి. వికృతంగా ఉంది. చెట్టుకింద కూర్చుని ఉంది మైథిలి. మంచుతో దెబ్బతిన్న తామరతీగలా ఉంది. ప్రియుణ్ణి ఎడబాసిన చక్రవాక పక్షిలా ఉంది. దుఃఖ పరవశంలో ఉంది. చల్లని కిరణాలతో ఉన్నాడు చంద్రుడు. ఆమెను మరింతగా బాధపెడుతున్నాడు.

అలా రాముణ్ణి గూర్చి సీతమ్మని గూర్చి ఆలోచించాడు వాయుపుత్రుడు. ఈమె సీతమ్మే అని నిశ్చయానికి వచ్చాడు.

## వికృత రూపులు

వైదేహికి కాపలాగా ఉన్నారు రాక్షసాంగనలు. వారిని వర్ణించాడు వాల్మీకి. ఒకతె ఒంటికంటిది. ఒకతెకి ఒకే చెవి. ఒకతెకు చెవులే లేవు. ఒకతెకు చెవులు మూసుకుపోయాయి. ఒకరికి మేకుల్లా ఉన్నాయి చెవులు. ఒకరికి చెవులు వేళ్ళాడుతున్నాయి. ఒకరి తల పెద్దది. ఒకరి మెడ సన్నం. ఒకరి మెడ పొడుగు. ఒకరికి తల వెంట్రుకల్లేవు. ఒకరికి కంబళిలా ఉన్నాయి వెంట్రుకలు.

ఒకతెకు చన్నులు కడుపు దాకా వేళ్ళాడుతున్నాయి. ఒకరికి పెదవి వేళ్ళాడుతోంది. ఒకరికి గడ్డంలో పెదవి ఉంది. ఒకరి ముఖం వేళ్ళాడుతోంది. ఒకరికి మోకాళ్ళు వేలాడుతున్నాయి. ఒకతి పొట్టి. ఒకతి పొడుగు. ఒకతె గూనిది. ఒకతె మరుగుజ్జు. ఒకతె వంకర టింకరగా ఉంది. ఒకరికి నోరు పెద్దది. ఒకరికి పిల్లికళ్ళు. ఒకతె తల దేహంలో ఇరుక్కుపోయింది. కొందరికి ఒకే చేయి. కొందరికి ఒకే కాలు. కొందరివి గాడిద చెవులు – గుఱ్ఱపు చెవులు – ఆవు చెవులు – ఏనుగు చెవులు – కోతి చెవులు. కొందరికి పెద్ద పెద్ద ముక్కులు. కొందరికి ముక్కులు అడ్డంగా ఉన్నాయి. కొందరి ముక్కులు ఏనుగు తొండంలా ఉన్నాయి.

కొందరి కాళ్ళు ఆవు పాదాలు. ఏనుగు పాదాలు కొందరివి. కొందరి పాదాలకి జుట్టు ఉంది. కొందరివి పంది ముఖాలు. ఒంటె ముఖాలు – ఆవు ముఖాలు – అందరూ మద్యం తాగుతున్నారు. మాంసం తింటున్నారు. ఒళ్ళంతా రక్తం మాంసం పూయబడి ఉన్నాయి. కొందరు శూలాలు పట్టారు. కొందరు ముద్గరాలు పట్టారు. రకరకాల ఆయుధాలు ధరించి ఉన్నారు.

అలాంటి వికృతాకారులు, భయంకర రూపులు జానకమ్మ చుట్టూ ఉన్నారు. అందరినీ చూశాడు హనుమంతుడు. తన చూపుల్ని సీతమ్మ వైపు తిప్పాడు. ఆమె దుఃఖితురాలై ఉంది. తలంతా దుమ్ము పట్టి వుంది. పుణ్యం కోల్పోయి నేలకు జారిన నక్షత్రంలా ఉంది. వంటి మీద ఆభరణాల్లేవు. రాముడే ఆభరణం అన్నట్లుంది. వర్షాకాలంలో శరత్ మేఘాలు కప్పిన చంద్ర రేఖలా వుంది. తీగెలు సరిచేయని వీణలా ఉంది. అలాంటి సీతాదేవిని చూశాడు. రాముణ్ణి తలచాడు. సీతమ్మ కనిపించిందనుకున్నాడు. ఉప్పొంగిపోయాడు. ఆనంద బాష్పాలు కార్చాడు. మనసులో రామలక్ష్మణులకు అంజలి ఘటించాడు. శింశుపా వృక్షం కొమ్మ మీదనే ఉన్నాడు. ఆకు చాటున ఉన్నాడు.

## అశోక వాటిక – రావణుడు

లంకలోకి దూకాలనుకున్నాడు హనుమంతుడు. దూకాడు. అపుడు చంద్రోదయమైంది. సీతాన్వేషణలో చంద్రుడు ఆకాశ మధ్యంలోకి వచ్చాడు. సీత దర్శన సమయానికి పడమటికి వాలుతున్నాడు చంద్రుడు. అది తెల్లవారు జాము. సమయం నాలుగు గంటలు దాటి వుండొచ్చు.

లంకలో వేదాధ్యయనం వినిపిస్తోంది. రాక్షసుల వేదఘోష విన్నాడు హనుమంతుడు. మంగళ వాద్యాల ధ్వనులు వినపడుతున్నాయి. దశగ్రీవుణ్ణి మేల్కొల్పారు. లేచాడు రావణుడు. వెంటనే స్మృతిపథంలోకి వచ్చింది సీతాదేవి. హారాలు చెదిరాయి. వస్త్రాలు సర్దుకున్నాడు. మదన తాపం కామోద్రేకం నిగ్రహించుకోలేకపోయాడు. సర్వాభరణ భూషితుడైనాడు. రాజభవనం లోంచి బయటికి వచ్చాడు. అశోకవనం వైపు నడుస్తున్నాడు. వందమంది అనుసరిస్తున్నారు అతణ్ణి. వారిలో దేవకాంతలు వున్నారు. గంధర్వ కాంతలున్నారు. మరికొందరు కాగడాలు పట్టారు. కొందరు చామరాలు పట్టారు. కొందరు తాటి విసనకర్రలు పట్టారు. కొందరు బంగారు వెండి పాత్రలు పట్టారు. అందులో మంచినీరు వుంది. కొందరు కత్తులు చేతపట్టారు. కొందరు ఆసనాలు పట్టారు. ఒకతె ఛత్రం పట్టింది. ఒక సుందరాంగి కుడిచేత పాత్ర పట్టింది. అది రత్నఖచిత పాత్ర. అందులో మద్యం ఉంది. అందరూ అందమైన భామలే. వారిలో నిద్రమత్తు వీడలేదు. కనురెప్పలు మూస్తూ తెరుస్తున్నారు. అలాగే నడుస్తున్నారు. నీలమేఘం వెంట పోయే మెరుపుతీగల్లా రావణునితో నడుస్తున్నారు. తూలిపోతూనే ఉన్నారు. వారి హారకేయూరాలు చెదరిపోయాయి. మైపూతలు మాసిపోయాయి. కొప్పులు జారిపోయాయి. ముఖాలు చెమర్చాయి.

రావణుని మనస్సు మైథిలి మీదనే వుంది. మెల్ల మెల్లగ అడుగులు పడుతున్నాయి. వన ద్వారం దగ్గరికి వచ్చారు. చూశాడు హనుమంతుడు. కాగడాల వెలుగులో సుందరాంగుల మధ్య నడుస్తున్నాడు. నక్షత్రాల మధ్య చంద్రునిలా ఉన్నాడు. కామం మదం గర్వం కొట్టొచ్చినట్టుంది అతనిలో. తాగిన మత్తు వల్ల కామోద్రేకం వల్ల ఎర్రబారి ఉన్నాయి కళ్ళు. జారిపోతోంది ఉత్తరీయం. అది అమృతం చిలికితే వచ్చిన నురుగులా తెల్లగా వుంది. భుజకీర్తులకి చిక్కుకుంది. దాన్ని విలాసంగా సవరిస్తున్నారు. వడ్డాణపు సవ్వడులు అందెల రవళులు విన్నాడు వాయుపుత్రుడు. పుష్పకంలో శయ్యాగృహంలో చూచాను నేను. అతడు ఇతడే – అనుకున్నాడు మారుతి. చేత విల్లు లేని మన్మథునిలా ఉన్నాడు. అతణ్ణి బాగా చూడాలనిపించింది వాయునందనునికి. కొమ్మల నుంచి కింది కొమ్మకి దిగాడు. ఆకుల చాటున ఒదిగాడు. రావణుడు సమీపించాడు సీతాదేవిని.

## రావణుడు – సీతాదర్శనం

రూప యవ్వన సంపన్నుడు, ఆభరణ భూషితుడు రాక్షసరాజు రావణుడు వచ్చాడు. సౌశీల్యవతి, సౌందర్యవతి వైదేహిని చూశాడు. అతణ్ణి చూసిందామె. పెనుగాలికి అరటి చెట్టులా వణికింది. తొడలతో కడుపుని కప్పుకుంది. వక్షోజాల్ని చేతులతో కప్పుకుంది. నడి సముద్రంలో నావలా రాక్షస స్త్రీల మధ్య వుంది. చెట్టునుంచి నరికిన కొమ్మలా వుంది. ఆసనాల్లేని కటిక నేలపై ఉంది. తీవ్ర వ్రత దీక్షలో ఉన్నట్లుంది. బురద పట్టిన తామరకాడలా వుంది. సంకల్పం అనే గుర్రాలు – మనసు అనే రథం – ఎక్కి రాముడి దగ్గరకు పోతున్నట్లుంది. మణిమంత్రాలతో కట్టబడ్డ పాములా ఉంది. ఉత్తమ ధార్మిక వంశంలో పుట్టింది. జనకుని కూతురిలా పెరిగింది. పవిత్రమైన ఇక్ష్వాకు వంశంలో మెట్టింది. ఇపుడు లంకలో దుష్కులంలో చేరినట్లుంది.

అసత్యమైన అపవాదులా ఉంది. క్షీణించిన కీర్తిలా వుంది. పఠన పాఠనం లేని విద్యలా వుంది. అవమానంతో తగ్గిన శ్రద్ధలా వుంది. నెరవేరని ఆజ్ఞలా ది. నిష్ఫలమైన ఆశలా ఉంది. శూరులు చచ్చిన సేనలా వుంది. చీకటిలో మసకబారిన కాంతిలా వుంది. ఎండిపోయిన నదిలా ఉంది. అపవిత్రులు అడుగిడిన యజ్ఞవేదికలా ఉంది. చల్లారిన అగ్నిశిఖలా ఉంది. ఎండకి కమలిని తామర కాడలా వుంది. వేటగాళ్ళతో కట్టబడ్డ ఆడ ఏనుగులా ఉంది. వాయువు మాత్రమే ఆహారం కలదిగా వుంది. రామధ్యానంలో వుంది. తపో తీవ్రత నియమాలు పాటిస్తున్నట్లుంది. కృంగి కృశించి క్షీణించి ఉంది. దీన దశలో ఉంది. రాముడు రావణుణ్ణి పరాభవించాలని – హతమార్చాలని – మనసులో దేవతల్ని ప్రార్థిస్తున్నట్లుంది. చావు మూడిన రావణుడు సీతా దర్శనానికి వచ్చినట్లుంది.

## ప్రలోభం

మహా సాధ్వి మైథిలిని ప్రలోభ పెట్టాలి. ఆ ఉద్దేశంతో వచ్చాడు రావణాసురుడు. చూశాడు వైదేహిని. దీనురాలై ఉంది. తపస్వినిలా ఉంది. తన అభిప్రాయం చెబుతున్నాడు.

'విశాలాక్షీ! నీ అవయవాల్ని కప్పుకున్నావు. నేను నిన్ను కామించాను. నువ్వు నా ప్రియురాలవు. నన్ను ఆదరించు. ఇక్కడ మనుషుల్లేరు. కామరూపుల్లేరు. నీకెందుకు భయం. నన్ను చూసి భయపడకు. పరస్త్రీలను అపహరించడం రమించడం పాపం కాదు. అది రాక్షసులకు స్వధర్మం. సందేహం లేదు. సహజంగా నేను కాముకుణ్ణి. బలాత్కరించి తెచ్చాను. కామ వికారాలు నన్ను రెచ్చగొడుతున్నాయి. నీవు కామిస్తే కాని నిన్ను తాకను. భయపడకు. నన్ను నమ్ము. నన్ను ఇష్టపడు. శోక పరాయణ కావద్దు.



ఇక్కడ ఓ విశేషం ఉంది. కామం బంధహేతువు. భగవంతుణ్ణి (రాముణ్ణి) కాదని మాయలేడిని కోరింది సీతమ్మ. అందుకే రావణుడు బంధింపగల్గాడు. ఇపుడు రామధ్యానంలో ఉంది. అతణ్ణి తప్ప అన్యం కోరలేదు. అందుకే తాకలేకున్నాడు రావణుడు. తనని కోరని స్త్రీని బలాత్కరించి రమిస్తే చస్తాడు. అది బ్రహ్మ శాపం.

మైథిలీ! నీవు శోకించకు. నేలమీద పడుకోకు. ఒకే జడతో ఉండకు. పరధ్యానలో ఉండకు. మాసిన చీర కట్టకు. ఉపవాసాలు చేయకు. పూలమాలలు వేసుకో. చందనాదులు పూసుకో. సొమ్ములు పెట్టుకో. మంచి చీరలు కట్టుకో. మద్యం తాగు. నృత్త గీత వాద్యాలతో పొద్దు పుచ్చుకో. హాయిగా ఉండు. నీవు స్త్రీ రత్నానివి. బాగా అలంకరించుకో. ఇది నా నివాసం. అలంకరణలు ఆభరణాలు లేకుండా వుండొద్దు. మనోహరమైంది యవ్వనం. అది గడిచిపోతోంది. ప్రవాహంలో కొట్టుకుపోయిన నీళ్ళు తిరిగిరావు. గతించిన యవ్వనం తిరిగి రాదు. ఈ వయసులో సుఖభోగాలను అనుభవించాలి. అందుకే ఈ శరీరం ఉంది. యవ్వనం పోతే ఎలా? అది రావణుని బాధ. అతనిది బాహ్య భోగ లంపటం. కాని ఆత్మ వేరు శరీరం వేరు. ఆత్మ భగవదనుభవం కోసం వుంది. అందుకే ఈ శరీరం ఒక ఉపాధి. యవ్వనంలోనే భగవదనుగ్రహ ప్రాప్తి పొందాలి. లేకపోతే జన్మ వృధా. వృద్ధాప్యంలో జవసత్వాలు అంతంత మాత్రమే వుంటాయి. మనసుకి నిలకడ ఉండదు. రావణునిలా కామ ప్రవృత్తికి భోగలాలసతకి దూరంగా ఉండాలి. ధర్మబద్ధమైన కామంతో జీవనం గడపాలని శ్రీరామాయణం మనకు నేర్పుతోంది.

సుందరీ! బ్రహ్మ నిన్ను సృష్టించాడు. నీ రూపం చూశాడు. అలా మరో స్త్రీని చేయాలనుకున్నాడు. చేతకాలేదు. సృష్టి కార్యమ్ మానుకున్నాడు. మైథిలీ నువ్వు ఎంత అందాలరాశివో అర్థమైందా? అందుకే నీవు నా భార్యవి. నేను శత్రువుని కాను. నానా దేశాలు తిరిగాను. సుందరాంగుల్ని ఎందరినో ఎత్తుకువచ్చాను. వాళ్ళు నా భార్యలైతే నీవు నా పట్టపురాణివి. వాళ్ళందరూ నీకు ఊడిగం చేస్తారు. ఎన్నో సంపదల్ని కొల్లగొట్టాను. అవన్నీ నీవే. నా రాజ్యం నీదే. నేను నీవాణ్ణి. నీ కోసం ఈ భూమండలాన్ని జయిస్తాను. దాన్ని నీ తండ్రి జనక మహారాజుకి ఇస్తాను. నన్నెదిరించిన వాడు ఇంతవరకూ పుట్టలేదు. నా పరాక్రమం తెల్సుకో. నా ఐశ్వర్యం చూడు. నన్ను వరించు. భోగాలనుభవించు. నన్ను అనుగ్రహించు.

రామునికి రాజ్యం లేదు. భోగాల్లేవు. నారచీరలతో ఉన్నాడు. అడవుల్లో వుంటున్నాడు. ఆ రామునితో నీకేం పని? అసలు రాముడు బతికి వున్నాడో లేదో – ఒకవేళ బతికినా వాణ్ణి పొందలేవు. అసలు చూడలేవు.

సీతా! తాగు. తిరుగు. రమించు. భోగాలనుభవించు. నా ధనరాశులు నీవే. నా రాజ్యం నీదే. నాపై ప్రేమ చూపు. సుఖపడు. నీ బంధుజనాన్ని సుఖపెట్టు. రావణునిది భోగదృష్టి. అదే పరమార్థం అనుకున్నాడు. అలా సీతమ్మని ప్రలోభపెట్టాడు.

## మహోపదేశం

వినింది సీతమ్మ – ఏడ్చింది. వణికిపోయింది. రామధ్యాసలో వుంది. మౌనంగా వుంటే అర్ధాంగీకారం అనుకుంటాడేమో. అందుకే రావణునికి జవాబు చెప్పాలనుకుంది. పర పురుషులతో నేరుగా మాట్లాడరాదు. అందుకు మధ్యలో ఒక గడ్డి పోచ ఉంచింది.

గడ్డి పరక వేయడంలో అనేక అర్థాలున్నాయి.

1.ఎండిన గడ్డిపోచలా రావణుని సర్వసంపదలు నాశనమవుతాయి.

2.గడ్డిపరకతో రావణుడు సమానం.

3. కామాతురుడు రావణుడు. హితబోధ పనికిరాదు. గడ్డి పెట్టాలి.

4. గడ్డిపోచైనా స్పృశిస్తుంది మైథిలి. రావణుని తాకదు.

5. గడ్డిపరకని బ్రహ్మాస్త్రంగా మార్చాడు రాముడు కాకాసురుని మీద ప్రయోగించాడు. వాడు ముల్లోకాలు తిరిగాడు. రాముణ్ణి శరణు వేడాడు – అలా గడ్డిపోచని బ్రహ్మాస్త్రంగా వేస్తాడు. రావణుడు భయపడతాడు. శరణు వేడతాడు. లేదా చస్తాడు.

జనకరాజపుత్రి అయోనిజ. సాక్షాత్ జగన్మాత. తెలిసో తెలియకో కొడుకు దూకుడుగా మాట్లాడితే – అనరాని మాటలంటే – తల్లి కోపగించుకోదు. వాత్సల్యం చూపుతుంది. కొడుకు చెడిపోరాదని వాడికి మంచి చెబుతుంది. దుర్మార్గుడు అహంకారి కామాంధుడు రావణుడు. వాడికి మంచి మాటలు చెప్పాలనుకుంది సీతమ్మ. ఆమెలో ద్వేషం లేదు. కోపం లేదు. అందుకే సాధు రావణా! అని సంబోధించింది. అంటోంది.

నా మీద మనసు పెట్టుకోకు. దాన్ని మళ్ళించు. నీవాళ్ళపై వుంచు. పాపాత్ముడు సుసిద్ధికి అర్హుడు కాడు. అలాగే నన్ను పొందే యోగ్యత లేదు నీకు. నన్ను కోరకు. అది యుక్తం కాదు. రావణా! నేను వుత్తమ వంశంలో పుట్టాను. మరో ఉత్తమ వంశంలో మెట్టినాను. పాడు పనులు చేయను అంది. వెంటనే రావణునికి వెనక్కి తిరిగింది. మళ్ళీ అంటోంది.

నేను నీకు పొంద తగిన భార్యను కాను. నేను రాముని భార్యను. అతడు ఏకపత్నీవ్రతుడు. నేను పతివ్రతను. ధర్మం ఆచరించు. సత్పురుషుల ఆచారాల్ని పాటించు. నిశాచరా! నీ భార్యల్లాగా పరభార్యలు కూడా రక్షింప తగినవారు. నీ భార్యలతో రమించు. పరస్త్రీని కోరకు. ఇంద్రియ చాపల్యం ఉండరాదు. అది వుంటే పరాభవం తప్పదు.

**ఇహ సంతో న వాసంతి సతో వా నానువర్తసే ।**

**తథాహి విపరీతా తే బుద్ధి రాచార వర్జితా ॥**

ఈ లంకలో సత్పురుషులు లేరా? ఉంటే వాళ్ళు మంచి చెబితే వినవా? నీవు పెద్దల్ని ఆశ్రయించలేదు. మంచి గ్రహించడం లేదు. అలా అని నీ ప్రవర్తన చెబుతోంది. నీ బుద్ధి చెబుతోంది. నీ బుద్ధి పెడదారి పట్టింది. అది నీకే కాదు రాక్షసుల వినాశనానికే. రావణా! సత్పురుషుల ఉపదేశాలు వినాలి. అలా వినకపోతే రాజుకి చెందిన సర్వ సంపదలు నశిస్తాయి. రాష్ట్రాలు నగరాలు నాశనమైపోతాయి. ఒక్కడి అపరాధానికి లంకా రాజ్యం నాశనమైపోతుంది. ఎవరిని నీవు వంచించినావో వారు నీ నాశనాన్ని చూస్తారు. నీవు ఒక్కడివే చస్తే సర్వభూతాలూ ఆనందిస్తాయి. మహా క్రూరుడు పాపాత్ముడు చచ్చాడు – అదృష్టమని ఆనందిస్తాయి.

అంతఃపుర కాంతలు నాకు దాసీ జనమవుతారన్నావు. రాజ్యాధికారం చేపట్టు అన్నావు. సకలైశ్వర్యాలు సర్వసంపదలు నాకే అంటూ ప్రలోభపెట్టావు. వాటికి ఆశపడను. వాటికి లొంగను.

**అనన్య రాఘవేణాహం భాస్కరేణ ప్రభాయథా**

సూర్యుని నుంచి కాంతిని వేరు చేయలేరు. రాముని నుంచి నన్ను వేరు చేయలేరు. మేం ఎప్పటికీ కలిసి వుంటాం.

ఒక్కడి వల్ల లంక నాశనమవుతుంది – ఆ మాట సీతాదేవి నోట వచ్చింది. మహా పతివ్రత. పలుకు యథార్థం అవుతుందనీ – ఏ వ్యక్తి మనసు బాధపెట్టరాదని – నొప్పించరాదని – ముఖ్యంగా పతివ్రతల జోలికి – సత్పురుషుల జోలికి పోరాదని వాల్మీకి హెచ్చరిస్తున్నాడు మనల్ని.

పరమాత్మ ప్రాప్తిని పొందగోరేవాడు విషయ భోగాలు ప్రలోభ పెట్టినా వాటికి ఆశపడడు. నేను పరమాత్మకి చెందినవాణ్ణి. పరమాత్మే నా రక్షకుడు అంటాడు వాడు. అలౌకిక ఐశ్వర్యం ఆ పరమాత్మే అని భావిస్తాడు. లౌకిక ఐశ్వర్యాదులకు ఆశ పడితే వాడు కర్మ జన్మల చక్రబంధంలో తిరుగుతూ ఉంటాడు.

లంకా పట్టణంలో పెద్దలు లేరని మంచి చెప్పేవాళ్ళు లేరని సీతాదేవే ఉపదేశిస్తోందని గ్రహించాలి మనం.

వ్రతస్నాతుడు విదితాత్ముడు బుద్ధిమంతుడు అయిన బ్రాహ్మణుణ్ణి వేదవిద్య ఆశ్రయించి వుంటుంది. అలా రాముణ్ణి ఆశ్రయించి ఉంటాన్నేను. నా రాముడి భుజాలు నాకు రక్షణ. ఆ భుజాలే నా తలగడ. నా తల మోపి ఆ భుజాలపై పడుకుంటాను. ఇంకొకడి భుజాన్ని దిండుగా అంగీకరింపను. **(సశేషం)**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 335. చాణూరోదర దారణాయ నమః

మల్ల యుద్ధములో చాణూరుడను మల్లుని కడుపును చీల్చి చంపినవాడు కృష్ణుడు.

విష్ణు సహస్ర నామములలో ''చాణూరాంధ్ర నిషూదనః'' అను నామము 829 సంఖ్యతో కలదు.

చాణూరుడు ఆంధ్రుడు. గొప్ప మల్లుడు. కంసుని ఆశ్రయించి ఆతని ఆస్థానమున నున్న చాణూర ముష్టికాది వీరమల్లురలో చాణూరుడు శ్రేష్ఠుడు, అగ్రగణ్యుడు. ఆ మహావీర మల్లుడు బాలుడైన కృష్ణుని చేతిలో మల్లయుద్ధములో చంపబడినాడు. ఇతని పేరు విష్ణు సహస్ర నామములలో చేరుటచే చాణూరుని జన్మ ధన్యమైనది. అతడు ఆంధ్రుడగుట ఆంధ్ర జాతికి ప్రతిష్ఠ, గర్వకారణము అగుచున్నది.

కంసుడు బలరామ కృష్ణులను చంపుటకై మల్లయుద్ధము ఏర్పాటు చేసినాడు. తనవద్ద నున్న వీర మల్లురలో అగ్రగణ్యుడైన చాణూరునికి కృష్ణునికి మల్లయుద్ధము నిశ్చయించినాడు. కంసుని క్రీడా ప్రాంగణములో కృష్ణ చాణూరులు వివిధములగు ఆయా ద్వంద్వ విధానములతో (పరిభ్రమణ, విక్షేపాదులతో) పెనగులాడుచు పోరాడుచుండిరి. కృష్ణుని అంగములన్నియు వజ్రముల వలె కఠినాతి కఠినములైనవి. కృష్ణుడు బలమైన తన మోచేతులతో, మోకాళ్ళతో పదే పదే తీవ్రముగా పొడుచుచుండుట వలన చాణూరుని శరీరమంతయు పూర్తిగా హూనమై పోవుచుండెను. ఆ పోటులకు తాళజాలక చాణూరుడు ఎంతయో అలసిపోవుచుండెను. అంతట చాణూరుడు కోపముతో డేగ వేగముతో ఎగిరి, తన రెండు చేతుల పిడికిళ్ళను బిగించి కృష్ణుని వక్షస్థలముపై దెబ్బకొట్టినాడు. కృష్ణుడు ఆ దెబ్బకు ఏమాత్రము చలించలేదు. వెంటనే కృష్ణుడు తన రెండు చేతులతో చాణూరుని పట్టుకొని గిరగిర త్రిప్పి నేలకేసి కొట్టినాడు. కృష్ణుడు చాణూరుని గిరగిర త్రిప్పినపుడే ఆ మల్లవీరుని ప్రాణములు పైకెగిరి గాలిలో కలిసిపోయినవి. ఇట్లు కృష్ణుడు మహా మల్లవీరుడగు చాణూరుడిని చంపి వేసినాడు.

చాణూరోదర దారణుడైన, చాణూరాంధ్ర నిషూదనుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 336. మల్ల యుద్ధాగ్రగణ్యాయ నమః


మహావీర మల్లుడగు చాణూరుని చంపిన కృష్ణుడు మల్లయుద్ధ కౌశలమున అగ్రగణ్యుడని కీర్తింపబడినాడు.

మల్లయుద్ధాగ్రగణ్యుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

## 337. పితృ బంధన మోచకాయ నమః

కంసుని చంపి, చెరసాలలో ఉన్న తల్లి తండ్రులగు దేవకీ వసుదేవులను విడిపించినవాడు కృష్ణుడు. కంసుని తండ్రి యగు ఉగ్రసేనుని కూడ కృష్ణుడు చెరసాల నుండి విడిపించినాడు.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

మధురా నగరములో జరుగుచున్న అస్త్ర పూజకు పిలిచి బలరామ కృష్ణులను హతమార్చవలెనని తలంచిన కంసుడు కృష్ణునిచే వధింపబడినాడు. అంతట కృష్ణుడు చెరసాలకు వెళ్ళి వసుదేవుని బంధవిముక్తుని చేసి, నాన్నా అని పిలిచి తండ్రి పాదములకు నమస్కరించినాడు.

పితృ బంధన మోచకుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 338. మత్త మాతంగ పంచాస్యాయ నమః

మదించిన ఏనుగు కువలయా పీడమును సింహమై వధించినవాడు కృష్ణుడు.

కువలయా పీడము అనగా కలువ పూలను బాధించునది అని అర్థము. ఈ మదపుటేనుగు కంసుని పోషణలో ఉన్నది. కువలయా పీడము ఎట్టి బలశాలిని అయినా ఏమార్చి పట్టి పడత్రోసి కాళ్ళతో త్రొక్కి చంపుచుండును. కనుకనే కంసుడు కృష్ణ బలరాముల మీదికి దీనిని పురికొలుప మావటివానిని ఆజ్ఞాపించినాడు. మావటివాడు అట్లే కువలయా పీడమను మదపుటేనుగును రంగస్థల ద్వారము కడ కృష్ణ బలరాములపై పురికొల్పినాడు. అప్పుడు కృష్ణుడు ఉత్తరీయమును నడుమునకు బిగించి, ముంగురులను సవరించుకొని ఏనుగును ఎదుర్కొనుటకు సిద్ధపడునంతలో కువలయాపీడము తన తొండముతో కృష్ణుని చుట్టివేసింది. కృష్ణుడు నేర్పుగా దాని తొండము నుండి తప్పించుకొని దానిపై పిడికిలితో ఒక్క పోటు పొడిచి తాను ఏనుగు కాళ్ళ సందున దాగుకొన్నాడు. కృష్ణుడు తన ఎదుట కనిపించకపోవడంతో ఒడలు తెలియని కోపముతో తొండముతో వాసన చూచుచు వెదకి వెదకి కృష్ణుని పట్టుకొన్నది. అప్పుడు కృష్ణుడు శక్తి యుక్తులతో దాని పట్టు నుండి బయటపడి, దాని తోకను పట్టుకొని అవలీలగా దానిని ఇరువది అయిదు బారల దూరము లాగివేసినాడు. అనంతరము కువలయా పీడము పుంజుకొని కృష్ణుని పట్టుకొనుటకు ప్రయత్నించింది. ఆ ఏనుగు కుడివైపు తిరిగినపుడు కృష్ణుడు ఎడమవైపునకు, అది ఎడమ వైపునకు తిరిగినపుడు అతడు కుడివైపునకు తిరుగుచు దానిని ఆటపట్టించుచు ముప్పుతిప్పలు పెట్టినాడు. పిమ్మట ఆ ఏనుగుకు ఎదుట నిలిచి చేతితో దానిని ఒక దెబ్బ కొట్టి పరిగెత్తుచుండగా ఏనుగు కృష్ణుని వెంట బడింది. కృష్ణుడు దానికి అందీ అందక పదే పదే ఏనుగును వంచించినాడు. అది బాగుగా అలసిపోయి కోపముతో బుసలుకొట్టుచుండగా మావటివాడు దానిని గట్టి ఉసికొల్పుటచే అది రెట్టించిన కోపముతో కృష్ణుని మీదికి దాడి చేయుటకై వచ్చుచుండెను. అంతట కృష్ణుడు ఏనుగును సమీపించి తన చేతితో ఏనుగు తొండమును గట్టిగా పట్టుకొని దానిని నేలపై పడవేసినాడు. అది క్రింద పడినంతనే కృష్ణుడు సింహము వలె విజృంభించి ఆ మదపుటేనుగును తన పాదములతో త్రొక్కి పట్టినాడు. వెంటనే కృష్ణుడు దాని ఒక దంతమును వూడబెరికి, దాని దంతముతోనే కువలయా పీడమును, మావటివాడిని చావగొట్టినాడు.

ఆ మదపుటేనుగు కళేబరమును అచటనే విడిచిపెట్టి కృష్ణుడే దాని దంతమును చేతబూని రంగస్థలమున ప్రవేశించినాడు. అప్పుడు కృష్ణుని రూప వైభవము చూపరులకు ముచ్చట గొలుపుచుండెను.

మత్తమాతంగమైన కువలయా పీడమునకు సింహము వంటి వాడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

# సంక్రాంతి సంబరాలు

- డా. దేవులపల్లి పద్మజ



**శాంతి, సౌభాగ్యం, ఐకమత్యం కలగలిసినదే పండుగ. అందరూ పండుగగా వ్యవహరించే ఉత్సవాలు వ్యక్తిగతంగాను, కుటుంబపరంగాను, బంధుగతంగాను జరుపుకుంటూ ఉంటాము. అంతవరకు వున్న కష్టాలు మరచి అందరితో కలసి మెలసి ఆనందం పంచుకునే దినమే పండుగ. ఈ పండుగల క్రమంలో వచ్చే ముఖ్యమైన పండుగలలో సంక్రాంతి ఒకటి. "సమ్యక్ క్రాంతి "సంక్రాంతి". సమ్యక్ అంటే బాగుగా లేద మేలైన లేదా ఉత్తమమైన అని అర్థం చెప్పవచ్చును. క్రాంతి అనగా పుట్టుక లేదా జనించుట లేదా వెలిగించుట అనే అర్థాలు చెప్పవచ్చును. వెరసి సమ్యక్ క్రాంతి అనే పదానికి బాగుగా ఆనందం జనించునది అని అన్వయించుకోవచ్చును.**

సూర్యుడు తన ప్రయాణంలో ఒక రాశినుండి మరొక రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు. ధనుస్సురాశినుండి మకరరాశిలోనికి ప్రవేశిస్తే మకర సంక్రమణం సంభవించి, ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభమయి, మనం ఆచరించే ''సంక్రాంతి'' పండుగ వస్తుంది. సూర్యగమనం ఉత్తరాయణ, దక్షిణాయనాలు నిర్ణయిస్తే, చంద్రగమనం మాసాలు నిర్ణయిస్తుంది. సూర్యుడు ధనుస్సురాశిలో సంచరిస్తుండగా ధనుర్మాసం జరుగుతుంది. ఈ ధనుర్మాసం ముగియగానే సంక్రాంతి శోభలు ప్రారంభమవుతాయి.

కాలచక్రంలోని రాశులలో మకరరాశి సర్వశ్రేష్టమైనది. శ్రవణానక్షత్రములో ఉద్భవించిన శ్రీమన్నారాయణుడు అనంత పద్మనాభునిగా బ్రహ్మకు సాక్షాత్కరించినది శ్రవణానక్షత్రములో. ఈ నక్షత్రము మకరరాశికి చెందినది. ఈ కారణం చేత శ్రీమహావిష్ణువుని యొక్క రాశి మకరరాశి. దీనిని మానవుని శిరస్సుగా భావిస్తారు. అటువంటి మకరరాశిలోకి సహస్రకిరణుడైన సూర్యభగవానుడు ప్రవేశించే మహత్తర పుణ్యదినం కాబట్టి, ప్రతీ వ్యక్తిలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించటానికి అత్యంత అనువైన కాలం. వేదకాలంనుంచి శిష్యులు సరైన గురువు కోసం అన్వేషించటం, గురూపదేశం పొందడం, వేదపారాయణలు సాగించటం వంటివి ఈ సమయంలోనే ఆరంభమవుతాయి.

జగత్తు జలమయమైనప్పుడు శ్రీమన్నారాయణుడు ఆదివరాహమూర్తిగా అవతరించి భూమిని ఉద్ధరించిన రోజు సంక్రాంతి. వామనావతార ఘట్టములో వామనుడికి బలిచక్రవర్తి మూడడుగుల భూమిని దానం చేసినది, వామనుడి పదఘట్టనతో పాతాళానికి చేరినది ఈరోజే. దీనికి సంకేతంగా మనం సంక్రాంతి పర్వదినం జరుపుకుంటాము. ఈ పండుగ భోగి, సంక్రాంతి, కనుము అని మూడురోజులుగా జరుపుకునే పర్వదినం.

### భోగిపండుగ

భోగి పండుగ పేరు చెప్పగానే మనకు స్ఫురించేవి భోగిపళ్ళు, భోగిమంటలు. ఆవుపేడతో పిడకలు తయారుచేసి యజ్ఞదేవతను తలుచుకుంటూ, పాపప్రక్షాళన జరిపించమని వేడుకుంటూ, ధర్మమార్గ పయనానికి సమాయత్తమవుతూ మంటలలో సూర్యోదయం సమయంలో వీటిని వేస్తారు. పిల్లలు, పెద్దలు అందరూ ఈ మంటల చుట్టూ చేరి ఆనందోత్సాహాలలో మునిగిపోతారు. ఈ మంటలలోనే పాతపడిన సామానులను

కూడా వేసే సాంప్రదాయం కూడా కనబడుతుంది. నూతనత్వానికి ఆహ్వానం పలుకాలంటే పాతదనాన్ని విడనాడాలి. ఈ మంటలు వేదకాలమునాటి ఋషులు తాము సంవత్సరారంభములో వ్రేల్చిన 'ఆగ్రాహోయణి' హోమాగ్నికి ప్రతిరూపం. హోమ భస్మం మంత్రసారము, అతి పవిత్రమైనది. మంటలు శాంతించిన తరువాత ఈ హోమ భస్మాన్ని దైవప్రసాదంగా భావించి నుదుటిన ధరిస్తారు. పిల్లలకుకూడా నుదుటిమీద ఉంచి వారి ఆయురారోగ్యాలకై ప్రార్థిస్తారు.

దేవతారాధన, నూతన వస్త్రధారణ, పిండివంటలతో భోజనము వగైరా పూర్తిచేసుకుని సాయంకాలం "భోగిపళ్ళ" వేడుక జరుపుతారు. పిల్లలను ఆశీర్వదిస్తూ పెద్దలంతా వారి శిరస్సుపై రేగిపళ్ళను పోస్తారు. రేగిచెట్టును సంస్కృతంలో బదరీవృక్షం అని పిలుస్తారు. ఈ వృక్షం విష్ణుప్రీతికరమైనది. ఈ రేగిపళ్ళతోపాటు చిల్లరపైసలు, నానపెట్టిన శనగలు, పువ్వులు పిల్లల తలలపై పోస్తూ, శ్రీమహావిష్ణువులాగా తేజరిల్లాలని ఆశీర్వదిస్తారు. తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇచ్చి సంతోషపరుస్తారు.

**సంక్రాంతి పండుగ**

రెండవ రోజు సంక్రాంతి పండుగ. పండుగలలో ప్రతి రోజుకు ఒక ప్రత్యేకత ఉంటుంది, వ్యవహార నియమ నిబంధనలుంటాయి. స్నానాదికాలు ఎలా ఆచరించాలి, ఎటువంటి పూజలు ఆచరించాలి, ఎటువంటి దానధర్మాలు చేయాలి అనేవి మన శాస్త్రాలు విపులంగా వివరించాయి. ఇవి శారీరక దారుఢ్యాన్ని పెంపొందించి, వాతావరణ సమతుల్యత కాపాడుతూ, సమతలను పెంపొందిస్తాయి. నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం శారీరక రుగ్మతలను నివారిస్తుంది. నువ్వులు సేవించటం వలన ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. ఈరోజు జరిపే శాంతి హోమాలు, మృత్యుంజయ హోమాలు, అభిషేకాలు, వివిధ దైవారాధనలు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించి, భగవదానుగ్రహానికి తోడ్పడతాయి. పితృదేవతల స్మరణ వారి అఖండ ఆశీర్వచనానికి దోహదం చేస్తాయి. మన పెద్దలు మనకిచ్చిన జన్మకు కృతజ్ఞత ప్రకటించటం ప్రతీ ఒక్కరి కర్తవ్యం. వారిని స్మరిస్తూ తగిన విధంగా తర్పణాలు విడవటం, వారి జ్ఞాపకార్థం దాన ధర్మాలు చేయటం శాస్త్ర విధి. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు. సుగంధ ద్రవ్యాలతో, పంచామృతములతో చేసే అభిషేకాలకు చక్కటి ఫలితాలుంటాయి. విష్ణువు అలంకార ప్రియుడు. రకరకాల పూలమాలలతో అలంకరిస్తే, ఆయన అవ్యాజ కరుణ మనపై కలుగుతుందని పురాణ ప్రవచనం. అపాత్ర దానం పనికిరాదు. తగిన వారికి తగినట్లు దానం చెయ్యాలి. ఎవరి అవసరాన్ని బట్టి వారికి దానం చెయ్యాలి. పేదలకు కంబళ్ళు, వస్త్రాలు దానమివ్వాలి. యోగ్యులైన బ్రాహ్మణులకు శక్తిననుసరించి సువర్ణ, రజిత, కాంస్య దానాలు ఇవ్వాలి. ఈ ప్రకృతిలో లభించే ప్రతీ వస్తువు ప్రతీ ఒక్కరి సొంతం అనే నిర్వచనానికి ప్రతీకలే దాన ధర్మాలు. పౌష్య, మాఘ మాసముల సంధిలో వచ్చే అమావాస్యనాడు సూర్యుడు మకరరాశిలో ప్రవేశం చేస్తే అట్టి సంక్రమణ కాలమే అర్థోదయకాలము. ఇది పగటి పూట వస్తే ప్రశస్తము. మధ్యాహ్నమునకు పూర్వమే సంభవించే అర్థోదయకాలమే పూర్తి ఫలితాన్నిస్తుంది. ఆ సమయంలో ఏ కొంచెము దానమిచ్చినా మేరు పర్వతమంత పుణ్యమిస్తుంది. అర్థోదయకాలంలో "ఏ బ్రాహ్మణుడైన బ్రహ్మతో సమానం". "ఏ పుణ్య జలమైనా గంగతో సమానం" అని శాస్త్ర వచనం, వేదవచనం. ఈ నాడు పాయస దానము, కాంస్య పాత్ర దానము, సువర్ణలింగ దానము, కూష్మాండ దానము, పెరుగు దానము ప్రశస్తమైనవి.

గొబ్బిళ్ళ సందడి సంక్రాంతి పండుగ వేడుకలలో మరొక ప్రధానమైనది. కన్నె పిల్లలు చక్కటి వస్త్ర ధారణతో, తమకు కలిగిన ఆభరణాలతో చూడచక్కగా అలంకరించుకుంటారు. తెలుగుదనం ఉట్టి పడే కన్నె పిల్లలను చూచి కుటుంబ సభ్యులు మురిసిపోతారు. వివాహ వయస్సుకు వచ్చినారని చెప్పకనే చెబుతారు. పెద్దవారికి ఇది ఒక హెచ్చరికలాంటిది. ఆవుపేడతో గుండ్రముగా బంతులవలె తయారుచేసి, ఇంటి ముంగిటి రంగవల్లుల మధ్య అమరుస్తారు. వాటిపై బంతిపూవులు, ఇతర రంగు రంగు పూలను అలంకరించి, వాటి చుట్టూ తన తోటివారితో, స్నేహితులతో వలయాకారంగా తిరుగుతూ, గొబ్బిపాటలు పాడుతూ, లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ తిరుగుతారు. ఇది సంధ్యాసమయంలో జరిగే కనుల పంట. చూచినవారిదే భాగ్యం. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైనది. ఈవిధంగా చేయటం వలన కన్నెపిల్లలకు త్వరలోనే చక్కటి వరుడు లభించి వివాహం జరుగుతుందని విశ్వాసం. విజ్ఞాన శాస్త్ర పరంగా కూడా ఇది ఎంతో మంచిది. అనేక రకాల క్రిమి సంహారకంగా ఉపయోగపడుతుంది. ప్రతీ ఇంటి ముంగిట దర్శనమిచ్చే గొబ్బిళ్ళు స్వాగతం పలుకుతూ, అసలు సిసలైన పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది.

"హరి హరి గోవిందా" అని కీర్తిస్తూ, లయబద్ధంగా చిడతలు వాయిస్తూ, భుజముపైనున్న వీణను స్వరబద్ధముగా మీటుతూ, అడుగు అడుగులో గజ్జెల సవ్వడి నింపుతూ విలాసంగా సాగిపోయే హరిదాసులు మన సంప్రదాయ చిహ్నాలు. హరి నామ సంకీర్తన తప్ప మరొక మాట వారి నోటివెంట వెలువడదు. రంగు రంగుల వస్త్రధారణతో, మెడలో పూదండతో హుందాగా నడుస్తూ సాగిపోతారు. శిరస్సుపై చక్కగా పూవులతో అలంకరించిన ఇత్తడి గిన్నెను ధరించి, ఎవరైనా తమంత తాముగా ఏదైనా సమర్పించదలుచుకుంటే వంగి లేదా మోకాళ్ళపై కూర్చుండి

గిన్నెలోకి స్వీకరిస్తారు. ఎందుకంటే వారి వృత్తి భిక్షాటన కాదు. భగవన్నామ సంకీర్తనా ప్రచారం వారి వృత్తి, ఆయాచితంగా వచ్చినది స్వీకరించటం వారి ప్రవృత్తి. సంప్రదాయాలను గౌరవించే గృహస్థులు నిత్యము వారికోసం ఎదురు చూచి, తమకు కలిగినది వారి సమర్పించుకుంటూ భావితరాలకు ఆదర్శవంతంగా నిలుస్తారు.


**కనుమ**

మూడవ రోజైన పండుగ కనుమ పండుగ. కనుమ నాడు మినుము తినాలంటారు. అందుకే ఆవునేతితో తయారుచేసిన మినపసున్నెలు, బెల్లం గారెలు వంటిని తయారుచేసుకుంటారు. నోరూరించే పదార్థాలు జిహ్వను మరింత పెంచగా మానసిక సంతృప్తితో కడుపారా అస్వాదిస్తారు. వ్యవసాయదారులు తమ తమ పశువులను అలంకరించి వాటిని స్వేచ్ఛగా తిరిగేలా చేస్తారు. బలవర్ధకమైన దాణావేసి విశ్రాంతిగా ఉండేలా చేస్తారు. వ్యవసాయ క్షేత్రములో వాటి అవసరం లేకుండా పంటలు పండవు. నాగరిక ప్రపంచములో యంత్రాల వినియోగం ఎక్కువైనప్పటికి, పశువుల వినియోగం లేకుండా సాగదు. మనకు జీవనాన్ని, జీవితాన్ని ఇచ్చిన ప్రతీ ప్రాణిని గౌరవించాలనే సత్సాంప్రదాయము మనది. కనుమనాడు కాకి కూడా కదలదు అనే నానుడి ప్రచారంలో ఉంది. శాస్త్రపద్ధతిలో ఆలోచిస్తే దీనికి తగిన కారణం కనబడుతుంది. దైనందిన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి ఆనందంగా జీవించటానికి అవకాశం కల్పించేవే కొన్ని కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలు. బయటకు వెళ్ళకూడదు అనే నియమం పెడితే చక్కగా ఇంటి వద్దే వుండి సంతోషంగా గడుపుతారని దీని ముఖ్యోద్దేశము. అంతేకాకుండా మరుసటి రోజున బంధువులు తమతమ స్వస్థలాలకు వెళ్ళిపోతారు కనుక వారి వీడ్కోలుకు కావలసిన కార్యక్రమ నిర్వహణకు దోహదం చేస్తుంది. వయస్సుతో నిమిత్తం లేకుండా కోడిపందేలతో మగవారు ఆనందిస్తారు. ఒక ప్రాణిని హింసిస్తూ మనం ఆనందించటం ఎంత వరకూ సమర్ధనీయమో విజ్ఞులు ఆలోచించాలి. ఈ మధ్య న్యాయస్థానాలు కూడా కోడిపందేలు నిషేధించాయి.

బొమ్మల కొలువు ప్రతీ ఇంటా కొలువుదీరుతుంది. సంవత్సరం పొడవునా సేకరించిన రకరకాల బొమ్మలను పలు వరుసలలో అలంకరించి హృద్యమైన వాతావరణాన్ని తయారుచేస్తారు. వస్తుగ్రహణాశక్తిని పెంపొందించి, మానసిక శాంతిని కలిగిస్తుంది. సిరిసంపదలు కలుగుతాయని విశ్వాసం. బొమ్మల కొలువు పేరుతో ఇంటిని అందంగా అలంకరిస్తారు. పలువురు విచ్చేసి అలంకరణలను వీక్షించి ముగ్ధులౌతారు.

ఇంటిని అలంకరించిన మామిడి తోరణాలు, నూతన వస్త్ర ధారణలు, వాకిట భోగి మంటల వింత శోభలు, నట్టింట్లో నిండు గర్భిణిలా ధాన్యపు గాదెలు, వాకిట్లో హరిదాసులు ఆలపించే హరిభజనలు, తోటల్లో కోడిపందేలు, పెరట్లో పశువుల అలంకారాలు, అత్తింట్లో అల్లుడుగారు ఎక్కే అలకపాన్పులు, వంటింట్లో అత్తగారు చేసే నేతి అరిసెల ఘుమఘుమలు, అంగట్లో వస్త్రాల సంబరాలు, ఆలయాలలో దైవ పూజలు, ముంగిట్లో వయ్యారి భామలు దిద్దే ముత్యాల రంగవల్లులు, రంగవల్లులపై శోభిల్లే గొబ్బిళ్ళు, దాన ధర్మాల తృప్తిపొందిన దానగ్రహీతలు.... కలగలిసి మన సంక్రాంతి.

ఈ విధంగా మూడు రోజులు నూతన వస్త్రాలు ధరించి, యథాశక్తి పూజలు, హోమాలు సలిపి, దానాలు చేసి, పశువులను అలంకరించి అందరితో కలసియథాశక్తి పిండివంటలు భుజించి అత్యంత ఆనందంగా గడుపుకుని, సంవత్సరమంతా పండుగలా గడవాలని కోరుకుంటారు.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా**

## గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

### 74వ కళ్యాణం

తేది 08-12-2024 ఆదివారం నాడు జరిగింది. ఇది అబ్దుల్లాపూర్ మండలం, తుర్కయంజాల్ సమీపంలో గల బ్రాహ్మణపల్లిలో శ్రీమాన్ చెరుకుపల్లి చంద్రశేఖరరెడ్డి, ప్రాణహిత దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా అన్నమయ్య సంకీర్తనల మధ్య జరిగింది.

### 75వ కళ్యాణం

తేది 15-12-2024 ఆదివారం రోజు ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది కోకాపేటలోని వర్టెక్స్ పనాచే అపార్టుమెంట్ లో అంగరంగ వైభవంగా, వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య సంకీర్తనల మధ్య జరిగింది. దీనిని శ్రీమాన్ పీసపాటి గౌతమ్, విజయలక్ష్మి దంపతులు మరియు కమ్యూనిటీ సభ్యులు నిర్వహించారు.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



**శ్రీమన్నామ ప్రోచ్య నారాయణాఖ్యం**
**కే న ప్రాపుర్వాంఛితం పాపినో పి ।**
**హా! నః పూర్వం వాక్ప్రవృత్తా న తస్మిన్**
**తేన ప్రాప్తం గర్భవాసాది దుఃఖం ॥**

సకల క్రియలకు ఫలదాత అయినటువంటి వాడు భగవంతుడే, అని జ్ఞాపకం లేక చేసే కార్యములు నిష్ప్రయోజనములని నిన్నటి శ్లోకంలో వివరించారు. గొప్ప క్రియలకు మహిమ కలగాలంటే సంపూర్ణ విశ్వాసంతో పరమాత్మను స్మరిస్తే ఫలం చేకూరుతుంది. వారి యొక్క దివ్యమైనటు వంటి నామాన్ని స్మరిస్తే సమస్త పాపరాశి దగ్ధం అయి పొందవలసిన నిత్యమైన ఫలం లభిస్తుంది.

ఎంత పాపం చేసిన వారైనప్పటికీ 'నారాయణ' అనే పవిత్ర నామాన్ని స్మరిస్తే సకల శుభాలు పొందుతారు. అయ్యో!! నేను పూర్వం నా నోట ఆ నారాయణ మంత్రాన్ని ఉచ్చరించక పోయినందు వల్లనే నాకీ జన్మము మరియు ఈ గర్భవాస దుఃఖం ప్రాప్తించింది.

కులశేఖరాళ్వార్లు ముందుగా "శ్రీమన్" అని ప్రయోగించడంలో మనము ఆశ్రయించి తరించడానికి ఎటువంటి స్థితిలో భగవంతుడిని పట్టుకుంటే అధికమైన ఫలం కలుగుతుందో చెబుతున్నారు. నేరుగా భగవంతుడిని ఆశ్రయిస్తే తన యొక్క ప్రేమతో పాటు, కోపాన్ని కూడా భరించవలసి ఉంటుంది. అలా కాక అమ్మని ఆశ్రయించి తనద్వారా అయ్యవారిని సేవిస్తే అధికఫలం పొందుతాం.

"శ్రీమన్" అనే శ్రీ శబ్దం నేతృత్వంను సూచిస్తుంది. అష్టాక్షరి మంత్రంలో ఆత్మ తన స్వరూపాన్ని గుర్తిస్తుంది కనుక ప్రాధాన్యత ఆత్మపై ఉంటుంది. చరమ శ్లోకంలో, "అహంత్వా సర్వ పాపేభ్యో" అని చెప్పేటప్పుడు ప్రాధాన్యత పరమాత్మగా కనిపిస్తుంది. మనపై భారం వేసుకుంటే అంతగా నమ్మకం ఉండదు. భగవంతుడిపై వేస్తే ఆయన ప్రేమనే కాదు కోపాన్ని కూడా తట్టుకోవాల్సి ఉంటుంది. ఈ భయం అవసరం లేదు నేనున్నాను మీ మధ్యలో అంటూ అమ్మ లక్ష్మీదేవి బాధ్యత తీసుకుంటుంది కనుక ఆమెను నేత్రీ అంటాం. ఆమె వహించే కార్యం నేతృత్వం.

"మన్" అంటే - నిత్యయోగం వాన్ అంటే కలిగిన వాడు అని అర్థం. కళ కలిగిన వాణ్ణి కళావాన్ అని, వస్త్రం కల వాణ్ణి వస్త్రవాన్ అని, దండము కల వాణ్ణి దండవాన్ అని పిలుస్తారు. అయితే ఒక్కో సారి అవి కలిసి ఉండవచ్చు ఒక్కోసారి అవిలేక ఉండవచ్చు. శ్రీమాన్ అంటే శ్రీని తాను ఎల్లప్పుడూ కలవాడు అని అర్థం. సూర్యుడి నుండి కిరణాలని ఎలా ఐతే విడదీయలేమో అట్లానే శ్రీ ని తన నుండి విడదీయలేము కనుక 'మన్' అని వ్యవహరిస్తాం. మన్ అనేది నిత్యయోగాన్ని తెలుపు తుంది. అటు వంటి శ్రీమంతుడిని ఆశ్రయించాలి. మరి ప్రాణులకు ఎందుకు దుఃఖమయమైన ఈ జన్మలు కలుగుతున్నాయంటే ఆ జన్మల్లో మన వాక్కు భగవద్విషయమునందు ప్రవర్తించకపోవటమే కారణం. అలాంటి కష్టకాలమున వాక్కు శ్రీమన్నారాయణుడిని స్మరించని కారణాన గర్భవాసాది దుఃఖములు కలుగుతాయి.

"అపిచే త్సు దురాచారో భజతే మా మనన్యభాక్" ఎంతటి పాపపు రాశి పెంచుకున్నాను. ఒక్కసారి మనసా భగవద్భక్తి కలిగితే శ్రేష్ఠుడు అవుతాడు అని కృష్ణపరమాత్మ సెలవిచ్చాడు.

శ్రీమంతుడైన పరమాత్మను ఆశ్రయిస్తే సమస్త పాపములు నశించి ఆ భగవద్ జ్ఞానం అనే ఓడ చేత ఈ దుఃఖాలయము


నుండి నిత్యమైన ఆనందాన్ని పొందగలుగుతాము.

ఆధ్యాత్మిక సంపదకు, భక్తిశ్రద్ధలకు నిలయమైన దేశంలో పవిత్రమైన, దివ్యమైన క్షేత్రంగా పేరు గడించింది "పూరి". పూరికి దగ్గరలో ఒక కుగ్రామం వుంది. ఆ గ్రామం పేరు – 'కిందుబల్వం'. దానినే బిందుబిల్వం అని కూడా పిలుస్తారు. ఆ గ్రామంలో నివసిస్తూవుండేవాడు ఒక నిరుపేద. ఆతను విద్య నేర్చినవాడు. పూరి జగన్నాథుడి పట్ల అమితమైన భక్తిగలవాడు. ఆయన పేరు "భోజదేవుడు" ఆయన సతీమణి రమాదేవి. ఆమెను అందరూ వామాదేవి అని కూడా పిలుస్తారు. ఆమె భర్తకు తగ్గ భార్య. దంపతులిద్దరూ దైవభక్తి పరాయణులుగా పేరు గడించారు. ఆ దంపతులంటే అందరికీ గౌరవభావం.

ఆ దంపతులకు ఒక పుత్రుడు జన్మించాడు. పిల్ల వాడికి "జయదేవుడు" అని నామకరణం చేసి, అల్లారు ముద్దుగా చూసుకోసాగారు. జయదేవుడు చిన్నతనంలోనే తండ్రి వద్ద భారత, రామాయణ, భాగవతాలను నేర్చుకున్నాడు. చిలిపికృష్ణుడి అల్లరిచేష్టలు తెలుసుకుని ఆనందించాడు. తమలాగే తమ పుత్రుడు నిరుపేద కాకూడదను కున్నారు. అందుకే తాము కష్ట పడ్డా లెక్కచేయక కుమారుడిని సకల విద్యలలోనూ పరిపూర్ణుడిని చేయడానికి కృషిచేశారు. తల్లి దండ్రుల ఆసక్తిని, కోరికను, వారు చూపిస్తున్న ప్రేమను, కనబరుస్తున్న ఆప్యాయతాను రాగాలను తెలుసుకున్న జయదేవుడు, ఆ ప్రకారమే సకల విద్యాపారంగతుడయ్యాడు.

జయదేవుడు విద్యావంతుడైతే అయ్యాడుగానీ, దారిద్ర్యం మాత్రం తీరలేదు. తపస్స్వాధ్యాయనాలలో కాలం గడపడం ప్రారంభించాడు. ఇలాంటి స్థితిలో ఒక రోజు దేవశర్మ అనే వ్యక్తి జయదేవుడి దగ్గరకు వచ్చాడు. ఆయన ప్రక్కనే యుక్త వయస్సులో వున్న అందమైన యువతి వుంది. దేవశర్మ పూరికి చెందినవాడు. జగన్నాథుడి భక్తుడు. ఆయన భార్య విమలాంబ. ఆమె భర్తకు మించిన భక్తురాలు. ఆ దంపతులకు జగన్నాథుడే సర్వం. నిత్యం ఆ జగన్నాథునే స్మరిస్తూ కాలం గడుపుతున్నారు. అయితే వారికి వుండేలోటు ఒక్కటే...సంతానం లేకపోవడం. సంతానం కోసం ఎన్నో వ్రతాలు, పూజలు, నోములు నోచారు. చివరకు పిల్లలు పుడితే మొదటి సంతానాన్ని జగన్నాథుడికే సమర్పిస్తానని మొక్కుకున్నాడు. శరణన్న భక్తుల మొరలను ఆలకించి...వారిని కాపాడటమే ఆ జగన్నాథుడి చర్యకదా. అందుకే ఆ దంపతుల మొరను ఆలకించాడు. కొంత కాలానికి ఆ దంపతులకు పండంటి ఆడపిల్ల పుట్టింది.

పద్మావతి అని నామకరణం చేశారు. దైవప్రసాదంగా భావించి పద్మావతిని అల్లారుముద్దుగా, గోముగా పెంచసాగారు. పద్మావతి పెరిగి పెద్దదై యుక్తవయస్సుకు చేరింది. దేవశర్మకు జగన్నాథుడికి ఇచ్చిన హామీ గుర్తుకు వచ్చింది. ఒకరోజు



పద్మావతిని తీసుకుని ఆలయానికి వెళ్లాడు. జగన్నాథుడికి ప్రణమిల్లి, "స్వామి మా కోరికను మన్నించి, మాకు సంతానాన్ని ప్రసాదించావు. నా మొదటి సంతానం పద్మావతిని మీకు అర్పిస్తున్నాను స్వీకరించండి స్వామీ" అంటూ ప్రార్థించాడు. వేడుకున్నాడు. జగన్నాథుడు ఉలకలేదు...పలకలేదు... దేవశర్మ ఆలయం మూసేంత వరకూ నిరీక్షించి, చివరకు ఇల్లు చేరుకున్నాడు.

ఆ రోజు రాత్రి నిద్రిస్తున్న దేవశర్మకు ఒక స్వప్నం వచ్చింది. జగన్నాథుడు ప్రత్యక్షమై. "భక్తా! పద్మావతిని జయదేవుడనే భక్తుడికి ఇచ్చి వివాహం చేయి. అదే నా కోరిక" అని ఆజ్ఞాపించాడు. అందుకే కూతురిని వెంటబెట్టుకుని దేవశర్మ, జయదేవుడి దగ్గరకు వచ్చారు. దేవశర్మ తన మనసులోని మాటను జయదేవుడికి చెప్పాడు. "నేను నిరుపేదను...మీ అమ్మాయికి తగినవాడిని కాదు" అన్నాడు జయదేవుడు. "అలా అనకు నాయనా! ఇది జగన్నాథుడి ఆజ్ఞ. పద్మావతికి నీవే తగిన భర్తవు. ఇది ఆ దేవుడే నిర్ణయించాడు" అన్నాడు దేవశర్మ. కాదు అన్నట్లుగా తల ఊపాడు జయదేవుడు.

"నా మాటకు అడ్డుచెప్పకు. మా అమ్మాయి పద్మావతిని నీ వద్దే వుంచి వెళతాను. తరువాత నీ ఇష్టం" అని జయదేవుడితో చెప్పి పద్మావతివైపు తిరిగి – "అమ్మా పద్మావతీ! ఈ జయదేవుడే నీ భర్త. ఆయన చెప్పినట్లుగా వింటూ – అయన అడుగుజాడలలో నడుచుకుంటూ కలకాలం కలిసి మెలసి వుండండి" అని చెప్పి పద్మావతిని అక్కడే వదిలి వేసి వెళ్లాడు దేవశర్మ.

జయదేవుడు నిల్చునివున్నాడు. ఎదురుగా నేలపై చూస్తూ

పద్మావతి నిలబడివుంది. ఇద్దరూ ఎదురెదురుగా నిల్చున్నా, వారిద్దరి మధ్య మౌనం రాజ్యమేలుతోంది. నేల చూపులు చూస్తున్న పద్మావతిని నిశితంగా పరిశీలించాడు జయదేవుడు. అమాయకమైన ముఖంతో నిలబడి వున్న పద్మావతిని చూస్తే దయ, జాలి బయలుదేరాయి జయదేవుడిలో. "నీకు భయం వేయడం లేదా?" అడిగాడు జయదేవుడు. "మీరున్నారు కదా? భయం ఎందుకు?!" ఎదురు ప్రశ్న వేసింది పద్మావతి. "ఈ నిరుపేద నిన్నెలా రక్షిస్తాడు? ఎలా పోషిస్తాడు...? మళ్ళీ అడిగాడు జయదేవుడు.

"నా దైవం మీరే. ఇది నా నిర్ణయం కాదు. సాక్షాత్తూ ఆ జగన్నాథుడి నిర్ణయం. ఆ జగన్నాథుడే మీ దగ్గరకు పంపిస్తే ఇక నాకెందుకు భయం? దైవ నిర్ణయానికి మించింది ఈ లోకంలో వుందా?" వేదాంతిలా పలికింది పద్మావతి. పద్మావతి మాటలు జయదేవుడికి నచ్చాయి. వారిద్దరి వివాహం జరిగింది. మరి జగన్నాథుడే గీత గీస్తే అది చెరిపివేయడం ఎవరికి తరం? ఆ దంపతులిద్దరూ ఉన్నంతలోనే హాయిగా, ఆనందంగా కాలం వెళ్ళబుచ్చ సాగారు. వారిది ఆదర్శ దాంపత్యం.

సకల విద్యాపారంగతుడైన జయదేవుడిలోని భక్తి, కీర్తనం వైపుకు మళ్ళింది. దేవుడి పైన కావ్యాల రచనను ప్రారంభించాడు. అలా దైవచింతనలో పాటలు, కీర్తనలు వ్రాసి దేవుడి సన్నిధిలో వాటిని గానం చేసి వాటిని ఆ దేవునికే అంకితం ఇవ్వసాగాడు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి చివరకు బెంగాల్ రాజు అయిన లక్ష్మణసేనుడి చెవిలో పడింది. లక్ష్మణసేనుడు సంగీత సాహిత్య ప్రియుడు. పండితుడు, ప్రబంధరచనా పటిమ గలవాడు. స్వయంగా సాహిత్యప్రియుడు కదా. కవులన్నా, కళాకారులన్నా లక్ష్మణసేనుడు దేవుడితో సమానంగా చూసేవాడు. జయదేవుడిని గురించి తెలుసుకున్న లక్ష్మణ సేనుడు జయదేవుడిని ఆస్థానానికి పిలిపించుకున్నాడు. ఆస్థాన కవిని చేసి సత్కరించాడు.

జయదేవుడి పేదరికం తొలగిపోయింది. లక్ష్మణ సేనుడి సాంగత్యంలో జయదేవుడు ఎన్నో రచనలు గావించాడు. ప్రజలు, ప్రభువులూ జయదేవుడిని కీర్తించసాగారు. మరో ప్రక్క లక్ష్మణ సేనుడికి, జయదేవుడికి మధ్య రాజు, కవి సంబంధమే కాదు, స్నేహ సంబంధమూ మొగ్గ తొడిగి పుష్పించింది.

లక్ష్మణసేనుడి ఆదరణతో రూపుదిద్దుకున్న కావ్యం గీతగోవిందం. దీనినే జయదేవుడి అష్టపదులు అని కూడా పిలుస్తారు.

**"రాధికా తవ విరహే కేశవ..."**

**"ధీర సమీరే యమునా తీరే..."**

**"చందన చర్చిత నీల కళేబర..."**

**"సావిరహే తవ ధీనా రాధా..."**

**"పశ్యతి దిశ దిశ రహసి భవతం..."**

ఇలా గానం చేస్తూ వ్రాయడం మొదలుపెట్టాడు జయదేవుడు 'గీతగోవిందం'ను. రాధామాధవుల ప్రణయం, విరహం, కలహం. ఇలా ఒక్కటేమిటి అన్నీ వర్ణించాడు. జయదేవుడు ఈ అష్టపదులను గానం చేస్తూ, వ్రాస్తూ వుంటే పద్మావతి అందుకు తగ్గట్టుగా నాట్యం చేస్తూంది. అలా ఆటపాటలలో జయదేవుడు రాధాకృష్ణుల ప్రణయాన్ని ఇతి వృత్తంగా చేసుకుని 12 సర్గలలో 24 అష్టపదులలో 72 శ్లోకాలతో గీతా గోవిందంను పూర్తిచేశాడు.

అంతటితో ఆగాడా? లేదే. రతిమంజరి, చంద్రలోకం, కారకవాదము, తత్త్వచింతామణి వంటి రచనలు చేసాడు. జయదేవుడు ఇటు రచించాడో లేదో, అటు ప్రజల నాలుకల మీద ఆ కావ్యములు నాట్యమాడడం ప్రారంభించాయి. ముఖ్యంగా 'అష్టపదుల' పట్ల ప్రజల్లో మక్కువ ఎక్కువైంది. ఏ ఉత్సవమైనా సరే, ఏ పూజ అయినా సరే, ఏ ఆలయమైనా సరే, ఇలా ఎక్కడ చూసినా జయదేవుడి అష్టపదుల గానమే! తన ఆస్థాన కవి జయదేవుడు రచించిన "గీత గోవిందం"కు అంత పేరు ప్రఖ్యాతులు రావడం లక్ష్మణసేనుడిని ఆనందపరిచింది. అయితే ఏదో మూరు మూల ఈర్ష్య కూడా చోటు చేసుకుంది. ఈర్ష్యకు కారణం రాజు కూడా అలాంటి పాటలే రచించాడు. అవి జగన్నాథుని గుణగణాలను పొగుడుతూ వ్రాసినటువంటివే. అయితే ప్రజలు జయదేవుడి పాటలే పాడుతున్నారు కానీ, రాజుగారివి ఎవరూ పాడడం లేదు.

రాజుగారు బాధపడ్డాడు. చివరకు ప్రజల అభిప్రాయాన్ని అడిగాడు. జయదేవుడి పాటలు నచ్చినంతగా రాజుగారి పాటలు నచ్చలేదని వారు తేల్చి చెప్పారు. జయదేవుడి పాటలు దేవుడికీ ఇష్టమన్నారు. పైకి అంగీకరించినా, లోపల మాత్రం బాధ తగ్గలేదు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చిన రాజు – "నా పాటలను, జయదేవుడి పాటలను స్వామివారి పాదాల దగ్గర వుంచుదాం. నచ్చిన పాటలను తన వద్ద ఉంచుకుంటాడు. నచ్చనివి దూరంగా వేస్తాడు. ఇది మీకు అంగీకారమేనా?" అని ప్రజలను అడిగాడు. అందుకు వారు సిద్ధమయ్యారు.

జయదేవుడి అష్టపదులనూ, రాజు పాటలను ఆలయంలోని దేవుడి పాదాల వద్ద వుంచారు. ఆ రాత్రి ఆలయాన్ని మూశారు. అందరిలోనూ ఆతృత. దానికి సంబంధించిన ఆలోచనలే. ముఖ్యంగా రాజులో అయితే మరీ ఎక్కువ. తెల్లవారింది. ఆలయం తెరిచే సమయం అయింది. ఆశతో రాజు గుడి దగ్గరకు చేసుకున్నాడు. ప్రజలు అధికసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆలయ తలుపులు తెరిచారు. ప్రజలు ఆనందంతో చిందులు వేసారు. జయదేవుడి గీతగోవిందం ఆలయంలోని జగన్నాథుడి తలమీద వుంది. రాజు గారి పాటల పుస్తకం ఎక్కడో దూరంగా పడివుంది. రాజు సిగ్గు పడ్డాడు. బాధ పడ్డాడు. చివరకు దేవుడే మెచ్చిన జయదేవుడి పైన ఈర్ష్య పడడం తన మూర్ఖత్వం అనుకున్నాడు. జయదేవుడి అష్టపదుల ప్రచారానికి కృషి

చేయాలని భావించాడు. రాజు అనుకుంటే దెబ్బలకు కరువా? ఇక దేశంలో ఎక్కడ చూసినా అష్టపదుల గానమే!

జయదేవుడు దశావతారాల గురించి వ్రాసిన కావ్యం, దశకృతికృతే, కృష్ణుడు మూడు ముఖాలతో వేణువు వాయిస్తున్నట్టు వర్ణించే కావ్యం, త్రిభంగి అతని వల్లే ప్రాశస్త్యము నొందింది. జయదేవుని రెండు అష్టపదులు సిక్కుల మతగ్రంథమైన గురు గ్రంథ సాహిబ్లో కనబడతాయి. దీనిని బట్టి, జయదేవుని రచనలు గురునానక్ మీద, అతడు పూరీని సందర్శించినప్పుడు, ఎంత ప్రభావం చూపాయో అర్థమౌతుంది.

గీత గోవిందం జయదేవుని గొప్ప కావ్యం. రాధాకృష్ణుల ప్రేమ తత్వమును గూర్చి అష్టపదులుగా రచించిన మహానుభావుడు. అది 12 అధ్యాయాలు, ఒక్కొక్క అధ్యాయం 24 ప్రబంధాలుగా విభజింపబడింది. ఒక్కొక్క ప్రబంధంలో ఎనిమిది ద్విపదలు ఉంటాయి. వీటినే అష్టపదులు అంటారు. ఈ గ్రంథము 24 అష్టపదులు, 80 కి పైగా శ్లోకములు కలిగి, 12 సర్గలతో వ్రాయబడెను. గోవిందుని గూర్చి రచింపబడిన గేయ ప్రబంధమగుటచే దీనికి "గీతగోవిందం" అని పేరిడిరి. ఈ అష్టపదులు నాయకా, నాయకీ, నటులచే పాడబడినట్లు రచింపబడెను. దీనిలో 19 వ అష్టపది "దర్శనాష్టపది" అనియు "సంజీవనీ అష్టపది" అనియు చెప్పబడింది. ఇది రాధాకృష్ణుల ప్రణయ తత్వమే పరమార్థంగా భావించే, నింబార్కుడి వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి యున్నకావ్యం. నవవిధ భక్తి మార్గాలలో – 1. పిత్రాపుత్ర, 2. రక్ష్య రక్షక, 3. ఆధార ధేయ, 4. శరీరాత్మ, 5. జ్ఞాత జ్ఞయ, 6. భోక్తృభోగ్య, 7. స్వస్వామి, 8. భార్యాభర్తృ, 9. శేషశేషి అను భార్యాభర్తృ భక్తిమార్గం గీత గోవిందంలో జయదేవుడు నిరుపించాడు. ఇందులో సర్గనామములు సాభిప్రాయములు–సామోద దామోదరము, క్లేశ కేశవము, ముగ్ధ మధుసూదనము ఇత్యాదులు పలు సర్గలు. రసము శృంగారము, ఏకాదశ ద్వాదశ సర్గలలోని శృంగారము, సంభోగము. నాయకుడు గోవిందుడు. నాయిక రాధ. జయదేవ కవి రాధ ఇంద్రాణి అయినట్లు జయదేవ స్వామి చరిత్రలో ఇలా ఉంది.

'తొల్లి ఒకప్పుడు స్వర్గరాజ్య రమయైన ఇంద్రాణి వైకుంఠధాముని దర్శించటానికి వెళ్ళి ఆతని నవమన్మధ మన్మధాకృతిని దర్శించి నంత మాత్రాన మోహబాణ పాతాలకు పాలై స్వామిని చూచి "ఓ దీనమూర్తి హరా! నన్ను నీ ఉత్సంగానికి ఆశ్రితురాలిగా చేయవే" అని ప్రార్థించింది. భగవంతుడు ఆమెను చూచి "నేను సాధుసంత్రాణ శీలుడనై కృష్ణాఖ్యతో భూమిమీద అవతరిస్తాను. నీవు రాధగా జన్మించి నీ మనోరథ సిద్ధి పొందుదువుగాక." అని అనుగ్రహించాడు.

జయదేవుడు శ్రీ కృష్ణుని పరబ్రహ్మ స్వరూపముగా పూజించెను. ఈ గీత గోవిందమును శృంగార రసముతో, మధుర భక్తితో, నాయకా, నాయకీ భావముతో స్తుతించెను. ఇందు రాధ నాయకి–జీవాత్మ, కృష్ణుడు నాయకుడు–పరమాత్మ, సఖి – ఈ సఖి జీవాత్మను ముక్తి పథములో నడిపించి పరమాత్మలో లీనము చేయుటకు తోడ్పడును. ఇదియే గీత గోవిందములోని సారాంశము.

## దర్శన అష్టపది

జయదేవుడు గీత గోవిందమును మిక్కిలి ఉత్సాహముతో, దీక్షతో, భక్తితో వ్రాయుచుండెను. 10వ సర్గలో గల 19వ అష్టపదిలో 7వ చరణమును రచించుచున్న సమయములో తన భావనాకల్పన అతి విచిత్రముగా నుండెనట. కృష్ణుడు రాధతో...

**"స్మరగళ ఖండన మమ శిరసి మండనం**
**దేహి పద పల్లవముదారం....."**

"రాధా! ప్రేమ అను విషము నా తలకెక్కి యున్నది. అందువలన నీ కోమలమైన పాద పద్మములను నా శిరస్సుపై నిడుము. అపుడు ఆ విషమంతయు దిగును." అను అర్థము వచ్చునటుల వ్రాసినాడట. కాని వెంటనే "ఏమీ! రాధ తన పాదమును కృష్ణ పరమాత్మ తలపై నుంచుటయా? ఇది మహాఘోరమైన పని. ఇట్లు వ్రాయుట మహాపచారము" అని తలచి ఆ పంక్తులను కొట్టివేసి, జయదేవుడు లేచి, అభ్యంగన స్నానమునకు నూనె ఒంటికి, తలకు రాసుకొని నదికి వెళ్ళినాడట. కొంత సేపటికి ఆ స్వామి జయదేవుని రూపమున తిరిగి వచ్చి ఆ వ్రాతప్రతిని తెమ్మని పద్మావతిని ఆడిగి, ఆ కొట్టివేసిన పంక్తులనే మరల వ్రాసి వెళ్ళిపోయెనట. స్నానము చేసి వచ్చిన జయదేవ కవికి తాను కొట్టివేసిన పంక్తులు మరల వ్రాసి యుండుట చూసి, ఆశ్చర్యపడి ఎవరు వ్రాసినారని పద్మావతిని అడిగెనట. ఆమె "స్వామీ! మీరే కదా మరల వచ్చి వ్రాసి పోయితిరి. నూనె బొట్లు కూడా ఆ ప్రతిమీద నున్నవే" అని చెప్పగా సాక్షాత్తూ శ్రీ కృష్ణ పరమాత్మయే వచ్చినాడని తెలుసుకొని, పద్మావతి పుణ్యమును వేనోళ్ళ కొనియాడుచూ శ్రీ కృష్ణుడు తన భార్య పద్మావతికి దర్శనమిచ్చినందున ఆ అష్టపదికి "దర్శనాష్టపది" అని నామకరణం చేసెను. ఈ అష్టపది యొక్క ఎనిమిదవ చరణమున.

**"జయతు పద్మావతీ రమణ జయదేవకవి**
**భారతీ ఫణీత మితిగీతం"**

అని తనపేరుకు ముందుగా ఆమె పేరు పెట్టెనట.

## సంజీవని అష్టపది

జయదేవ కవి, భార్యయగు పద్మావతితో శ్రీ లక్ష్మణ సేన మహారాజుచే గొప్పగా గౌరవింపబడు చుండెను. అది సహించలేని రాజుగారి భార్య రాణి తగిన సదవకాశమునకై వేచియుండెను.

ఒకనాడు రాజు పరివారముతో కూడి జయదేవకవితో కలిసి వేటకై వెళ్ళినాడట. రాణిగారు పద్మావతికి జయదేవ కవికి వైపరీత్యము జరిగినట్లు అబద్ధపు సమాచారమును తెల్పెనట. అంత పద్మావతి దుఃఖ సముద్రమున మునిగి అసువులు బాసెనట. ఇటువంటి విషాద సంఘటన జరుగునని రాణి ఈషణ్మాత్రమైనా యోచించలేదు. రాణి భయముచే ఒణికి పోసాగెను. కొంత సమయము తరువాత రాజు, జయదేవుడు వేట నుండి తిరిగి వచ్చి, జరిగిన సంఘటన చూచి, ఏమిచేయవలెనో తెలియక దిగులుపడిరి. అపుడు జయదేవుడు "తన మరణవార్త విన్నందువల్ల చనిపోయినది కాని ఇప్పుడు తాను బ్రతికే ఉన్నాను కదా" అని చెప్పి 19 వ అష్టపది అయిన "పదసీయతి" పాడి ముఖముపై నీళ్లు చల్లగా, ఆమె నిద్ర నుండి మేల్కొనినట్లు లేచి కూర్చుండినదట. ఈ అష్టపదిలో శ్రీకృష్ణ పరమాత్ముడు తన స్వహస్తములతో వ్రాసిన పంక్తులు ఉన్నాయి. కనుక ఆమె మరల పునరుజ్జీవము పొందినది. అందువల్ల ఈ అష్టపదికి "సంజీవని అష్టపది" అని పేరు కలిగినది.

జయదేవుడు స్వయముగా దేవాలయములలో అష్టపదులను పాడుతున్నప్పుడు పద్మావతి వాటికి నాట్యము చేసేదట. 21 వ అష్టపదిలో పద్మావతితో నున్నట్లు వ్రాయబడింది. ఉదా:

**విహిత పద్మావతి సుఖసమాజే**
**భణతి జయదేవకవి రాజరాజే**

మొదటి శ్లోకములోనే "పద్మావతీ చరణ చారణ చక్రవర్తి" అని జయదేవ కవి వ్రాసినాడు

జయదేవుడు 1153, డిసెంబరు 28 న శ్రీముఖనామ సంవత్సర మర్గశిర బహుళ ఏకాదశి దినమున కైవల్యము పొందెను. నేటికీ జయదేవుడి జన్మస్థలమైన "బిందుబిల్వం"లో జయదేవుడి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతూ వుండగా పూరీలోని జగన్నాథస్వామీ ఆలయంలో ప్రతిరోజూ అష్టపదుల గానం సాగుతూ వుంది.

దాదాపు తొమ్మిది వందల సంవత్సరాలు దాటినా నేటికీ అష్టపదులు అలరిస్తూ వున్నాయంటే – అష్టపదుల సాహిత్య, సంగీత కీర్తి ప్రతిష్టలు ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

జయదేవుడు రచించిన గీతగోవిందం నేటికీ నిత్యనూతనమై విరాజల్లుతూ అందరినీ అలరిస్తోంది. కనుక ఈ శ్లోకంలో కులశేఖరులు శ్రీహరి నామోచ్చారణ చేయని నాలుకను మందలిస్తున్నారు. నాలుక చేసిన తప్పుకు తనకి మళ్ళీ ఇంకొక జన్మ గర్భవాస నరక ప్రాప్తి దుఃఖం తప్పవని వేదన చెందుతున్నారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. దయచేసి ఈ క్రింది మాటలకు అర్థం తెలియజేయండి?**

**- సరిత, బిహెచ్ఈఎల్**

1.జనక రాజజా మనోహరాయ
2. భావజాత గురువరాయ
3.అండజాత వాహనాయ
4. మామకాభీష్టదాయ

**జవాబు:** 1.జనక మహారాజు కుమార్తె సీతాదేవి మనోహరుడు (శ్రీరాముడు) 2. భావజాత అంటే మనసులో జన్మించేవాడి (మన్మథుడు) తండ్రి 3. అండజాత అంటే గ్రుడ్డునుండి జన్మించే అనగా పక్షి అయిన గరుడుడు వాహనంగా కలవాడు.
4. నా మనోవాంఛలు తీర్చువాడు.

**2. పరమ భక్తాగ్రేసరులైన పన్నిద్దరాళ్వారులలో మొదటివారైన పొయిగై ఆళ్వారుల గురించి తక్కువగా సమాచారం ఉంది. దయచేసి వారి విషయాలు తెలియచేయండి?**

**– కృష్ణకుమార్, పరాంకుశులు, ఖమ్మం.**

జవాబు – పొయిగై ఆళ్వార్లను కాసారయోగి, సరోముని అని కూడా అంటారు. వీరు కాంచీపురంలోని సేతు పుష్కరిణి అనే ఒక తామర కొలనులోని కలువపూవులో అవతరించారు. వీరు అయోనిజులు. గొప్ప భక్తులు. వీరు వ్రాసిన గొప్ప గ్రంథం "మొదల్ తిరువందాది". ఇందులో 100 పద్యాలున్నాయి. మొదటి పద్యం చివరి పదం దాని తరువాతి పద్యం మొదటి పదంగా ఉంటుంది. అందుకే అందాది (అనగా ముక్తపద గ్రస్తము) అని వీరి రచనను పిలుస్తారు. వీరి రచనలో భక్తి, తాత్వికతలు పెనవేసుకుని ఉంటాయి. సమస్త జగత్తును ప్రమిదగా, సప్త సాగరాలను నేయిగా, సూర్యమండలాన్ని జ్యోతిగా చేసి సమస్త వాతావరణాన్ని తేజోమయం చేశారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్త్వం

- రాళ్ళబండి శ్రీనివాసన్


**గత సంచిక తరువాయి**

"యత్రాద్భుతాని సర్వాణి భూమౌ వియంతి వా జలౌ" భూగగనజలాల్లోని సకల విధాలైన అద్భుతాలు నీలోనే వుండగా చూసేవి ఏముంటాయి స్వామి?

**నీలో లేని చోద్యంబులు**
**ఏ లోకములందు చెప్పరీశ్వర! నీటన్**
**నేలన్ నింగిని నున్నవే**
**నీలో చోద్యంబులెల్ల నెగడు మహాత్మా!**

ఓ స్వామీ! నీలో లేనన్ని వింతలు ఇక ఏ లోకాల్లోనూ వుండవు అన్నారు పెద్దలు. ఇకపోతే నీరు నేల నింగిలో వుంటాయా మహాత్మా చెప్పు. నీలోనే వున్నాయి చిత్రవిచిత్రాలు అన్నీ- అది అక్రూరుని సమాధానం.

బలరామకృష్ణులు మల్లయోధులైన చాణూరముష్టికులను జయించగలరా అని అక్రూరునిలో కలిగిన సందేహానికి సమాధానంగా చిన్నవాళ్లైన బలరాముడే ఆదిశేషుడని-తర్వాత నారాయణుడే కృష్ణుడని దర్శనము ఇవ్వడం జరిగింది.



సాయంకాలానికి మధురానగరం చేరినారు. ఆ మరుసటి రోజున విడిది నుంచి బలరామకృష్ణులు గోపబాలురతో వెంటరాగా పురప్రవేశం చేసారు. కోటలు బురుజులు భవనాలు చూసుకుంటూ నడుస్తున్నారు. నలుగురిని కలిసాడు కృష్ణుడు. వారిలో 1-రజకుడు-మేము రాజుగారి అల్లుళ్లం. మాకు మంచివైన వస్త్రాలు ఇవ్వాలని అడిగినాడు. ఆ చాకలివాడు కంస సేవకుడు.అహంకారి. పల్లెటూరి బైతులకు- గొల్లలకి మేలైన బట్టలను కట్టుకునే అర్హతలేదు. అయినా మా రాజు గారి వస్త్రాలను అడగడానికి ఎన్ని గుండెలు నీకు? ప్రాణాలమీద ఆశవుంటే పారిపోండి-అన్నాడు వాడు.

పూర్ణకాముడైన కృష్ణభగవానుడు కుపితుడయ్యాడు. రజకుని తల తెగిపడేటట్లు ముంజేత్తో బలంగా కొట్టాడు కృష్ణుడు. దెబ్బకి చచ్చాడు. ఆ చాకలివాని చావును చూసిన తక్కిన రజకులు తమ గుడ్డలమూటలను పడేసి-కాలికి బుద్ధి చెప్పారు.

తరువాత మంచి మంచి వస్త్రాలను బలరామకృష్ణులు గోపబాలురు కూడా కట్టుకున్నారు.ముందుకు నడిచారు.

చేనేతవాడు- బలరామకృష్ణుల అందచందాలకు ముచ్చటపడ్డాడు. తన దగ్గర వున్న చిత్రవిచిత్రమైన వర్ణాలు కల వస్త్రాలతో అలంకరించాడు వారిని.

**తస్య ప్రసన్నో భగవాన్ ప్రాదాత్ సారూప్యమాత్మనః ।**
**శ్రియం చ పరమాం లోకే బలైశ్వర్య స్మృతీంద్రియమ్ ॥**

ఆ నేతవాని సేవలకు కృష్ణపరమాత్మ ప్రసన్నుడై అతనికి ఈ లోకంలో వాని జీవితకాలం-సిరిసంపదలూ బలం ఐశ్వర్యం ఇంకా భగవద్భక్తిని జితేంద్రియత్వం ప్రసాదించాడు. అంతే కాకుండా తనదైన సారూప్యాన్ని కూడా అనుగ్రహించినాడు. మొట్టమొదట కృష్ణ భగవానునితో అనుగ్రహింపబడినవాడు అతడే.

మోక్ష విశేషాల్లో సాలోక్యం- సామీప్యం- సారూప్యం- సాయుజ్యం-ఈ నాలుగు ముఖ్యమైనవి.సారూప్యం అంటే పరమపదంలో చతుర్భుజాలతో- ఇంకా శంఖచక్రాలతో- శ్రీమన్నారాయణునితో సమానమైన రూప వైభవాన్ని కలిగి ప్రకాశించడం.

మాలాకారుడు- సుదాముడు అని అతని పేరు. పూల మాలలు కట్టే వాడు ఎక్కడ వున్నాడో వెదుకుతూ పోయాడు కృష్ణుడు. ఒక ఇరుకైన సందులో వున్న వాని ఇంటికి వెళ్లాడు. బలరామకృష్ణులను చూడగానే లేచాడు. వినయవిధేయతలతో వారికి నమస్కరించాడు. పూలమాలలతో అలంకరించాడు. చందన తాంబూలాన్ని సమర్పించాడు. అంతే కాదు వెంట వచ్చిన గోపబాలురను కూడా చక్కగా సత్కరించాడు. ఆ తరువాత ఇలా అంటున్నాడు సుదాముడు-

దేవా! మీ రాకతో సార్థకమైనది నా జన్మ. మా వంశమూ పునీతమైందని స్తుతించాడు. అయితే ఏమి కావాలో కోరుకోమన్నాడు కృష్ణుడు.

**నీ పాద కమల సేవయు**
**నీ పాదార్చకుల తోడి నెయ్యమును ।**
**నితాంతాపార భూత దయయును**
**తాపసమందారా! నాకు దయచేయగదే ॥**

సుదామునికి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ఇంకా యశస్సు తేజస్సు అనుగ్రహించాడు స్వామి.

కుబ్జ–ఆమె పేరేదో తెలియదు. గూని వుండటం వల్ల కుబ్జ(త్రివక్ర) అంటూ పిలిచేవారు. ఆమె కంసమహారాజు దాసి. కంసునికి అంగరాగాదులంటే ఎంతో ఇష్టం. ఈ కుబ్జను కూడా ఎంత గానో ఆదరిస్తాడు రాజు. దారిలో ఆమెను చూసాడు కృష్ణుడు. సుందరీ అంటూ పిలిచాడు.

నేను సుందరినా? నాతో నీవు సరసాలు ఆడకు. నన్ను చూసినావా–మూడు వంకరులు వున్నదాన్ని– అంది ఆమె. బలరామకృష్ణుల రూప సౌందర్యాలకు ఆశ్చర్యపోయింది. ఈ అంగలేపనాలు అలదుకునే అర్హత మీకు వుంటుందని– వారిద్దరికీ సమర్పించింది. అయితే కృష్ణునికి పసుపు పచ్చని అంగరాగాలు– బలరామునికి ఎర్రని అనులేపనాలు పూసింది.

ప్రతిఫలాపేక్షలేని గూనిదానికి ప్రత్యక్ష ఫలాన్ని ఇవ్వాలని కృష్ణభగవానుడు తలచాడు. ఆమె కాళ్లని తన పాదంతో తొక్కిపట్టి–ఆమె గడ్డం కింద తన రెండు చేతి వేళ్లు చేర్చి పైకెత్తినాడు. కృష్ణ భగవానుని స్పర్శతో వంకర్లు పోయాయి. ఆమె మన్మథ సమ్మోహనాస్త్రంలాగా ఒప్పింది.

కుబ్జ కృష్ణ భగవానుని తన ఇంటికి రమ్మంది. మధురలో కార్యాలు అన్నీ ముగిసిన తరువాత కృష్ణదేవుడు కుబ్జ ఇంటికి ఉద్ధవునితో వెళ్లాడు. సనకాది యోగులకు కూడా లభించని కృష్ణ భగవానుని సాన్నిధ్యంలో సకల విధ సౌఖ్యాలను పొందినా– తృప్తి తీరక పోగా ఇంకనూ కొద్ది రోజులు వుండాలని కృష్ణదేవుని కోరింది. కామం క్రోధం ఇంకా వైరం భక్తి స్నేహాదులతో భగవంతుని చేరవచ్చును కదా.

అయితే నిత్యబ్రహ్మచారియైన కృష్ణుడు కుబ్జ కోరికను తీర్చినట్లేనా? అంటే ఆ లీలామానుష రూపుడు– కొందరిని తన చూపులతో– కొందరిని తన స్పర్శతో కొందరిని ఆలింగనంతో– మరి కొందరిని మధురభాషణాలతో– తన్మయత్వాన్ని పొందినట్లు చేస్తాడని వ్యాఖ్యాతల అభిప్రాయం. ఏదిఏమైతేనేమి – కుబ్జా కృష్ణాంబరధరాయ నమః అని–కృష్ణాఅష్టోత్తర శతనామావళిలో నిలిచిందామె.

కుబ్జను సర్వాంగ సుందరిగా చేసినాక– కృష్ణుడు అన్న బలరామునితో కలిసి ముందుకు సాగుతూ ధనుస్సు ఉండే యాగశాలను చేరారు.

ఇంద్రధనుస్సులాగా మహా అద్భుతంగా వుంది ధనుస్సు. అక్కడి రక్షకభటులు వారిస్తున్నా– లెక్కచేయకుండానే–ఆ విల్లును చేత పట్టినాడు కృష్ణుడు. వింటి నారిని ఎక్కుపెట్టి–బలంగా లాగాడు. మదపుటేనుగు చెరకుగడని విరిచినట్లు– ధనుస్సును విరిచాడు. ఆ శబ్దానికి నలుదిక్కులూ అదిరిపడ్డాయి. ఇంకా ఆ ధ్వని కంసమహారాజు చెవులకు సోకింది. భయకంపితుడైనాడు.

రక్షకభటులు కృష్ణుని చంపేయాలని చుట్టుముట్టారు. విరిగిన ధనుస్సు ముక్కలను తీసుకుని బలరామకృష్ణులు వాళ్లని చావబాదారు. ఆ దృశ్యాలు చూస్తున్న వారు– బల రామకృష్ణుల బల వీర్య పరాక్రమాలను పొగిడారు.

ధనుస్సు ధ్వంసం– రక్షక యోధుల దుర్మరణం– తెలిసింది. కంసుని గుండెల్లో భయం పుట్టకుని వచ్చింది. దానికి తోడు దుశ్శకునాలు కనిపించసాగాయి.

కంసునికి రాత్రి నిద్ర పట్టలేదు. కనులు మూసినా తెరిచినా– మృత్యురూపంలో కృష్ణుడే కనపడుతున్నాడు. గాలికి ఏ శబ్దం వినపడినా– చివరికి గడ్డిపోచ కదిలినా– కృష్ణుడేమో అని– గడగడ వణికిపోతున్నాడు.

అంతలో భళ్లున తెల్లారింది. కుస్తీ పోటీకి రంగం సిద్ధం. ప్రముఖులు ఇంకా పౌరులు కూర్చుండటానికి విడి విడిగా ఏర్పాట్లు–ఎత్తైన ఒక మంచ మీద కంసుని సింహాసనం– మల్లయోధులు సిద్ధంగా వున్నారు. శంఖ భేరీ పటాక శబ్దాలు విన్నారు బలరామకృష్ణులు. బయలుదేరారు. నందాది గోపవృద్ధులు కప్పం– తదితర కానుకలతో వచ్చివున్నారు.

కువలయాపీడం సింహద్వారం దగ్గర మావాటివాని అదుపులో వుంది.ఏనుగును మావటిని చూసారు అన్నదమ్ములు.

కృష్ణ భగవానుడు తన ఉత్తరీయాన్ని నడుముకు గట్టిగా బిగించాడు. జుట్టును సరిచేసుకున్నాడు. ఒరెయ్ మావటీ! మాకు దారి ఇస్తావా సరేసరి లేదంటావా నిన్ను నీ ఏనుగును చంపేస్తాను చూడు– అన్నాడు కృష్ణుడు. వాడు ఆమాటలు ఖాతరు చేయలేదు. పైగా ఏనుగును ఉసికొల్పినాడు.

కువలయాపీడం అపుడు తన తొండంతో కృష్ణుని చుట్టేసింది. చాకచక్యంతో అందులో నుంచి జారాడు. పిడికిలితో బలంగా పొడిచి– దాని కాళ్లసందులో దూరాడు. కృష్ణుడు కనపడలేదని –తిరుగుతూ తొండంతో వాసనపట్టి– చూసి–పట్టుకుంది. మరలా యుక్తితో తప్పించుకున్నాడు. ఇక దాని తోకను బలంగా పట్టి– గిరగిరా తిప్పి– విసిరాడు. అది ఇరవై ఐదు గజాల దూరంలో పడి–లేచి– వచ్చింది.చెలరేగింది. ఈ సారి ఆ కువలయాపీడానికి ఏవిధంగా దొరక్కుండా తిరుగుతూ తిరుగుతూనే దానిని ముప్పుతిప్పలు పెట్టాడు కృష్ణుడు. కోపంతో తన దంతాలతో నేలకేసి కొట్టి కుమ్మింది.

**(ఇంకా ఉంది)**

**ధారావాహికం**



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మాండ పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

ఆదిశేషుని శిరోభాగం దక్షిణకైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్రమై విరాజిల్లుతూ ఉన్నది. అక్కడ పరమశివుడు నెలకొని ఉన్నాడు. ఆయన మంగళ కారకుడు. ఆ క్షేత్రం పరమ పవిత్రమైనది. ఈ వేంకటాచలానికి ఉత్తరభాగంలో ఆదిశేషుని తోకభాగం ఉన్నది. అదే శ్రీశైలమనే దివ్యక్షేత్రంగా ప్రసిద్ధిచెందింది.

## వ్యాఘ్రపాదుని వృత్తాంతము

ఆ శ్రీశైలంలో శుభప్రదమైన నీలకంఠాశ్రమం ఉన్నది. ఆ ఆశ్రమంలో వ్యాఘ్రపాదుడనే ఒక తపస్వి జితేంద్రియుడై ఉమాపతియైన శివుని గురించి చాలా కాలం తపస్సు చేశాడు. అనేక నియమాలతో గొప్ప తపస్సుచేసి ఆ తపోనిధి పరమేశ్వరుని సంతోషపరచాడు. అలా ఆతని తపస్సుతో సంతుష్టుడైన, మహాతేజశ్శాలియైన నీలకంఠుడు ఆతనికి అభీష్ట వరాలను ప్రసాదించుటకై ఉమాసహితుడై వెండికొండవలె ఉండి ఆకాశంలో సంచరించే వృషభాన్నధిరోహించి సాక్షాత్కరించాడు.

పార్వతీదేవి పరమ శివుని ఎడమవైపున ఆయనను ఆలింగనం చేసుకొని ఉంది. ప్రమథగణాలు సంతోషంతో ఆయన్ను పరివేష్టించి ఉన్నాయి. ఆయన జటాజూటంలో ఆకాశగంగ ప్రకాశిస్తున్నది. ఆ గంగా తరంగములతో ఆయనను పరివేష్టించియున్న సిద్ధులు, గంధర్వులు,యకక్షులు, నాగులు మొదలగువారు కలత చెందుతున్నారు. తన భక్తుల యందు తనకు గల అపారమైన దయను, కరుణను తెలియజేయుచు ఆ పరమ శివుడు వ్యాఘ్రపాదునికి ప్రత్యక్షమయ్యాడు.

అంతట వ్యాఘ్రపాదుడు పరమ భక్తి సమన్వితుడై పరమేశ్వరునికి నమస్కరించి అనేక స్తోత్రములతో మరల మరల పరిపూర్ణంగా, ఈవిధంగా స్తుతించాడు.

**భగవన్కరుణాసార! సర్వలోకైకకారణ ।**
**ప్రసీద త్వం ప్రసన్నాక్ష విశ్వాకార వృషధ్వజ! ॥**
**రథ్యా వేదాస్త్రిపురదహనే వేదవక్తా చ వేదాః ।**
**సూతో యస్య స్వయముపగతౌ పుష్పవన్తౌ రథాంగే! ॥**
**చాపో యేరు స్త్రిభవసతి ర్వాసుకిశ్చాపమౌర్వీ ।**
**బాణో విష్ణుస్త్రిభవపుపుషే కుర్మహే తే నమస్యామ్ ॥**

**-బ్రహ్మాండపురాణం.అ.2.శ్లో26,27.**

ప్రభో! దయానిధీ! సర్వలోకైకకారణ! ప్రసన్నమైన నేత్రములు కలవాడా! విశ్వరూపా! వృషభధ్వజ! నీవు నాయందు ప్రసన్నుడవు కమ్ము! నీవు త్రిపురాసుర సంహారము చేసిన సమయంలో నీ రథానికి నాలుగు వేదాలు నాలుగు గుర్రాలుగా రూపొందినాయి. వేదాలను పఠించే బ్రహ్మ నీకు సారథయ్యాడు. సూర్యచంద్రులే రథచక్రాలుగా మారారు. మేరు పర్వతం ధనుస్సు అయింది. వాసుకి అల్లెత్రాడుగను, విష్ణువు బాణంగను అమరారు.

అటువంటి మహాపరాక్రమశాలియైన మహాదేవుడైన నీకు నమస్కరిస్తున్నాను అని ఈ విధంగా తపోనిధియైన వ్యాఘ్రపాదుడు మిక్కిలి భక్తితో శిరస్సున అంజలి ఘటించి పరమేశ్వరుని ముందర వినమ్రుడై మౌనంగా నిలబడ్డాడు. తపోనిష్ఠుడు, శాంతమూర్తి, ధర్మపరాయణుడు అయిన వ్యాఘ్రపాదుని పిలిచి పరమ శివుడు చిరునవ్వుతో యిలా అన్నాడు.

'ఓ సువ్రతా! నీవు చేసిన తపస్సుతో సంతుష్టి చెందాను. నీకు శుభమగు గాక! నీకు వరమిచ్చుటకై యిక్కడికి వచ్చాను. నీకిష్టమైన వరం కోరుకో! అనగా వ్యాఘ్రపాదుడు మహాదేవా! మీరు ఈ ఆశ్రమంలో సదా నివసించాలి. ఈ సరస్సు మీ పేరుతో ప్రసిద్ధమగుగాక! ఈ పుష్కరిణిలో ఒక్కసారైనా పురుషార్థమును కోరి స్నానం చేసే మానవుడు విశుద్ధుడై సిద్ధిని పొందుగాక! అని వ్యాఘ్రపాదుడు వరం కోరగా పరమశివుడు 'అట్లే అగుగాక! అని చెప్పి పార్వతీదేవితోపాటు అక్కడే నివసిస్తూ సకల ప్రాణులకు వరములనను గ్రహిస్తున్నాడు.

ఈ పర్వతానికి పక్షప్రదేశంలో ఆహోబిలక్షేత్రమున్నది. సర్వసిద్ధిప్రదుడైన నరసింహస్వామి నెలకొన్న దివ్యక్షేత్రమది. హిరణ్య కశిపుని సంహరించి, ప్రహ్లాదుని అనుగ్రహించుటకు ఆయన బ్రహ్మరుద్రాదులతోపాటు అవత రించి ఇక్కడ వేంచేసి ఉన్నాడు. ముల్లోకాలలోను దానితో సమాన మైన స్థానం మరొకటి లేదు. ఆ క్షేత్రాన్ని దర్శించినంత మాత్రముననే మానవుడు అమృతత్వాన్ని పొందుతాడు. ఈ క్షేత్రాన్ని ఒక్కసారి దర్శించినా జీవుడు సర్వ పాపముల నుండి విముక్తుడై విష్ణులోకాన్ని పొందుతాడు.

**ఫణామణి ప్రదేశో యం"వేంకటాద్రి" రితి స్మృతః।**
**"శేషాద్రిఃవృషభాద్రిశ్చ, నారాయణగిరి" స్తథా ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాం2.శ్లో.38.**

ఆదిశేషుని పడగ భాగమే వేంకటాద్రిగా పిలువబడుతున్నది. దానినే శేషాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి అంటారు. ఈ పర్వత మహిమ చాల గొప్పది. బ్రహ్మ, రుద్రాది దేవతలుగాని, సనకసనందాది యోగులు కాని వందల సంవత్సరాలైనా దాని మహిమని వర్ణించలేరు. అగస్త్యాది మహర్షులు తపస్సిద్ధికై ఇక్కడ నివసిస్తూ ఇక్కడి సెలయేళ్ళలో, తీర్థాలలో స్నానమాచరించి వేలకొలది సంవత్సరాలు తపస్సు చేశారు.

ఈ పర్వతము విష్ణువుయొక్క మరొక దేహమగుట వలన దీనిని పాద ములతో త్రొక్కరాదు. నారాయణాంశ సంభూతుడైన ఆదిశేషుడే పర్వతరూపం ధరించాడు. దానిపై మొలచిన గడ్డి, పొదలు, పూతీగెలు మొదలగునవి స్థావర రూపంలో (కదలకుండా ఉండే) యోగిపుంగవులే కాని వేరుకాదు.

**విష్ణోపరదేహత్వాత్ ఆక్రామన్ న పద్భిర్గిరిమ్।**
**నారాయణాంశసంభూతః శేషో హిః గిరిరూపధృక్ ॥**

**తస్యోపరి ప్రభూతా యే తృణగుల్మలతాదయః।**
**తే హి స్థావరరూపేణ వసన్తో యోగి పూరుషాః ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం2శ్లో41,42.**

వారు బ్రహ్మరుద్రాది దేవతల కంటే మిక్కిలి తేజశ్శాలురు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, చారణులు విద్యాధరులు, మహానాగులు, సమూహములు ఈ పర్వతమును, ఇక్కడ నెలకొన్న పరదేవతా దైవాన్ని సేవించాలనే కుతూహలంతో సదా ఇక్కడ నివసిస్తూ రాత్రింబవళ్ళు ఈ పర్వతాన్నిసేవిస్తున్నారు. అంతటి మహత్తరమైనదీ వేంకటాచలము అని నారద మహర్షి భృగు మహర్షికి వేంకటాద్రి వైభవాన్ని వివరించాడు.

**బ్రహ్మరుద్రాది దేవేభ్యో యోగినో-మిత తేజసః।**
**ఋషిభిర్దేవ బృందైశ్చ సేవావసర కాంక్షిభిః।**
**సేవ్యతే-హర్నిశం ప్రీత్యా మహాగిరివరోహ్యయమ్ ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం,2:శ్లో.43, 45.**

**భగవంతుని క్రీడాచల వర్ణన :**

భృగుమహర్షి నారద మునీంద్రుని మరల ఇలా ప్రశ్నించాడు– 'ఓ దేవర్షీ! భగవానుడు వేంకటాద్రికి వేంచేసిన తరువాత ఏమి చేశాడు? ఆ విషయాన్ని వివరంగా నాకు తెలియజేయండి నిగూఢమైన విషయాలను తెలియజేసే వారు మీ కంటె వేరెవ్వరు లేరు అని అడుగగా నారదమహర్షి ఇలా చెప్ప నారంభించాడు.

ఓ భృగుమహర్షీ! రహస్యమైన ఈ విషయాన్ని నీకు విస్తరంగా చెబుతాను. ఈభగవత్కథను వినుటకు నీకంటెఆసక్తి కలవారెవరు లేరు. సనాతనుడు, పురుషోత్తముడు అయిన శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవితో పాటు ఈ వేంకటాచలంపై అవతరించాడు. ఈ పర్వతం అనేక గైరికాది ధాతువులతో అలంకరింపబడింది. దీనిపై అనేక సెలయేళ్ళు, జలధారలు, జలపాతాలు, సరస్సులు ఉన్నాయి. పుష్పించిన వృక్షసమూహములనేకం ఉన్నాయి.

మాలతి, మల్లె, కొండమల్లె, వావిలి, పచ్చపూవులగోరింట, కదంబం, మద్ది వెదురు, చందనం, పనస, అశోక, పొగడ, చేమంతి, తమాల వృక్షాలతో అలంకరింపబడిందా పర్వతం. అనేక, విధములైన పక్షుల కూజితాలతో ప్రతిధ్వనిస్తున్నది. మయూరములు కూస్తూ నాట్యం చేస్తున్నాయి. మిక్కిలి బలిష్టమైన మృగములు, సింహాలు, శార్దూలాలు(పెద్దపులులు), మద ధారలు స్రవించుచున్న గజ సమూహములతో ఆ వేంకటాద్రి శోభాయమానంగా ఉన్నది.

ఇంకను మదంతో గర్జిస్తున్న కోతులు, కొండముచ్చులు, అనేక మృగాలు, పక్షులు ఆ కొండపై ఆనందగా ఆటలాడుతున్నాయి. ఆ పర్వతం అనేక రత్నమయమై, చరియలతో అలంకరింపబడింది. ఆ దివ్య పర్వతంపై భగవానుడు లక్ష్మీ దేవితో విహరిస్తున్నాడు.

**నారాయణుడనే విప్రుని వృత్తాంతం :**

ఇలా ఉండగా ఒకానొకప్పుడు నారాయణుడనే

బ్రాహ్మణోత్తముడు బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు ఈ పర్వతం ఉత్తర భాగంలో స్వామి పుష్కరిణీ తీరంలో తపస్సు చేశాడు. ఆ పుష్కరిణిని దేవతలు, సిద్ధులు సేవిస్తున్నారు ఆయన జితేంద్రియుడై, నిశ్చలచిత్తంతో, త్రిలోకనాథుడు, భక్తవత్సలుడు, దివ్య మంగళ స్వరూపుడు, శ్రీదేవి, భూదేవి, నీలాదేవితో కూడిన నారాయణుని హృదయంలో ధ్యానిస్తూ, నాసాగ్రమున దృష్టిని నిలిపి, నిర్మల చిత్తుడై ఆ ధర్మాత్ముడు చాలాకాలం ఘోరమైన తపస్సు చేశాడు, దుష్ట బుద్ధి కలవారికి ఆ విధమైన తపస్సు సాధ్యం కాదు. పవిత్రమైన హృదయంతో నారాయణుడనే విప్రుడు ఆ విధంగా తపస్సు చేస్తూండగా అక్కడి వృక్షాలన్నీ కాలనియమం లేకుండానే అన్ని ఋతువుల్లోను ఫలాలనిస్తున్నాయి. బలంగల ప్రాణులు బలంలేని అల్ప ప్రాణులను బాధించలేదు. ఆ బ్రాహ్మణుడా విధంగా శాంతమూర్తియై తపస్సు నాచరిస్తూండగా ఆ వనమంతా పరమ ప్రశాంతంగా మారిపోయింది.

**భగవంతుని సాక్షాత్కారం :**

నారాయణ ఋషి ఈ విధంగా తపస్సు చేయగా ఆయన తపస్సుకు మెచ్చి సకలజీవులకు వరప్రదాతయైన వాసుదేవుడు గరుడారూఢుడై సాక్షాత్కరించాడు. ఆ గరుత్మంతుడు మేరుపర్వతం వలె ఉన్నాడు. శ్రీమహా విష్ణువు లక్ష్మీదేవిని తన తొడపై కూర్చుండబెట్టుకొన్నాడు. ఆమె దేదీప్య మానమైన బంగారు మాలలు ధరించింది. అవి కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లు మెరుపుల వలె ధగద్ధగాయమానంగా ఉన్నాయి. ఆమె విష్ణువుకు సహధర్మ చారిణి. ఆమె ప్రతి అవతారంలోను ఆయననను సరిస్తుంది. ఆ చల్లనితల్లి భక్తుల యందలి అపార కరుణతో నిండిన చల్లని కటాక్షవీక్షణాలతో ఈ చరాచర జగత్తును ఎల్లప్పుడు మరలమరల ఆనందపరుస్తూ ఉంటుంది. ఆమె పద్మప్రియ. పద్మమును చేతిలో ధరించింది. పద్మంలోనే నివసిస్తుంది. వికసించిన పద్మములవాంటి నేత్రములు కలది. పద్మనాభుని మనస్సుకు ప్రియం కలిగిస్తుంది.

ఆ పరాత్పరుడు నీలమేఘశ్యాముడు. మెరుస్తున్న పీతాంబరాన్ని ధరించాడు. మెడలో తులసిమాలను ధరించాడు. వక్షస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చ మనోహరంగా ప్రకాశిస్తున్నది. ఆయన ధరించిన కౌస్తుభమణితో ఆయన దివ్యమంగళ విగ్రహం శోభాయమానంగా ఉంది. పట్టుబట్ట బిగించిన ఆయన నడుము సన్నగా, అందంగా ఉన్నది. ఆయన నాభి బ్రహ్మ దేవునికి నివాసమైన తామర మొగ్గ మొలచుటచే మిక్కిలి లోతైనదై, గంభీరమైన సుడిచే శోభిస్తున్నది. ఆయన ఊరువులు అరటి స్తంభాలవలె, ఏనుగుతొండాలవలె ప్రకాశిస్తున్నాయి. సుందరములైన ఆయన పిక్కలు అమ్ముల పొదులవలె విరాజిల్లుతున్నాయి. ఆయన ముఖకమలం ప్రసన్నంగా ఉంది. ఆయన నేత్రములు తామర రేకులవలె ఉన్నాయి. ఆయన దివ్య దేహం దివ్యతేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. ఈ విధంగా భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు.

అంతట ఆ విప్రుడు సంతోషంతో విప్పారిన కనులతో, భగవంతుని దర్శించాడు. ఆయన కళ్ళు ఆనంద బాష్పాలతో నిండిపోయినై అతడానందాతిరేకంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆనందమనే అమృత సాగరంలో మునిగిపోయాడు. అతనికేమీ తోచలేదు. దయానిధియైన భగవంతునికి భక్తితో ప్రదక్షిణమాచరించాడు. పరమభక్తితో తన్మయుడై కొంతసేవు అలాగే నిలబడిపోయి ఆ తరువాత శ్రేష్ఠమైన వాక్కులతో, ఆర్తితో భగవానునిలా స్తుతించాడు.

**భగవంతుని స్తుతి :**

**దేవదేవ జగన్నాథ! ప్రసీద పురుషోత్తమ! ।**
**పరిపాలయ మాం భక్తం శరణాగతవత్సల! ॥**
**కాలాభ! కరుణాసార! కరీన్ద్ర వరద! ప్రభోః ! ।**
**అవలోకయమాం నాథ! శీతలైర్నయనాంచలైః ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం 3. శ్లో.30,31.**

"ఓ దేవదేవా! జగత్ప్రభూ! పురుషోత్తమా! శరణాగతవత్సలా! నా యందు ప్రసన్నుడవు కమ్ము. నీ భక్తుడనైన నన్ను కాపాడు ఓ కరుణామూర్తీ! నీలమేఘశ్యామా! కరిరాజవరదా! ప్రభూ! నీవు చల్లని క్రీగంటి చూపులతో నన్ను వీక్షించు, ఈ సర్వ జగత్తును ధరించేవాడవు నీవే. నీవు జగన్మయుడవు. ఓదేవదేవా! నీవే ఈ ప్రపంచానికి సంరక్షకుడవు, సంహారకుడవు కూడ.

జగత్తు సృష్టి కాలంలో నీ కటాక్ష వీక్షణం వలన ప్రకృతి పురుషులు కలిపి అనంతమైన ఈ జగత్తును సృష్టించారు. స్వామీ! ఈ లోకంలో కాదు, ముల్లోకాలలో కూడ నీతో సమానుడుకాని, నీకంటె అధికుడుగాని, మరెవ్వరు లేరు. తెలునుకొనువాడు, తెలియదగినవాడు, తెలిసికొనే ఉపాయం కూడ నీవే. జ్ఞానం, దానిఫలం కూడనీవే. నీకంటె భిన్నమైనది జగత్తులో మరొకటిలేదు.

ఈ సర్వ జగత్తుకు నీవే తండ్రివి సదా నిన్ను విడువకుండా ఉండే విశాల నేత్రములుగల లక్ష్మీదేవి లోకముల తల్లి, బ్రహ్మాది దేవతలు, సనకాది యోగులు, గొప్ప తపస్సుచేసి కూడ నిన్ను యథార్థంగా తెలునుకోలేరు. నీవు వేదాధ్యయనం వల్లగాని, యాగాదుల వలన గాని, వ్రతనియమాల వలన గాని, దానాలు, తపోయోగాల వలనగాని దర్శన మివ్వవు. భక్తులు, నిన్ను సులభంగా దర్శిస్తారు. నా భాగ్య విశేషం వలన నీవు నాకు దర్శన మిచ్చావు. నాకు నీ రూపాన్ని దర్శింపజేయి.

ఓ దయానిధీ! నేను ధన్యుడనయ్యాను. ప్రభు నీ దివ్యానుగ్రహానికి పాత్రుడనయ్యాను. నీ దర్శనంతో నా నేత్రాలు సఫలమయ్యాయి. నేడు నా జన్మ సార్థకమైంది. ఓ దేవదేవా! నిన్ను దర్శించని వారి జన్మ వ్యర్థమని నా అభిప్రాయం నీ దివ్యదర్శన

భాగ్యం వలన చిత్తం మత్తెక్కినట్లైనది"

నారాయణఋషి ఈ విధంగా స్తుతించగా భగవానుడు సంతుష్టుడై, ప్రసన్నమైన నేత్రములు గలవాడై, మేఘగంభీరమైన వాక్కులతో అతనితో "ఓ బ్రాహ్మణోత్తమా! నీవు జితేంద్రియుడవై ఇక్కడ ఎందుకు తపస్సు చేస్తున్నావు? నీ కేమి వరం కావాలో కోరుకో ప్రసాదిస్తాను" అన్నాడు.

**నారాయణ మహర్షి ప్రార్థన :**

ఆ విప్రుడు ఓ దేవదేవా! కరుణానిధీ! శ్రీనిధీ! నీవు నాకు వరమివ్వ దలచినచో నేను నా కిష్ట మైన వరాన్ని కోరుకుంటాను. ప్రీతి మనస్కుడవై వినుస్వామీ! నేను నారాయణుడనే విప్రుడను. ప్రభూ! నేను నిన్ను దర్శించాలనే కోరికతో ఈ భూలోకమంతా చుట్టి వచ్చాను. కానీ నీ దర్శనం కాలేదు. ఆ తరువాత బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసి ఆయనను మెప్పించాను.

ఆయన ఆజ్ఞ మేరకు ఇక్కడ వచ్చి ఈ స్వామి పుష్కరిణీ తీరంలో మీ గురించి తపస్సు చేశాను. నేను జితేంద్రియుడనై చాల కాలంగా తపస్సు చేస్తున్నాను. ఈవిధంగా తపస్సు చేయడానికి భూలోకంలోని మానవులకు సాధ్యం కాదు. కావున నీవు వారిననుగ్రహించుటకై అందరికీ దర్శనమిస్తూ, నిత్యము అందరికీ అభీష్టాలను ప్రసాదిస్తూ, ఈ స్వామి పుష్కరిణీ తీరంలో అనంతుడు, లక్ష్మీదేవితో కూడ విహరిస్తూ ఇక్కడే నివాస ముండుము స్వామీ! మాధవా! ఈపర్వతం నా పేరుతో ప్రసిద్ధి చెందునట్లనుగ్రహించుము.

**తేషామనుగ్రహార్థాయ సర్వప్రత్యక్షగోచరః ।**
**సర్వాభీష్టం దదన్నిత్యం స్వామిపుష్కరిణీతటే ॥**
**అనన్త విహగేశాన సేనాపతి ముఖైస్సదా ।**
**సేవ్యమాన శ్శ్రియాసార్థం విహరన్ వస మాధవ ॥**
**గిరిశ్చాయం హి మన్నామ్నా ప్రసిద్ధి మధిగచ్ఛతు ॥**

**-బ్రహ్మాండపురాణం అధ్యాయం3.శ్లో.48, 49,50.**

**భగవంతుని వరప్రదానం :**

అప్పుడు భగవానుడు నారాయణ ఋషికి ఈ విధంగా వరములను గ్రహించాడు. "ఓ విప్రవర్యా! నీవు కోరినట్లే అగుగాక! తథాస్తు. ఓ సువ్రతా! బ్రాహ్మణుడు కాని, క్షత్రియుడు కాని, వైశ్యుడుకాని, శూద్రుడు కాని ఎవరైనా పాపాత్ముడైనా, పుణ్యాత్ముడైనా దర్శించి, నాకు నమస్కరించే మానవులకు కల్పాంతం వరకు స్వర్గలోకవాసాన్ని ప్రసాదిస్తాను.

స్వామి పుష్కరిణీ జలంలో స్నానం చేసినవాడు నరకలోకాన్ని దాటి మోక్షాన్ని పొందుతాడు. ఈ క్షేత్రము, ఈ పర్వతము, ఈ సరస్సు మానవులకు భుక్తిని, సర్వసిద్ధులను కలిగిస్తాయి. ఇందుకు సందేహం. నేటి నుండి ఈ పర్వతం నీ పేరుతో నారాయణాద్రి' అని ప్రసిద్ధి చెందుతుంది."

**"అద్యప్రభృతి చైవాయం గిరిస్త్వన్నామతః సదా।**
**'నారాయణాచల" ఇతి ప్రసిద్ధో భవతు ద్విజ!" ॥**
**ఇతి తస్మై వరం దత్వా స్వ సాయుజ్యం దదౌ హరిః॥**

**-అధ్యాయం3.శ్లో.55,56.**

అని ఈ విధంగా ఆ విప్రునికి వరమునిచ్చి శ్రీహరి తన సాయుజ్యాన్ని (ముక్తిని) కూడా ప్రసాదించాడు. ఆ తరువాత స్వామి పుష్కరిణీ తీరంలో తన సంకల్పానుసారం వచ్చిన దివ్య విమానంలో శ్రీదేవి, భూదేవి, నీలాదేవీ సహితుడై, శంఖచక్ర గదాధారియై, నీల మేఘశ్యాముడై, కోటి మన్మథుల సౌందర్యంతో సర్వజనులకు దర్శన మిస్తూ, దయాపరవశుడై, పరమానంద స్వరూపుడై ఆ వేంకటాచలంపై నిత్య నివాసం చేస్తున్నాడు–" అని నారద మహర్షి భృగుమహర్షికి నారాయణుడనే విప్రుని వృత్తాంతాన్ని, నారాయణాద్రి నామౌచిత్యాన్ని తెలియజేశాడు.

**స్వామి పుష్కరిణీతీరే స్వసంకల్పాగతే తతః ।**
**దివ్యే విమానే సర్వేషాం విలోచనపథం గతః ॥**
**శ్రీభూమి నీళా సహితః శంఖచక్రగదా ధరః ।**
**కోటి కందర్ప లావణ్యో నీల జీమూత సన్నిభః ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం3 శ్లోకలు:56,57,58.**

**క్రీడాద్రిలో భగవంతుని విలాస వేట :**


భృగుమహర్షి మరల నారద మహర్షిని "నారద మునీంద్రా! భగవంతుడు వేంకటాచలంలో నిత్యనివాస మేర్పరచుకొన్న తరువాత ఏమి చేశాడు? ఆ చరిత్రను వినాలనే కోరికతో అడుగుతున్న నాకు దానినంతా సవిస్తరంగా చెప్పండి" అని అడిగాడు. అంతట నారద మహర్షి భృగుమహర్షికి ఇలా చెప్పనారంభించాడు–

ఓ భృగుమహర్షీ! అంతట ఒకానొకప్పుడు మాధవుడు వేటయందాసక్తి కలవాడై సేనాపతిని పిలిచి చిరునవ్వుతో 'ఓ సేనానాయకా! సింహాలు పెద్దపులులు, మదించిన ఏనుగులు సంచరించే ఈ అటవీ ప్రాంతంలో నేను విహరించదలచాను. యుద్ధంలో శత్రు దుర్జేయములైన చతురంగ బలాలను సిద్ధం చేయించు' అని ఆజ్ఞాపించి భగవానుడు వెంటనే వేటకు బయలుదేరాడు. సేనాపతి ప్రముఖులంతా ఆయనననుసరించి వెళ్ళారు.

రాక్షసాంతకుడైన శ్రీహరి పర్వతం ఉత్తర దిక్కున సింహాలను, వ్యాఘ్రాలను, మహాసర్పాలను, క్రూరమృగాలను విషసర్పాలవంటి బాణాలతో వేటాడుతూ సంచరిస్తున్నాడు. ఆ అడవిలో ఉండే శబర నాయకులు స్వామి రాకను తెలుసుకొని, కానుకలు తీసుకొని వచ్చి, స్వామికి సమర్పించి, ఆయనకు నమస్కరించి, ఆ దేవదేవుని ఎదుట శిరస్సులు వంచి నిలబడ్డారు. ఆ తరువాత వారు మార్గం చూపుతుండగా భగవానుడు యందాసక్తితో ఆ అడవిలోని చాల ప్రదేశాలలో సంచరిస్తూ వేటాడాడు. **(సశేషం)**

# గోదాం వందే శ్రీరంగనాయకిమ్

– డా|| కూర్మాచలం శంకరస్వామి



"కర్కటే పూర్వ ఫల్గుణ్యాం! తులసీ కాననోద్భవామ్
పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్
నీళాతుంగస్తన గిరితటి సుప్తముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతి శతశిరస్సిద్ధ మధ్యాపయన్తీ
స్వోచ్ఛిష్టాయాం స్రజినిగళితం యాబలాత్కృత్యభుంక్తే
గోదా తస్మై నమయిద మిదంభూయ ఏవాస్తుభూయః"

గోదాదేవి అనగానే మనకు గుర్తుకు వచ్చేది ధనుర్మాసం. ఈ మాసం మన పంచాంగాలు పేర్కొన్న పన్నెండు మాసాలలో ఎక్కడా లేకపోయినా మార్గశిర–పుష్యమాసాల నడిమి కాలాన్ని ధనుర్మాసంగా ప్రకటించారు మన పూర్వీకులు. ఎందుకనగా సూరీడు ధనువులోకి ప్రవేశించే కాలం భోగిపండుగ. ఇదేరోజు గోదాదేవి కళ్యాణం కూడా జరుపుకుంటారు. అంతకు ముందు 29 రోజులు గోదాదేవి రచించిన "తిరుప్పావై" అనగా ముప్పయి పాశురములు రోజుకు ఒకటి చొప్పున పారాయణం చేసి ముప్పయవ రోజునాడు గోదా కళ్యాణం జరిపించినచో కన్యలకు వివాహం జరుగుతుందని హిందువుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఉత్సవాలు ముఖ్యంగా మన భారతదేశంలో దక్షిణ భాగాన ముఖ్యంగా తెలుగు, తమిళ, కన్నడ, కేరళ రాష్ట్రాలలో అధికంగా జరుగుతాయి. ఈ మార్గళి వేళలో మహిళలు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి స్నానమాచరించి అత్యంత భక్తి శ్రద్ధలతో తిరుప్పావై పాశురాలను పఠించి ఆధ్యాత్మిక భక్తి భావనలో తమ జన్మలకు సార్ధక్యం చేకూర్చుకుంటారు. గోదాదేవి అన్నా, ఆండాళ్ అన్నా ఒక్కటే. ఈమెకు మంచి కొప్పు కలిగి యుండడంచే గోదాదేవి అనియు, ఆత్మకు దాస్యమే సహజమని తెల్పుటచే ఆండాళ్ అనియు, తాను ధరించిన మాలను స్వామికి సమర్పించుటచే శూడిక్కోడుత్త నాచ్చియార్ అనియు, ప్రసిద్ధి నామములు కలుగుటచే ఈమెను ఆళ్వార్ల సరసన చేర్చి భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఒక మానవ కాంత సశరీరంగా భగవంతుణ్ణి ఎలా వివాహమాడిందో, శ్రీవ్రతము యొక్క విశిష్టతలేమిటో ఈ వృత్తాంతం ద్వారా తెలుస్తుంది.

భూమండలం మీద ఉన్న అన్ని ప్రాంతాలకు మణిపూస వంటిది శ్రీవిల్లిపుత్తూరు అని పండితులు పేర్కొన్నారు. శ్రీవరాహస్వామి – భూదేవి నడయాడిన ప్రాంతం శ్రీవిల్లిపుత్తూరు. పుత్తూరు అనగా కుగ్రామము. విల్లి అనే

అటవికుడు ఇచ్చట ఆలయాన్ని నిర్మించాడు కాబట్టి ఈ ప్రాంతానికి శ్రీవిల్లిపుత్తూరుగా ప్రసిద్ధి పొందింది. అంతేకాదు ఈ ప్రాంతంలో శ్రీమహావిష్ణువు వటపత్రశాయిగా అవతరించిన నేల. భూదేవి అయోనిజగా జన్మించి, గోదాదేవియై సశరీరంగా శ్రీరంగనాథుణ్ణి వివాహమాడిన ప్రాంతం. శ్రీమన్నారాయణుని వాహనమైన గరుత్మంతుని అంశతో జన్మించిన విష్ణుచిత్తుడు నడయాడిన ప్రాంతం కాబట్టే శ్రీవిల్లిపుత్తూరుకు ఇంతటి వైభవం దక్కింది.

పాండ్యదేశపు భూమియనే నాతికి పాపటి బొట్టు వలె ఒప్పారుచున్న ప్రాంతమే శ్రీవిల్లిపుత్తూరు. దీని సమీపంలో నున్న ఉద్యానవనంలోని కోయిలలు. చిలుకలు కూయుచుండగా అక్కడి మేడలు ప్రతిధ్వనులు చేయగా ఆ పట్టణ వీధుల గుండా వెళ్ళేవారు తలలెత్తి చూడగా అత్యున్నతములైన మేడల యొక్క చూరులందు నీలములతో చెక్కబడి కోయిలలు, మరకతంబులచే చెక్కబడిన చిలుకలు కానరాగా ఈ పక్షులే ఆ ధ్వనులు చేస్తున్నట్లు భ్రాంతి కలిగించే విధంగా ఉంటాయి. అక్కడి గృహములు తమపైన తామర మొగ్గలవలె మలచి యున్న కెంపుల కలశములనెడు ఎఱ్ఱమట్టి శిరస్త్రాణములు కలిగి బంగారు కవచము తొడిగి స్వర్గములోని ఇంద్రుని మేడయగు వైజయంతముతో యుద్ధము చేయుటకు సన్నద్ధమైనట్లున్నాయి. అష్టదిగ్గజములు ఎల్లప్పుడు నీటిలో ఉండుటచే పాచిపట్టిన పచ్చరాతి ఏనుగుల్లాగా లక్ష్మీదేవికి అభిషేకము చేస్తున్నట్లుగా కనిపిస్తాయి. అక్కడి వాకిళ్ళముందు రత్నమయములైన భూములయందు మొగ్గలు, పచ్చని ఆకులు, నారికేళములు ప్రతిఫలింపగా సింగారాలు ఒలికినట్లు ఉంటాయి. అక్కడి ద్రవిడ స్త్రీలు చెంగలువల కొలనులో పసుపుతో స్నానమాడి స్వామి తిరువజ్జనము నిమిత్తము తీర్థపు బిందెలతో నీటిని తెచ్చే ఆచారాన్ని పాటించేవారు. మానవ దంపతులుగా చెక్కబడిన రూపములో శ్రీ శ్రీపతుల రెండు రథాలు దేవతలకు నివాసమిచ్చిన మేరు, మందర పర్వతాల వలె ఉన్నాయి. ఆ పట్టణమునందలి వాయువులు మన్నారు కృష్ణుని వక్షస్థలమందలి తులసీ వనమాలికల మీద, మకరంద బిందువుల మీద వీచుటం జేసి ఆ శైత్యంబును, పరిమళంబును స్వామివారి కోవెల చుట్టూ సౌరభాలు వెదజల్లును.

**"పొలయుం గాడ్పులు దజ్మహాలయ నదంభోజాక్షస్తుల**
**స్య లఘుస్ర జ్మకరంద బిందువుల బణ్యారంపు బుణ్యంపు గం**
**పుల దాపత్రయి మీటి వీట నటన ప్రాద్యోగ సజ్జోభవ**
**ల్లలనావర్జిత కైశిక క్షరిత కహ్లారాళి నల్లార్చుచున్"**

శ్రీవిల్లిపుత్తూరులోని స్వామివారి కోవెల ధ్వజస్తంభమందున్న బంగారు మువ్వలు రాత్రుల యందు మలయ మారుతము సోకి కదలి ఘల్లుమని ఒక్కొక్కసారి చప్పుడు కాగా ఆ కోవెల బంగారు ప్రాకారము వెంటనున్న సంపెంగ కొమ్మల యందు నిద్రించుచున్న పక్షులదరి ధ్వని చేయగా విని పక్షులు కూయుచున్నవనే భ్రాంతి కలిగే విధంగా ఉన్నాయి. అంతేకాదు ఆ పట్టణము నందలి భాగవతులు అతిథి అభ్యాగతులైన భాగవతులకు ఎదురుగా వెళ్ళి సాష్టాంగముగా ప్రణమిల్లి, పాదప్రక్షాళనము చేసి, అరటి ఆకులలో భోజనాలు పెట్టి అనంతరం సంభావనలు ఇచ్చి సత్కరించే స్వభావము కలవారు. అలాంటి ఉత్తమ సంప్రదాయము, సద్భక్తి తత్వము కలవారు చిత్తమునందు నిత్యమూ విష్ణువునే స్మరించువాడైన విష్ణుచిత్తుడు అగ్రగణ్యుడు.

**"అందుండు ద్వయ సద్మ పద్మవదనుండ ద్వంద్వుడశ్రాంతయో**
**గాందూ బద్ధ మధు ద్విషద్విరదుడన్వర్థాభి దానుండురు**
**చ్ఛందో బృంద తదంత వాగ పఠనా సంజాత తజ్జన్యని**
**ష్టంద ద్వైత సుసంవిధాలయుడు నిష్టన్విష్ణు చిత్తుడనన్"**

ఆ విష్ణుచిత్తుడు నిరంతరము ద్వయ మంత్రము చేత అనుసంధానము చేయుచు, సుఖదుఃఖములు, శీతోష్ణములు సరిగా మదిలో తలచుకుంటూ తన నిరంతర యోగము చేత శ్రీపతిని వశపరచుకొని వేద వేదాంతములు చదువకయే వాటివలన కలుగవలసిన నిశ్చల ద్వైత జ్ఞానమునకు తాను నివాస భూమియై, విష్ణుచిత్తుండు సార్థక నామధేయము గల ఒక యోగ నిష్ఠతో ఉండెను. ఆ బ్రాహ్మణోత్తముడైన విష్ణుచిత్తుడు ఇరువది నాల్గు తత్వములతో విష్ణువును ఆరాధించేవాడు.

**"న్యాయార్జిత విత్తమున**
**నా యోగీశ్వరుడు పెట్టు నన్నంబ్రాప్రా**
**లేయపటీరా చలప**
**ద్యాయాతాయాత వైష్ణవావలి కెల్లన్"**

ఆ యోగీశ్వరుడైన విష్ణుచిత్తుడు న్యాయ మార్గము ద్వారా సంపాదించిన ధనమును ఆసేతు హిమాచలం ప్రయాణించే వైష్ణవ భక్తులకు అన్నదానం కోసం వెచ్చించెడివాడు. స్వయముగా తులసీవనమును నిర్మించి పూలను రమణీయముగా మాలలు అల్లి ఆ పట్టణములో కొలువై యున్న వటపత్రశాయికి భక్తిశ్రద్ధలతో సమర్పించి నిరంతరం ఆ భగవంతుని సేవలందే కాలం గడిపేవాడు. అతని ఇంటిలో ప్రతి శనివారం అనేకమంది పరదేశి వైష్ణవులు అతిథులుగా వచ్చేవారు. వారికి అరటి ఆకులపై చక్కని భోజనములు పెట్టి అతిథి సత్కారములు చేసెడివాడు. పగటిపూటలోనే కాదు రాత్రులందు శేషశాయి పుణ్యకథలు చెప్పేవారి కంఠనాభములును దివ్యప్రబంధముల రవములు వినబడును. ఆ శేషశాయి కృపతో అన్నము, కూరలు, భక్ష్యములు దొరకలేదన్నమాట వినబడేది కాదు. అంతటి ఉపచారములు లభించేవి.

**"ఇత్తెఱగున నవైష్ణవోత్తముండు**
**జాగరూకత దైర్షిక భాగవతుల**

**కితర మెఱుగక యెవ్వరేమి వేడి**
**రలయ కవిపెట్టి సంతృప్తి సలుపుచుండె"**

ఇలా నిరంతరం భక్తి శ్రద్ధలతో భగవంతుని కైంకర్యాది సేవలో తరిస్తున్న విష్ణుచిత్తునకు భగవంతుని కృపాకటాక్షాలతో పాండ్యరాజు నిర్వహించిన పండితుల సభలో పండితులను తర్కంలో ఓడించి శ్రీమన్నారాయణుడే మోక్షప్రదాత యని అనేక ఉదంతాలతో నిరూపణ చేసి పాండ్యరాజు చేత బహుమతి సత్కారము పొంది తిరిగి వచ్చి శ్రీవిల్లిపుత్తూరు లోని వటపత్రశాయిని ఆరాధిస్తూ ఉండగా ఒకనాడు –

**"వింగడమైన యొక్క వనవీధి గనుంగొనె నీడ సున్నపున్**
**రంగుట రంగు పచ్చలయరంగయి పోవెలిదమ్మి బావికిన్**
**జెంగట నుల్లసిల్లు తులసీవనసీమ శుభాంగి నొక్క బా**
**లం గురువింద కందళ దళప్రతిమాంఘ్రి కరోదరాధరన్"**

విష్ణుచిత్తుడు శృంగార వనవీధిలో నీడలు దేరెడి తెల్లని సున్నపు రంగు గల చెట్లనీడల చేత మరకత మయమగునట్లు కనబడుచుండగా దాని సమీపమున తెల్లతామరల కొలను చెంత ఒక తులసీ వనమందు శుభలక్షణ లక్షితురాలగు ఒక ఆడ శిశువును చూచెను. ఆశ్చర్యంతో ఆ బాలిక చెంతకేగి దివ్యకాంతితో విరాజిల్లుతున్న ఆ బాలికను చేరదీసి పిల్లలు లేని తనకు ఆ భగవంతుడు ప్రసాదించి వరమని భావించి అల్లారుముద్దుగా పెంచసాగాడు. తులసీ వనములో జన్మించినందులకు ఆమెకు గోదాదేవి అని నామకరణం చేశాడు.

పుట్టుకతోనే సుగుణాలరాశియైన గోదాదేవి ఇతర కన్యకల్లా కాకుండా ఎప్పుడూ భగవంతుని యందే మనసు నిలిపి ధ్యానించేది. విష్ణుచిత్తుడు భగవంతునికి మాలలు తయారు చేస్తూ రెండు పూబంతులను గోదాదేవికి తయారు చేసి ఇచ్చేవాడు. వాటితో ఆడుకుంటూ ఉండేది చిన్నారి గోదాదేవి. తండ్రితో పాటు ఆలయానికి వెళ్ళడం వల్లనూ, ఇంటివద్ద సాయంకాలం భాగవతం, రామాయణం, గజేంద్రమోక్షం వంటి కథల పారాయణం జరుగుతుండగా వాటిని శ్రద్ధగా విని ఆ శ్రీకృష్ణుని యందే ప్రేమను పెంచుకున్నది.

**ఆయత భూజైక చక్రుం**
**డాయదు పతి దొమ్మి గెలువ నదరు మరుని కా**
**లాయన చక్రపరంపర**
**లోయన నుంగరపు గురులు యువతికి నమరున్"**

ఈ గోదాదేవి శ్రీకృష్ణుని మోహింపగలదియై యున్నది కావున ఒక్క చక్రము మాత్రము కలిగిన ఆ శ్రీకృష్ణుని గెలుచుటకై నియమించిన మన్మథుని ఉక్కు చక్రముల గుంపులో ఉన్నట్లు ఆ యువతి యొక్క తలవెంట్రుకలు ఉంగరములుగా ప్రకాశించుచున్నట్లు ఉన్నాయి. చంద్రబింబము వంటి ముఖము గల గోదాదేవి పాటలు పాడునప్పుడు మంద్ర మధ్యతారములనెడు స్వరములు చెవుల కింపుగా ఉండేవి. తన తండ్రియైన విష్ణుచిత్తుడు ఆ శ్రియాపతి కృప వలన అధిక సంపదలు కలిగియున్నా ఏమాత్రము గర్వించక సాధారణ స్త్రీల వలెనే తండ్రి బాటలో నడుస్తూ స్వామివారి పుష్పమాలా కైంకర్యము చేసేది. శ్రీవిష్ణుపురాణము వ్యాఖ్యానము చేత కాలక్షేపము చేయుచు చెంగలువ దండలను తాను కొప్పులో ధరించి తన ప్రతిబింబాన్ని నూతిలో చూచుకొని మళ్ళీ యథావిధిగా బుట్టలో పెట్టేది. తండ్రియైన విష్ణుచిత్తుడు ఆ బుట్టలోని మాలలను స్వామివారికి సమర్పించేవాడు. స్వామివారు కూడా ఆ మాలలను ఆనందముగా స్వీకరించేవారు.

గోదాదేవి భూదేవి అవతారము కనుక ఆ పూర్వజన్మ వాసన వలన ఆ భగవంతుణ్ణే వివాహ మాడదలచింది. అంతేకాదు ద్వాపరయుగంలో ఆమె సత్యభామగా అవతరించింది. ఆ అవతారంలో ఆమె శ్రీకృష్ణుని అధిక ప్రేమను పొందలేకపోయింది. ఈ కలియుగంలో గోదాదేవిగా అవతరించి ఆ శ్రీకృష్ణుడే తనకు భర్తయని భావించింది. వ్రేపల్లెలోని గోపికలు ఆ శ్రీకృష్ణుని పొందుట కొరకు కేదారి వ్రతాన్ని ఆచరించారు. అలాగే తాను కూడా ఆ శ్రీకృష్ణుని పొందుటకు అనేక విధాల పూజలు చేసింది. అంతేకాదు 30 దివ్య పాశురములు రచించి గానం కూడా చేసేది.

ఆముక్త మాల్యద అనగా విడువబడిన మాలను తిరిగి ధరించడం. తన తండ్రియైన విష్ణుచిత్తుడు సమర్పించే మాలను గోదాదేవి ధరించిన తరువాతే ఆ శ్రీరంగనాథుడు ధరించేవాడు. ఈ కైంకర్యం స్వామివారికి కూడా సంతోషమే. ఒకనాడు స్వామివారికి విష్ణుచిత్తుడు తెచ్చిన మాలను పూజారి సమర్పిస్తుండగా పొడవాటి స్త్రీ వెంట్రుక కానరాగా అపచారము జరిగిందని విష్ణుచిత్తుడిని నిలదీస్తాడు.

జరిగిన అపచారమునే తలచుకుంటూ నిదురించిన విష్ణుచిత్తునకు శ్రీరంగనాథుడు స్వప్నములో దర్శనమిచ్చి గోదాదేవి ధరించిన మాల అంటే తనకు ఎంతో ప్రీతియని, ఆమెను వివాహమాడెదనని తెలుపగా మొదట ఆశ్చర్యానికి లోనైనా స్వప్న సాక్షాత్కారముతో అసలు సత్యాన్ని తెలుసుకొని శ్రీరంగ క్షేత్రమునకు గోదాదేవితో సహా వెళ్ళి అక్కడ గోదా శ్రీరంగధీశుల వివాహం అత్యంత వైభవంగా అనగా ఆకాశమంత పందిరి, భూదేవంత పీట వేయగా ముక్కోటి దేవతలు పెండ్లి పెద్దలుగా వచ్చారు. బ్రహ్మాది దేవతలు పెండ్లి క్రతువు నిర్వహించగా, యక్ష కిన్నెర గంధర్వులు పుష్పవృష్టి కురిపించారు. ఒక మానవకాంత తన అచంచల భక్తిభావ సంపత్తితో ఏవిధంగా భగవంతుణ్ణి పొందగలిగిందో ఈ కథ ద్వారా తేటతెల్లమవుతుంది. ఈ కథను విన్నా, చదివినా ఈ వ్రతాన్ని ఆచరించినా సకల శుభాలు కలుగుతాయన్నది యథార్థం.

★★★

# అక్షతల ప్రాముఖ్యత

– రమేష్



**లోకంలో ఉన్నవన్నీ ఏదో ఒకనాటికి క్షతమయ్యేవే. అంటే నశించేవే. కానీ ఏనాటికీ నశించనిది అంటేక్షతం కానిది దైవత్వం ఒక్కటే దీనికి నిదర్శనమే అక్షతలు. అంటే ముక్కలు కాకుండా నిండుదనం కలిగి ఉండేవి. అవి దైవత్వానికి నిదర్శనాలు. అందుకే పెద్దలు అక్షతలతో ఆశీర్వదించడం మన సంప్రదాయంగా మారింది. షోడశోపచార పూజలో అక్షతలకు ప్రత్యేక స్థానం ఉంది.**

పూజలో ఏవైనా వస్తువులు లేకపోతే వాటికి బదులు అక్షతలు ఉపయోగిస్తారు. ఉదాహరణకు పువ్వులు లేకుటే పుష్పార్థం అక్షతాన్ సమర్పయామి... గంధం దొరక్కపోతే గంధార్థం అక్షతాన్ సమర్పయామి... అంటూ అక్షతలను ఉపయోగిస్తారు. కానీ అక్షతలకు బదులుగా మరో వస్తువును ఉపయోగించడాన్ని స్మార్త ఆగమ సంప్రదాయాలు ఒప్పుకోవు. అది అక్షతలకు ఉన్న ప్రత్యేకత.

తలంబ్రాలు లేని పెళ్ళిని ఊహించలేము. అక్షతలు లేని ఆశీర్వచనాన్ని సంపూర్ణంగా భావించలేము. ఇంట్లో పూజ చేసుకున్నా, రాములవారి కళ్యాణానికి వెళ్ళినా... చేతిలో అక్షతలు లేకపోతే ఏదో చింత. ఇంతకీ ఆ అక్షతలకు ఎందుకు అంత ప్రాముఖ్యత?

అక్షతలు లేదా అక్షింతలు నీటితో తడిపిన బియ్యము. క్షతములు కానివి అక్షతలు అని అర్థము. భగ్నము కాని బియ్యమును అక్షతలు అంటారు. నిండు గింజలైన అక్షతల వలె మీ జీవితము కూడా భగ్నము కాకుండా ఉండాలని నిండు నూరేళ్ళు జీవించాలని చెప్పడానికి సంకేతంగా అక్షతలను ఉపయోగిస్తాము.

పెద్దలు పిన్నలను ఆశీర్వదించేటప్పుడు గాని, పూజాదికములందు గాని వివాహోపనయనముల యందు గాని వాడుట హిందూ ఆచారము.

అక్షతలు అంటే ! క్షతం అంటే గాయపడటం, విరిగిపోవడం అన్న అర్థం వస్తుంది. కాబట్టి క్రతువులలో వినియోగించే నిండైన బియ్యాన్ని అక్షతలు అంటారు. ఇప్పుడంటే జీవితాలలో సుఖం ఎక్కువైపోయి అన్నం విలువ తెలియడం లేదు కానీ ఆహారం లేని జీవితాన్ని ఊహించుకోలేం కదా!

ధాన్యం కేవలం ఆహారానికి మాత్రమే కాదు, జీవితంలోని సమృద్ధికి కూడా సూచనగా భావిస్తుంటారు పెద్దలు. అందుకే మంచికైనా, చెడుకైనా విరగని బియ్యపు గింజలు అక్షతలుగా వినియోగిస్తుంటారు.

పూజలో, భగవంతుని పూజించే సమయంలో అక్షతలను వినియోగించడం పరిపాటి. దీనికి రెండు కారణాలున్నాయి. పూజలో ఏ ద్రవ్యం లేకపోయినా కూడా ఆ స్థానంలో అక్షతలను ఉపయోగించవచ్చే. అలా ఎలాంటి లోటూ లేకుండా పూజ సాగిపోయేందుకు అక్షతలు తోడ్పడుతాయి. ఇక పూజ పూర్తయిన తరువాత ఆ ఫలాన్ని నలుగురికీ అందించేందుకు కూడా పూజాక్షతలను అందించడం పరిపాటి. ఆశీర్వచనంలో, పిల్లలు సుఖసంతోషాలతో జీవించాలని పెద్దలు తలమీద అక్షతలు వేసి ఆశీర్వదిస్తూ ఉంటారు. ఇలా బ్రహ్మరంధ్రం మీ అక్షతలు చల్లడం వల్ల వారిలోని సానుకూల తరంగాలు మనకు చేరతాయని చెబుతారు. ఒకరినుంచి ఒకరికి ఇలా శక్తిపాతం ద్వారా అనుగ్రహం లభించేందుకు అక్షతలు తోడ్పడతాయి.

తలంబ్రాలు... పెళ్ళిలో వధూవరులు ఒకరి తలమీద మరొకరు పసుపు కలిపిన బియ్యాన్ని పోసుకోవడం చూసేదే. విరగని బియ్యం లాగా తమ జీవితాలు కూడా అక్షతంగా సాగిపోవాలని ఇందులో ఓ సూచన కనిపిస్తుంది. అంతేకాదు, ఒకరిమీద ఒకరు తలంబ్రాలు పోసుకునే చర్యతో వారిరువురి మధ్యా ఒక అయస్కాంత చర్య ఏర్పడుతుందనీ... అది వారు జీవితాంతం కలిసి మెలిసి ఉండటానికి తోడ్పడుతుందనీ చెబుతారు. అదేమో కానీ తలంబ్రాలు పోసుకునే క్రతువుతో ఇద్దరిమధ్యా చనువు

ఏర్పడటం మాత్రం అందరూ గమనించేదే.

బియ్యము చంద్రునికి చెందిన ధాన్యము. మనః కారకుడైన చంద్రుడి ప్రభావం బియ్యంపై ఉంటుంది. మానవుని దేహం ఓ విద్యుత్ వలయం. ఆశీర్వదించేవారు చేతిలోకి బియ్యం తీసుకోగానే వారిలోని విద్యుత్ బియ్యానికి అందుతుంది. ఆశీర్వదించే వారికి చర్మవ్యాధులు ఉంటే ఆ ప్రభావం కూడా ఆశీర్వాదం తీసుకునే వారిపై పడుతుంది. అందుకే క్రిమిసంహారకమైన పసుపుని కలిపి కేవలం విద్యుత్ మాత్రమే స్వీకరించేలా చేసి పసుపు కలిపిన బియ్యాన్ని అనగా అక్షింతలనిచ్చి ఆశీర్వదించమంటారు. పసుపు లేదా కుంకుమ గానీ కలపని అక్షింతలను పూజా కార్యక్రమాల్లో గానీ శుభకార్యాల్లో గానీ వాడరు.

**అక్షింతలు మూడు రకాలు**

హరిద్రాక్షతలు. పసుపు కలిపిన బియ్యం. వీటిని పూజకు, ఆశీర్వదించేటప్పుడు ఉపయోగిస్తారు.

**రక్షాక్షతలు**

పసుపు సున్నము కలిపిన బియ్యం.

**శ్వేతాక్షతలు**

ఏమీ కలపని తెల్లిన బియ్యం అశుభకార్యాలకి ఉపయోగించునవి.

**అక్షతల పరమార్థం ఏమిటి?**

వివాహ శుభకార్యంలో జీలకర్ర, బెల్లం పెట్టేవేళ, మాంగల్యధారణవేళ, వధూవరులపై ఆహూతులు అక్షతలు చల్లి ఆశీర్వదించడం మన హిందూ సంప్రదాయం. వివాహ శుభకార్యాల్లోనే కాదు, ప్రతి శుభకార్యంలోనూ పెద్దలు, పిన్నలకు అక్షతలు వేసి దీర్ఘాయుష్మాన్ భవ, చిరంజీవీ భవ, సంతాన ప్రాప్తిరస్తు, ఆరోగ్య ప్రాప్తిరస్తు, సుఖజీవన ప్రాప్తిరస్తు అంటూ ఆశీర్వదిస్తారు. ఇక దైవసన్నిధిలో సరేసరి. పూజారైతే మంత్రాక్షతలతో అందరినీ దీవిస్తారు.

అక్షతలు అనే మాట నుంచి వచ్చినదే అక్షింతలు. క్షతం కానివి అక్షింతలు. అంటే రోకలిపోటుకు విరగని, శ్రేష్ఠమైన బియ్యం అన్నమాట. అలాంటి బియ్యాన్ని పసుపు లేక కుంకుమతో, నేతితో కలిపి అక్షతలు తయారు చేస్తారు. నవగ్రహాల్లో ఒక్కో గ్రహానికీ ఒక్కో ధాన్యాన్ని దానవస్తువుగా పేర్కొంటారు. ఆ రకంగా నవగ్రహాలలో చంద్రుడికి ప్రీతికరమైన దానవస్తువు బియ్యం. జ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుడు మనస్సుకు అధినాయకుడు. మనిషి మనసు, బుద్ధి, గుణము, తల్లి, వ్యసనము ఇత్యాదులన్నీ చంద్ర కారకాలే అని అన్నారు పెద్దలు. అందుకే మనిషిపై చంద్రుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ చంద్రుడికి సంకేతమైన బియ్యం కూడా మనిషి మనస్సుపై ప్రభావం చూపుతుంది. మనోధర్మాన్ని నియంత్రిస్తాయి.

శాస్త్రీయంగా చూస్తే మనిషి దేహం ఓ విద్యుత్ కేంద్రం.



విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు సాధారణం. ఈ వ్యత్యాసాలు మనిషి మనస్సు మీద, ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపుతాయి. మనుషుల్లో తమో, రజో, సాత్త్వికాలనే త్రిగుణాలకూ కారకము. పెద్దలు వధూవరులపై అక్షతలు చల్లి ఆశీర్వదించే సమయంలో దేహంలోని విద్యుత్తులో కొంతభాగం ఈ అక్షతలను తాకుతాయి. ఆశీస్సులు ఇచ్చేవాళ్ళ నుంచి, పుచ్చుకునే వాళ్ళకు కొంత విద్యుత్తు బదిలీ అవుతుంది. ఈ కారణంగా అక్షతల ద్వారా పెద్దలలో ఉండే సాత్విక గుణం పిన్నలకు లభిస్తుందనేది మన నమ్మకం. పెద్దలు, విద్వాంసులు, గురువులు, తల్లితండ్రులు, అత్తమామలు వివాహ సమయంలో, శుభకార్యాలలో మనకు అక్షతలు వేసి శిరస్సును తాకి ఆశీర్వదించడంలోని ఆంతర్యం, పరమార్థం ఇదే.

మరో సిద్ధాంతం ప్రకారం చూస్తే మనిషి దేహంలో విద్యుత్తు కేంద్రాలు ఇరవై నాలుగు ఉంటాయట. వాటిలో ప్రధానమైనది శిరస్సు. ఇది విద్యుదుత్పత్తి కేంద్రమే కాదు, విద్యుత్తు ప్రసార కేంద్రం కూడా. తలపై అక్షింతలు వేయడం ద్వారా వాటిలోని విద్యుత్తును గ్రహించి దేహానికి ప్రసారం చేస్తుంది శిరస్సు. అక్షంతలుగా ఉపయోగించే బియ్యానికి పసుపు కుంకుమలు

కలపడం ఎందుకు? ఆయుర్వేదం ప్రకారం చర్మసంబంధ రోగాల్ని అడ్డుకునే శక్తి పసుపుకు ఉంది. పసుపు నుంచి తయారయ్యే కుంకుమకూ ఈ శక్తి ఉంది. అక్షతలు వేసే వారికి ఎలాంటి రోగ సమస్యలున్నా, పుచ్చుకొనేవాళ్ళకి అవి సోకకుండా ఈ పసుపు కుంకుమలు నివారిస్తాయట. అంతేకాక పసుపు కుంకుమలు శుభానికి సంకేతాలు కూడా ఆధ్యాత్మికంగా చెప్పాలంటే జీవుడికి సంకేతం బియ్యం.

**భగవద్గీతలో**

**"అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సంభవః"**

**యజ్ఞాద్భవతి పర్జన్యోయజ్ఞ కర్మసముద్భవః**

అని మూడవ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు . జీవులు అన్నం చేత పుడతారట. ఈ అన్నం తయారీకి మనం ఉపయోగించే ధాన్యం బియ్యం. భగవంతునిపై అక్షతలు వేసి నమస్కరించడం అంటే, జీవుడు ఈ అన్నంలో పుట్టి, తిరిగి ఈ జీవుడిని భగవంతుడిలోకి చేర్చడమే. అక్షతలలో ఇంతటి పరమార్థం గోచరిస్తుంది. తెలుగులో ఈ అక్షతలను తలంబ్రాలు లేదా తలబ్రాలు అని కూడా అంటారు.

తలను = తల యందు పోయబడే

ప్రాలు = బియ్యం అని అర్థం.

పూర్వం వధువు ధాన్యలక్ష్మిగా చెప్పబడింది.

ఈ తలంబ్రాల కార్యక్రమంలో బియ్యానికి ఒక ప్రత్యేకత ఉంది. ఓ వధువా! నీవు మా ఇంటికి వచ్చావు. మన ఇంట ధాన్యం ఇలా కుప్ప తెప్పలుగా విరివిగా ఉండి, మన జీవనానికి ఆధారభూతమైన ధాన్యంతో మనం నిత్య సంపదల వాళ్ళమై తులతూగుతూ ఉండాలి అనే భావానికి అనుగుణంగా ఈ తలంబ్రాల కార్యక్రమం సాగుతుంది. వరుడు, వధువు శిరస్సులపై తలంబ్రాలు పోసుకునే దానికి ముందు, వరుడు ముందుగా వధువు చేతిని దర్భతో తుడిచి, దోసిలిలా రెండు మార్లుగా బియ్యాన్ని వేసి, ఆ మీదట పాలని కొద్దిగా చల్లి తలంబ్రాలకి సిద్ధం చేస్తాడు. తలంబ్రాలు వేశాక వధువు ఇలా చెయ్యాలని ఒక పద్ధతి చెప్తుంది. ఈ కాలంలో పురోహితులే చేయించి పోయిస్తున్నారు.

ఈ కన్య వంశాన్ని తరింపజేయుగాక, పుణ్యం వృద్ధి చెందుగాక, శాంతి, పుష్టి, సంతోషం, అభివృద్ధి, విఘ్నాలు లేకపోవడం, ఆయురారోగ్యాలు అన్నీ వీరికి కల్గుగాక! అని చదువుతూ అక్షతారోపణం (తలంబ్రాలు పోయించడం) చేయిస్తారు. ఈ చేసిన వివాహకర్మ మొత్తం అక్షతము (నాశనము లేనిది) అగుగాక! అని దీని భావం.

ఇక పెద్దల దగ్గర ఆశీర్వాదం తీసుకొనేపుడు పాదాల కెందుకు నమస్కరిస్తాం అంటే మన శరీరంలో తల ఉత్తర ధృవం అయితే పాదాలు దక్షిణ ధృవం. వ్యతిరేక ధృవాలే ఆకర్షించుకుంటాయి అని మనకు తెలుసు కదా, అప్పుడే శక్తి విడుదల అవుతుంది.

అలానే మనం పెద్దల దగ్గర ఆశీర్వాదం తీసుకొనేపుడు మన తలను వారి పాదాలకు తాకించి ఆశీర్వాదం తీసుకుంటాం. అప్పుడు వారి పాదాలలోని దక్షిణ ధృవం మన తలలో గల ఉత్తర ధృవంతో ఆకర్షితమై శక్తిని వెలువరిస్తుంది. అందుకే మన హిందూ సంప్రదాయంలో పెద్దల కాళ్ళకు నమస్కరిస్తాం.

కానీ ఇప్పుడు పెద్దల దగ్గర ఆశీర్వాదం తీసుకోవడం అంటే, ఒకరి కాళ్ళ మీద మనం పడడం ఏంటి అనే అహం ఎక్కువ అయిపోయింది. ఒకటి గుర్తుపెట్టుకోండి, మన పెద్దలు మనకన్నా చాలా విషయాలలో అనుభవజ్ఞులు కాబట్టి అలాంటి వారి అనుభవాల నుండి మనం చాలా నేర్చుకోవచ్చు. వారి ముందు అహం చూపించడంలో అర్థం లేదు. మనం బాగుండాలని మనసారా దీవించేవారి నుండి దీవెనలు అందుకోవడానికి మనకి అహం అడ్డువస్తే మనమే మూర్ఖులం.

పసుపు హిందువులకు శుభసూచకం. పైగా క్రిమిసంహారక శక్తి కలిగిన ద్రవ్యం. అందుకే శుభకార్యాలలో పసుపుతో చేసిన అక్షతలను మాత్రమే ఉపయోగించాలి.

తెల్లటి బియ్యాన్ని అక్షతలుగా అశుభకార్యాలలోనూ, ఎరుపురంగు బియ్యాన్ని అక్షతలుగా అమ్మవారి పూజలోనూ వాడటం ఆనవాయితీ.

పసుపు కలిపిన బియ్యం వెనుక మరో మర్మం కూడా కనిపిస్తుంది. మనః కారకుడైన చంద్రునికి బియ్యం ప్రీతి కలిగిస్తాయి అని చెబుతారు. అందుకే జాతకంలో చంద్రునికి సంబంధించిన దోషాలకు పరిహారంగా బియ్యాన్ని దానం చేయమంటారు.

ఇక పసుపు గురుగ్రహానికి ఇష్టమైన రంగు. గురుడు అదృష్టం, కీర్తి, సంతానప్రాప్తి, విద్య, ఆరోగ్యం వంటి సకల శుభాలకూ కారకుడు. అంటే అక్షతలు ఇటు చంద్రునికీ అటు గురునికీ కూడా ప్రీతి కలగజేసి సకల శుభాలను అందిస్తాయన్నమాట. అక్షతలలో, తలంబ్రాలలో ఇంతటి పరమార్థం గోచరిస్తుంది.

మన పూర్వీకులు ఈ వివాహ శుభకార్యాలలో, ఇతర శుభకార్యాలలో ఏర్పాటు చేసిన సంప్రదాయాల్లో, ఆచారాల్లో ఇంత గూఢార్థం ఉంది. వివాహ సమయంలో నవదంపతులు కలిసి జీవించి ఉండాలని, ఆదర్శ దంపతులుగా మెలగాలని, వధూవరులపై ఆహూతులు అక్షింతలు చల్లి ఆశీర్వదించడమే అక్షతల కార్యక్రమంలోని అర్థం, పరమార్థం తెలుసుకుని అందుకు అనుగుణంగా మెలగాలి. అంతేగాని సైన్స్ పేరుతో సెన్స్ లేని మూఢనమ్మకాలు అనే పేరు మాత్రం పెట్టకండి. ఎందుకంటే మన పూర్వీకుల శాస్త్రీయత నేటి సైన్స్ పెద్దలకు అందని ద్రాక్ష కనుక అవి వారికి పుల్లనే.

**సర్వేజనా సుఖినోభవంతు**

**సమస్త సన్మంగళాని భవంతు**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## వెయ్యికాళ్ళ మండపం

2003 వ సంవత్సరం వరకు తిరుమల క్షేత్రాన్ని సందర్శించుకున్న భక్తులందరికీ, ఆలయ మహాద్వారానికి ఎదురుగా ఉన్న శిల్పకళా శోభితమైన, సువిశాలమైన వెయ్యికాళ్ళ మండపం సుపరిచితమే. అనునిత్యం భక్తులతో క్రిక్కిరిసి ఉండే తిరుమలలో జరిగే ఎన్నో ధార్మిక, సామాజిక కార్యకలాపాలకు కేంద్రబిందువైన ఈ మండపం భక్తుల మదిలో కలకాలం మెదులుతూనే ఉంటుంది. ఈ మంటపం తన ఐదువందల ముప్పై సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో కోట్లకొద్దీ శ్రీవారి భక్తులకు ఆశ్రయమివ్వడమే కాకుండా వేలాదిమంది చిరువ్యాపారుల, వృత్తి వ్యాపారాలకు వేదికయై, శ్రీవారినే నమ్ముకున్న ఆ బడుగు వర్గాల వారికి బాసటగా నిలిచింది. అంతేకాకుండా విజయనగర చక్రవర్తులు, మట్ల వంశీయులు, మహమ్మదీయులు, మరాఠా రాజులు, మహంతులు, ఆంగ్లేయులు ఇలా ఎందరెందరో పాలకుల ఉత్థాన పతనాలకు సాక్షీభూతంగా నిలిచి, చరిత్రపుటల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది.

ఇప్పుడు భౌతికంగా కనుమరుగైన ఈ మండపం ఊహాచిత్రాన్ని మనసులో ముద్రించుకోవాలంటే, మొదటగా ఆలయం యొక్క నైసర్గిక స్వరూపాన్ని ఆకళింపు చేసుకోవాలి. భక్తులు సాధారణంగా భావించేటట్లు ఆలయం కొండశిఖరంపై లేదు. సప్తగిరి శిఖరాల నడిమధ్యన ఉన్న లోతట్టు ప్రాంతంలో ఉంది. అంటే ప్రధానాలయం, స్వామిపుష్కరిణి, ఒకప్పుడు ఇరుకుగా ఉండే మాడవీధులు, వీటిచుట్టూ దాదాపుగా వాటికి అనుసంధానించబడి ఎత్తైన పర్వత శిఖరాలు ఉండేవి. బేడి ఆంజనేయుని ఆలయం ఎదురుగా ఉన్న అఖండం వద్దనుండి పరికిస్తే, ఆలయం వెనుకభాగంలో పచ్చని ప్రకృతితో పరవశిస్తున్న పర్వతాలను ఈనాటికీ చూడవచ్చు. వాటిలో అత్యున్నతంగా ఉన్నది నారాయణగిరి శిఖరం. ఈ పర్వతశిఖరాలు ఆలయం కంటే చాలా ఎత్తుగా ఉండటం వల్ల, కొన్నేళ్ళ క్రితం వరకూ వర్ష ఋతువులో ఆ పర్వతాల నుండి జాలువారిన జలధారలతో మాడవీధులన్నీ చిత్తడిగా ఉండేవి.

పెరుగుతున్న భక్తజన సందోహానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు కొండరాళ్ళను చదును చేస్తూ, ఆలయం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని విస్తరించుకుంటూ పోయారు. ఆ క్రమంలోనే శ్రీవారికెదురుగా రాచఠీవితో ఉట్టిపడుతుండే వెయ్యి కాళ్ళ మండపాన్ని కూల్చి, భక్తుల సౌకర్యానికి పెద్దపీట వేశారు. వారసత్వ సంపద పరిరక్షణా? భక్తజనుల సౌలభ్యమా? ఏది ముఖ్యం? ఎవరు నిర్ణయిస్తారు? మంటపం తొలగింపు సాకారం చేసుకున్నాడు కాబట్టి ఇదంతా శ్రీనివాసుని సమ్మతితోనే సమకూరినట్లుగా భావించాలేమో.

**మంటపం పుట్టు పూర్వోత్తరాలు**

**ఎవరు, ఎలా కట్టించారు?**

1472వ సంవత్సరంలో విజయనగర సామ్రాజ్య వారసుడు సాళువ ఎర్రకంప దేవుని కుమారుడైన సాళువ మల్లయ్యదేవ మహారాజు, శ్రీవారి ఆలయానికి దేవదేయంగా వచ్చిన దుర్గ సముద్రం అనే గ్రామం మీద వచ్చిన వార్షికాదాయంతో ఈ మంటపం నిర్మించబడినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి. సాధారణంగా మడులు, మాన్యాలు, అగ్రహారాలు, దేవాలయాల నిర్వహణకు, ప్రసాదాల వితరణకు సమర్పించుకుంటారు. దానికి భిన్నంగా ఈ గ్రామం, గోపురాలు, మండపాలు, కుడ్యాలు నిర్మించే నిమిత్తం ఆలయానికి ధారాదత్తం చేయబడినట్లుగా శాసనాలలో లిఖించబడింది. ఆ గ్రామం యొక్క ఆదాయంతో వెయ్యి కాళ్ళ మంటపం వంటి చరిత్ర ప్రసిద్ధికెక్కిన కట్టడం నిర్మించబడటం ద్వారా ఆ దాత యొక్క స్వప్నం సంపూర్ణంగా సాకారమయింది.

**సరిహద్దులు**

దీర్ఘచతురస్రాకారంలో ఉండే ఈ మంటపం సరిహద్దులు :

పడమర దిక్కున – తూర్పు మాడ వీధి

ఉత్తర దిక్కున – సన్నిధి వీధి (వాహన మరియు వైభవోత్సవ మంటపాలకి మధ్యలో ఉన్న రాంబగీచా

వసతిగృహం నుండి ఆలయం వరకూ వెళ్ళే రహదారి)

దక్షిణ దిక్కున – హాథీరాంజీ మఠం యొక్క ముందుభాగం

తూర్పు దిక్కున – బేడి ఆంజనేయుని మందిరం

మిట్టపైనున్న హాథీరాంజీ మఠం యొక్క భూతలం ఈ మంటపం యొక్క ఉపరితల భాగానికి సమానంగా ఉండేది. అవగాహన చేసుకోవడానికి కొంచెం క్లిష్టంగా ఉన్నప్పటికీ కనులు మూసుకుని ఆలయం ముందుభాగాన్ని మనసులో మననం చేసుకుని మనకు చిరపరిచితమైన ఈ హద్దులను ఊహించుకుంటే ఆ మండపం యొక్క వాస్తవ స్థావరం కళ్ళముందు సాక్షాత్కారమవుతుంది.

ఈ మంటపం తూర్పు–పడమరలు 310 అడుగుల పొడవు, ఉత్తర–దక్షిణాలు 134 అడుగుల వెడల్పు కలిగిన సువిశాలమైన కట్టడం. పన్నెండడుగుల ఎత్తైన మంచె లాంటి సహజసిద్ధమైన మిట్టపై ఆలయం యొక్క భూతలం నుంచి సుమారు ఇరవైమూడు అడుగుల ఎత్తులోసమున్నతంగా,రాజసం ఉట్టిపడుతూ ఉంటుంది. మంటపం యొక్క భూతలమట్టం తూర్పునుండి పడమరకు పెరుగుతుండడం వల్ల ఆలయం ఎదురుగా ఉన్న మంటపభాగం యొక్క ఎత్తు 11 అడుగులుగానూ, బేడి ఆంజనేయుని ఎదురుభాగం ఎత్తు తొమ్మిది అడుగులుగాను ఉండేది. మంటపం యొక్క పడమర దిక్కున అంటే ఆలయం ఎదురుగా విశాలమైన సోపానాలుండేవి. మెట్ల ద్వారా మంటపంలోకి ప్రవేశిస్తుంటే మొదటి అంతస్తు ఎక్కినట్లనిపించేది.

**సరిగ్గా సహస్రమేనా?**

మంటపం లోని రెండే స్తంభాల నడుమ ఆరు నుండి ఎనిమిదడుగుల దూరం ఉండేది. ప్రతి స్తంభం ఒక కళాఖండమే. పైకప్పుకున్న వంపు తిరిగిన బాహ్య కుడ్యపు అంచులపైనా, ప్రతి స్తంభం పైనా దేవతలు, పౌరాణిక ఘట్టాలు, విజయనగర సామ్రాజ్య చిహ్నాలు, నృత్యభంగిమలు, విజయనగర వీరుల విన్యాసాలు, వాస్తవిక, కాల్పనిక జంతువులు మున్నగునవి మనోహరంగా మలచబడ్డాయి.

మంటపానికి సరిగ్గా వెయ్యికాళ్ళే ఉన్నాయని ఇదమిత్థంగా చెప్పలేము. మంటపం నిర్మించినప్పుడు ఆనాటి వాస్తుశైలి ననుసరించో, లేదా సమకాలీన మంటపాలన్నింటి లోకి విలక్షణంగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే ఆనాటి పాలకులు ఈ మంటపాన్ని ఖచ్చితంగా వెయ్యి స్తంభాలతో నిర్మించి 'వేయికాళ్ళ మంటపం'గా నామకరణం చేసి ఉండవచ్చు. అయితే గడిచిన 50–60 సంవత్సరాల కాలంలో తిరుమలపై అనేక నూతన కట్టడాలు రావడం వల్ల, ఒకప్పుడు కొండపై ఏకైక ఆవాస స్థానంగా ఉన్న ఈ మంటపం ప్రాధాన్యత క్రమంగా తగ్గుతూ వచ్చింది. దానికితోడు పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా మాడవీధులను వెడల్పు చేయవలసి వచ్చింది. ఈ కారణాల వల్ల అంచుల్లో ఉన్న స్తంభాలను కూలగొడుతూ మంటపం విస్తీర్ణం క్రమంగా కుదించబడింది. అందువల్ల ఖచ్చితంగా ఎన్ని స్తంభాలున్నాయో చెప్పడం కష్టసాధ్యమే. అయితే మంటపం సువిశాలమైనదవడం వల్ల, లెక్కకు మిక్కిలిగా స్తంభాలుండడం వల్ల ఇది వేయికాళ్ళమండపంగా పేరొంది ఉండవచ్చని కొందరి అభిప్రాయం.

మంటపం యొక్క పొడవు, వెడల్పులను బట్టి దాని విస్తీర్ణాన్ని లెక్కగట్టి, దాన్ని ఇరుస్తంభాల మధ్యనున్న సగటు దూరంతో భాగించి, భాగఫలానికి చివరి వరుసల్లో ఉన్న స్తంభాలను కలిపితే సుమారుగా ఎనిమిది వందల స్తంభాలుంటాయని ఉజ్జాయింపుగా చెప్పవచ్చు.

**ఎందుకు నిర్మించారు?**

అప్పట్లో ఆలయం చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం ఉండేది. క్రూరమృగాలు యథేచ్ఛగా సంచరిస్తూ ఉండేవి. తిరుమల కొండపై మరేవిధమైన ఆవాసాలు గానీ, వసతి గృహాలు కానీ ఉండేవి కావు. తరచుగా వర్షాలు కురుస్తూ వాతావరణం పగలు ఎండగానూ, రాత్రివేళల్లో ఎముకలు కొరికే చలితోనూ ఉండేది. ఈదురుగాలులు వీస్తుండేవి. దానికితోడు కోతుల బెడద. అందువల్ల భక్తులు ఈ మంటపంలో తల దాచుకునేవారు. అప్పటి పాలకులు తగిన రక్షణ, వసతి, భోజనం ఏర్పాట్లు చేసేవారు. చాలామంది భక్తులు అక్కడే వంట కూడా చేసుకునేవారు.

మహమ్మదీయుల పాలన ముందు ఈ మంటపంలో పవిత్రోత్సవాలు నిర్వహించబడేవి. ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పూజాకైంకర్యాలలో అనాలోచితంగా ఏవైనా పొరపాట్లు

దొర్లితే, వాటికి ప్రాయశ్చిత్తంగా జరిగే సంవత్సరోత్సవాలను 'పవిత్రోత్సవాలు'గా పిలుస్తారు. వీటి గురించి మున్ముందు మరింత వివరంగా తెలుసుకుందాం. మహమ్మదీయుల పాలనా కాలంలో, అర్చకుల కొరత వల్ల కొంతకాలం పవిత్రోత్సవాలను నిలిపివేశారు. వారి తదనంతరం సాధారణ పరిస్థితులు నెలకొనడంతో పవిత్రోత్సవాలను ఈ మంటపంలోనే పునః ప్రారంభించారు.

తరువాతి కాలంలో ఈ మంటపం అనేక రకాలుగా ఉపయోగపడింది. మంటపంలో కొంతభాగం కళ్యాణకట్టగానూ, మరికొంతభాగం సంగ్రహాలయంగానూ, కూడా వినియోగింపబడిందని ఇంతకుముందు తెలుసుకున్నాం. మంటపం కూల్చేనాటికి, అడ్డుగోడలు నిర్మించబడి, మంటపమంతా గదులు గదులుగా విభజింపబడింది. ఆ గదులలోనే రక్షకభట నిలయం, ఉద్యోగుల ఫలహారశాల, చెవిపోగులు కుట్టే గది, విద్యుత్ పరికరాల గిడ్డంగి, పురోహితసంఘం, లడ్డూ విక్రయశాల, బోలెడన్ని దుకాణాలు కూడా ఉండేవి. మంటపంలో సింహభాగాన్ని ఆక్రమించిన కళ్యాణకట్ట, సంగ్రహాలయం సరేసరి. వీటన్నింటికి తోడు శౌచాలయాలు కూడా అందులోనే ఉండడంతో ఈ మంటపం శ్రీవారి భక్తులకు విశ్రాంతి మందిరంలా కూడా సేవలందించేది.

ఒకప్పుడు మాడ వీధుల్లో ఊరేగింపు జరిగే సమయంలో మలయప్ప స్వామివారు ఈ మంటపంలోకి వేంచేసి హారతి నందుకునేవారు. నైవేద్య సమర్పణ కూడా అందులోనే జరిగేది. తరువాతి కాలంలో కారణాంతరాల వల్ల ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పారు.

స్థూలంగా చెప్పాలంటే, అర్ధశతాబ్దం క్రితం వరకూ తిరుమలలో శ్రీవారి ఆలయ సముదాయం, వేయికాళ్ళ మంటపం, కొన్ని మఠాలు, ధర్మసత్రాలు, అర్చకుల మరియు వ్యాపారుల మరియు ఆలయ సిబ్బంది కోసం పరిమిత సంఖ్యలో నిర్మించిన ఆవాసాలు తప్ప, మరేవిధమైన కట్టడాలు ఉండేవి కావు. భక్తులు విశ్రాంతి తీసుకోవాలన్నా, ఏదైనా కార్యక్రమం చేపట్టాలన్నా, కార్యాలయం నిర్వహించాలన్నా ఈ వేయికాళ్ళ మంటపమే శరణ్యం.

ఈవిధంగా ఇందుగలడందు లేడన్నట్లు, సర్వం తానై ఈ మంటపం ప్రస్థానం తిరుమల క్షేత్ర చరిత్రతో పెనవేసుకుపోయింది.

మంటపం తొలగింపుకు నాంది

ఇన్ని రకాలుగా సేవలందించిన ఈ మంటపం యొక్క ప్రాభవానికి, పెరుగుతున్న జనసందోహమే అడ్డుకట్ట వేసింది. భక్తుల సౌకర్యార్థం శతాబ్దాల చరిత్ర గల ఈ మంటపాన్ని విడతలవారీగా తొలగించే కార్యానికి 1920 వ సంవత్సరంలోనే బీజం పడింది. కానీ భక్తుల నుండి వ్యతిరేకత వ్యక్తం కావడంతో కూల్చివేత కార్యక్రమం తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే అంచుల్లో ఉన్న కొన్ని శిలా స్తంభాలు సహజసిద్ధంగా కూలిపోవడం వల్ల మరికొన్ని స్తంభాలను అప్పటి అవసరాల కోసం కూల్చివేయడం వల్ల 1972వ సంవత్సరం నాటికి దాదాపు 100 స్తంభాలకు పైగా తొలగిపోయి వాటి పైకప్పు కూలిపోవడం వల్ల అర్ధశతాబ్దం క్రితమే ఇది 'భగ్నమందిరం'గా గుర్తించబడి దైవకార్యాలకు అనర్హమయింది.

**మండపం తొలగింపు**

వివిధ కారణాల వల్ల వెయ్యికాళ్ళ మండపం తొలగించే ప్రస్తావన 1920వ సంవత్సరంలోనే వచ్చినప్పటికీ, భక్తుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవడంతో, అప్పట్లో ఆ ఆలోచనను విరమించుకున్నారు. తరవాత వచ్చిన పాలక వర్గాలు కూడా ఆ సాహసం చేయలేకపోయాయి.

**వంద అడుగుల సన్నిధి వీధి**

1980 వ సంవత్సరం నాటికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వెయ్యికాళ్ళ మంటపాన్ని అంతకుముందే 'భగ్నమంటపం'గా గుర్తించడం వల్ల దానిలో వైదిక పరమైన కార్యక్రమాలేవీ జరగటంలేదు. పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ పరిసరాలలో ఉన్న ఇతర కట్టడాలను తొలగించే లేదా వేరే ప్రదేశానికి తరలించే కార్యక్రమం వేగం పుంజుకుంది. అంతేకాకుండా స్వామివారి నిత్యకళ్యాణం అప్పటివరకు విమాన ప్రదక్షిణ మార్గంలో నున్న ఇరుకైన కళ్యాణ మంటపంలో జరిగేది. దానివల్ల అతికొద్దిమంది భక్తులకు మాత్రమే దాన్ని తిలకించే అవకాశం లభించేది. అప్పట్లో ఆలయానికి అభిముఖంగా, గొల్ల మంటపం వెనుక నుండి బేడి ఆంజనేయస్వామి ఆలయం వరకు ఉన్న 'సన్నిధివీధి', ఆక్రమణల కారణంగా పదిహేను అడుగుల వెడల్పుకు కుంచించుకుపోయింది. పైగా సన్నిధి వీధికి దక్షిణాన ఉన్న వెయ్యికాళ్ళ మండపంలో ఆ వీధికి అభిముఖంగా అనేక దుకాణాలు ఉండేవి. వీధికి ఉత్తరభాగంలో కూడా అదే పరిస్థితి. దానితో సన్నిధి వీధి మరింత కుదించుకుపోయి కేవలం ఆరడుగుల దారి మాత్రమే మిగిలింది. ప్రధానాలయాన్ని చేరుకోవడానికి అదే ముఖ్యమార్గమవడం వల్ల భక్తులు తీవ్రమైన అసౌకర్యానికి గురయ్యేవారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని భక్తులందరూ సౌకర్యవంతంగా కూర్చుని తిలకించడానికి వీలుగా ఆలయానికి వెలుపల ఒక ఆస్థానమంటపం నిర్మించి, కళ్యాణోత్సవాన్ని అందులో జరపాలని, భవిష్యత్ అవసరాలను సైతం దృష్టిలో ఉంచుకుని సన్నిధి వీధిని ఆరడుగుల నుంచి వందడుగుల వెడల్పు చేయాలని ప్రతిపాదించబడింది. అప్పటికే వివిధ కారణాల వల్ల దఫాల వారీగా వందకు పైగా స్తంభాలు తొలగించబడ్డాయి.

అప్పటి ప్రతిపాదనలు 1982వ సంవత్సరంలో కార్యరూపం దాల్చి, అనుకున్నట్లుగానే సన్నిధివీధి వంద అడుగుల విశాలమైన రహదారిగా వెడల్పు చేయబడింది. ఆ క్రమంలో వెయ్యికాళ్ళ మంటపం మరో రెండు వందల కాళ్ళను కోల్పోయింది. మరోప్రక్క ఈ మంటపం యొక్క దక్షిణ పార్శ్వానికి హాథీరాంజీ మఠానికి మధ్యలో ఉన్న రహదారిని వెడల్పు చేయడంతో, అటుప్రక్క కూడా కొన్ని స్తంభాలను తొలగించాల్సి వచ్చింది. ఇరుప్రక్కలా తొలగించిన మంటప భాగాల్లో తి.తి.దే కార్యాలయాలే ఉన్నాయి. కొన్ని వ్యక్తిగత దుకాణాలు కూడా ఉన్నాయి. కాని వాటికి ఆకర్షణీయమైన పరిహారాన్ని చెల్లించడం మరియు ఆమోదయోగ్యమైన, ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా చూపించడంతో, తొలగింపు కార్యక్రమానికి పెద్ద అడ్డంకులేమీ ఎదురు కాలేదు.

ఇలా విడతల వారీగా మంటప వైశాల్యం తగ్గుతూ, 1983వ సంవత్సరానికి దాదాపుగా సగమై నామావశిష్టంగా మిగిలింది.

**భారీ కేటాయింపు**

పోను పోను భక్తుల తాకిడి మరీ ఎక్కువ కావటంతో దుర్ఘటనలు కూడా జరిగాయి. 1983 వ సంవత్సరం రథోత్సవం లోనూ, 2002 వ సంవత్సరం బ్రహ్మోత్సవాలలోనూ జరిగిన త్రొక్కిసలాటల్లో అనేకమంది భక్తులు గాయపడి, ప్రాణనష్టం సంభవించింది కూడా. దాంతో వెయ్యికాళ్ళ మంటపం తొలగింపు అంశం మరలా తెరపైకి వచ్చింది. 2002వ సంవత్సరంలో జరిగిన పాలకమండలి సమావేశంలో చారిత్రాత్మకమైన తీర్మానం చేయబడింది. దానిననుసరించి వెయ్యికాళ్ళ మంటపాన్ని ఆ ప్రదేశం నుంచి తొలగించి ఆ స్తంభాలతోనే దాన్ని వేరొకచోట పునర్నిర్మించటానికి, మాడ వీధులను వెడల్పు చేయటానికి, ఆలయం చుట్టూ ఇప్పుడున్న బాహ్య ప్రాకారానికి వెలుపల మరో మహా ప్రాకారాన్ని నిర్మించడానికి 72 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించారు. అప్పట్లో కూల్చివేత నిర్ణయం, అత్యంత భారీగా నిధుల కేటాయింపు రెండూ సంచలనాన్ని సృష్టించాయి.

**ముగిసిన మంటప ప్రస్థానం**

కూల్చివేత నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తాయి. అయినా తీర్మానాన్ని అమలు పరుస్తూ 2003వ సంవత్సరంలో చరిత్ర ప్రసిద్ధికెక్కిన ఈ మంటపం పూర్తిగా నేలమట్టం చేయబడింది. అంతేకాకుండా అప్పటివరకు మంటపానికి భూతలంగా ఉన్నట్టి పన్నెండడుగుల సహజసిద్ధమైన శిలావేదికను కూడా సమూలంగా తొలగించి, ఆ ప్రదేశాన్ని ఆలయం యొక్క భూతలంతో సమంగా చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే, మంటపాన్ని నామరూపాలు లేకుండా చేసి ఆనవాళ్ళన్నింటినీ తుడిచి వేశారు. సుదీర్ఘకాలం పాటు తిరుమల క్షేత్రానికే తలమానికంగా నిలిచిన వెయ్యికాళ్ళ మంటప ప్రస్థానం అలా దయనీయంగా ముగిసింది.

**గొల్ల మంటపం అలా ఎందుకుంది?**

సాధారణంగా ఏ మంటపం వేదికైనా భూతలానికి నాలుగైదు అడుగుల ఎత్తులో, సౌకర్యవంతంగా, విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఉంటుంది. కానీ ఆలయ మహాద్వారానికి ఎదురుగా దాదాపు ఇరవై అడుగుల పైబడిన ఎత్తులో, విచిత్రంగా కానవచ్చే గొల్లమంటపం అలా ఎందుకుంది అనే సందేహం సహజంగానే కలుగుతుంది. ఒకప్పుడు ఇది కూడా అన్ని మంటపాల్లాగే కూర్చోవడానికి అనువుగా ఉండేది. పన్నెండడుగుల ఎత్తైన వెయ్యికాళ్ళ మండపం యొక్క శిలావేదిక ఉన్నప్పుడు, దాదాపుగా దానినానుకుని ఉన్న గొల్లమంటపం కూడా మిగిలిన మంటపాల లాగానే ఉండేది. గొల్లమంటపం వద్దనే అఖండం మరియు కొబ్బరికాయలు కొట్టే సదుపాయం ఉండేది. ఈ మండపంలోనే పేరుకు తగ్గట్టు పాలు-పెరుగు అమ్ముతూ ఉండేవారు. వెయ్యికాళ్ళ మంటపం మిట్టను కొట్టివేసేటప్పుడు గొల్ల మంటపం కాళ్ళను మాత్రం మిగిల్చి, చుట్టూ ఉన్న పర్వత భాగాన్నంతా తొలిచివేశారు. అందువల్లే ఈనాడు గొల్లమంటపం ఉన్నతంగా, మిగిలిన మంటపాలకు భిన్నంగా, పొడవాటి కాళ్ళతో కానవస్తుంది.

**మళ్ళీ మొదటికి**

మంటపాన్ని హడావిడిగా కూల్చివేసి నేలను చదును చేయడంతో ఆగ్రహజ్వాలలు ప్రజ్వరిల్లాయి. భక్తులు, పలువురు ప్రముఖులతో పాటు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ స్వామి కూడా మంటపం కూల్చివేతను తీవ్రంగా వ్యతిరేకించారు. తన అసమ్మతిని బాహాటంగా వ్యక్తపరుస్తూ, శిష్యులతో కలిసి తిరుమలలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. వెయ్యికాళ్ళ మంటపం కేవలం అలంకార ప్రాయమైన చారిత్రాత్మక కట్టడం మాత్రమే కాదని, స్వామివారికి కైంకర్యాలు చేయడానికై నిర్మించబడిన మతపరమైన కట్టడమని, ఆ మంటపానికి ఆలయంతో సమమైన ప్రాధాన్యం ఉన్నదని, పెక్కు సందర్భాల్లో దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈవిధంగా చర్చోపచర్చలు జరుగుతుండగానే, తొలగించబడిన వెయ్యికాళ్ళ మండపం యొక్క శిలాస్తంభాలను, ఇతర భాగాలను భద్రంగా తరలించి, స్వామి పుష్కరిణికి వెనుక భాగాన ఉన్న ఖాళీ ప్రదేశంలో వెయ్యికాళ్ళ మంటపాన్ని పోలిన మరో విశాలమైన కట్టడాన్ని నిర్మించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జీయర్ స్వామి ఆ ప్రతిపాదనను కూడా తీవ్రంగా వ్యతిరేకించి, ఆందోళనను మరింత ఉధృతం చేశారు. నిరసనలు తారాస్థాయికి చేరుకోవడంతో త్రవ్విన మేరక ప్రదేశాన్ని పూడ్చివేసి, వెయ్యికాళ్ళ మంటపాన్ని మరలా అదే స్థానంలో నిర్మించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది.

### వివాదాలకు నెలవు

ఇదిలా ఉండగా వెయ్యికాళ్ళ మండపం తొలగింపు, సన్నిధి వీధి విస్తరణ మొదలైన కారణాల కారణంగా, శతాబ్దాల నుండి తమ తమ అధీనంలో ఉన్న స్థావరాలను పూర్తిగా లేదా పాక్షికంగా కోల్పోయిన లేదా కోల్పోతామేమోననే అనుమానం ఉన్న హాథీరాంజీ మఠం వారు, పెద్ద జీయర్ మఠం వారు, సన్నిధి వీధిని ఆనుకుని ఉండే మరికొన్ని ఇతర మఠాలవారు, గొల్ల మండపాన్ని విశేషంగా అభిమానించే కొందరు గొల్ల కులస్తులు తి.తి.దే యాజమాన్యం తీర్మానాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈవిధంగా తి.తి.దే పై మొత్తం ఆరు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

### త్రిసభ్య మండలి

వెయ్యికాళ్ళ మండపం తొలగింపు అంశం చిలికి చిలికి గాలివానగా మారి, వీధి ఆందోళనలకు, వాదోపవాదాలకు, చట్టపరమైన చిక్కులకు దారి తీయడంతో, ఈ వివాదాన్ని సానుకూలంగా పరిష్కరించడానికై 2004వ సంవత్సరంలో ప్రభుత్వం ఒక త్రిసభ్య మండలని ఏర్పాటు చేసింది. అందులో తిరుమల ఆలయ పాలనా వ్యవహారాలలో ప్రవేశం, విశేషానుభవం ఉన్న ముగ్గురు విశ్రాంత ఉన్నతాధికారులు సభ్యులుగా నియమించబడ్డారు. వెయ్యికాళ్ళ మంటపం యొక్క పుట్టుపూర్వోత్తరాలను వెలికి తీసి, అది ఏ లక్ష్యంతో నిర్మించబడిందో ఇదమిత్థంగా తెలుసుకోవడం, ప్రభుత్వం ముందున్న మార్గాలను శాస్త్రీయంగా విశ్లేషించి, అందరికీ ఆమోదయోగ్యమైన, ఆగమశాస్త్ర విరుద్ధం కాని పరిష్కార మార్గాన్ని సూచించటం మొదలైనవి ఈ కమిటీ పరిధిలోని అంశాలు. ఈ మండలికి పూర్తి సమాచారాన్ని అందించి, మండలి సభ్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో సహాయపడడం కోసం సాంకేతిక అంశాలలో ప్రావీణ్యం ఉన్న వారిని, సంగ్రహాలయం అధికారులను, సుప్రసిద్ధ స్థపతిని, ఆలయ భవనాల కాలనిర్ణయంలో నిష్ణాతులైన వారిని సభ్యులుగా చేర్చి మరో ఉపమండలి కూడా ఏర్పాటు చేయబడింది.

### అభిప్రాయాలు – సిఫార్సులు

తమకు అప్పగించిన అంశాలన్నింటినీ, కూలంకషంగా, సాంకేతిక నిపుణుల సహాయంతో పరిశీలించిన త్రిసభ్య కమిటీ సంచలనాత్మకమైన వివరాలతో కూడుకున్న నివేదికను సమర్పించింది. అంతవరకు దేవాలయానికి దేవదేయంగా సమర్పింపబడ్డ 'దుర్గసముద్రం' గ్రామం యొక్క వార్షికాదాయంతో నిర్మించినట్లుగా భావించబడే కట్టడం వెయ్యికాళ్ళ మంటపం కాదని, ఈ మంటపం నిర్మించింది ఎవరో, ఏ లక్ష్యంతో నిర్మించారో నిర్దిష్టంగా విశదీకరించే శాసనాలు లభ్యం కాలేదని, ఒకప్పుడు ఇందులో నైవేద్య సమర్పణ వంటి వైదిక కార్యక్రమాలు చేపట్టబడేవని చెప్పగలిగే ఆధారాలు లభించలేదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా ఆ కమిటీ కొన్ని ముఖ్యమైన సిఫారసులు కూడా చేసింది.

దేవాలయానికి ఎదురుగా వెయ్యికాళ్ళ మండపం తొలగించడం ద్వారా ఏర్పడిన విశాలమైన ఖాళీ స్థలానికి చుట్టుప్రక్కల ఉన్న ఇతర ఖాళీ స్థలాలను కూడా చేర్చి, ఆ ప్రదేశంలో వెయ్యి కాళ్ళ మండపం కంటె విశాలమైన మహామండపం నిర్మించాలని, మండపం మధ్యలో స్తంభాలు లేకుండా, అందులో జరుగుతున్న కార్యక్రమాలను అందరూ తిలకించడానికి అనువుగా ఉండేటట్లు నిర్మాణం జరగాలని, కార్యక్రమాల నిర్వహణకు ఒక విశాలమైన మంచెను కూడా ఏర్పాటు చేయాలని, వెయ్యికాళ్ళ మండపంలో తొలగించిన శిలాస్తంభాలలో అత్యద్భుత శిల్పచాతుర్యం గల వాటిని వేరుచేసి, అటువంటి వాటిని ఆలయ పరిసర ప్రాంతాలలో కనీసం అలంకార ప్రాయంగానైనా అమర్చాలని అభిప్రాయపడింది. ఈ సూచనలను ప్రభుత్వం, తి.తి.దే ఇరువురూ యథాతథంగా ఆమోదించారు. దాంతో వివిధ న్యాయస్థానాలలో అపరిష్కృతంగా ఉన్న వ్యాజ్యాలు ఉపసంహరింపబడ్డాయి. ఆందోళనలు సద్దు మణిగాయి.

### కొలిక్కి వచ్చేదెన్నడో?

ఎన్నెన్నో కారణాల వల్ల ఆ సిఫార్సులు దశాబ్దాలు గడిచినా అమలుకు నోచుకోలేదు. తొలగించబడిన శిలాస్తంభాలలో కొన్నింటిని తిరుమలలోని కొన్ని ప్రాంతాలు, కూడళ్ళలో అందంగా అమర్చారు. మిగిలినవాటిని నారాయణగిరి ఉద్యానవనంలోనూ, గోగర్భం ఆనకట్ట పరిసర ప్రాంతాల్లోనూ భద్రపరిచారు. ఐదు శతాబ్దాల ఘన చరిత్ర గల మంటపం ఆగమేఘాల మీద పడగొట్టబడింది. కానీ దశాబ్దాలు గడిచినా, ప్రభుత్వాలు మారినా దాని పునర్నిర్మాణం మాత్రం ఇంకా ప్రారంభం కూడా కాలేదు. ఆ శుభఘడియ కోసం భక్తులందరూ ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. నారాయణగిరి వనంలో దానిని తిరిగి నిర్మిస్తారని, త్వరలోనే నిర్మాణం ప్రారంభిస్తారని, టెండర్ల ప్రక్రియ మొదలైందని, దానికేవో అడ్డంకులు వచ్చాయని, ఇలాంటి వార్తలు అడపా దడపా ప్రసార మాధ్యమాల ద్వారా వస్తుంటాయి. ఈ విషయంలో తి.తి.దే చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, భక్తుల చిరకాల స్వప్నం సాకారమవడానికి శ్రీవారి అనుగ్రహం కూడా తోడవ్వాలి కదా.

ఆ కరుణామయుని కటాక్షంతో అద్భుతమైన శిల్పచాతుర్యం గల వేయికాళ్ళ మండపం అతిత్వరలోనే పునర్నిర్మించబడి, ఆనాటి శోభను తిరిగి సంతరించుకుని భక్తజన రంజకంగా భాసిస్తుందని ఆశిద్దాం.

★★★

# హరిహర సుతనే అయ్యప్ప

**– మందరపు వి.జి.శంకరాచారి**

సృష్ట్యాదిలో దేవతాకోటి సృష్టితో పాటుగా రాక్షసులు కూడా జన్మించడం జరిగింది. దేవతలు, రాక్షసులు ఇరువురూ తమలో తాము తామే గొప్పవారిమంటూ కీచులాడుకోవడం జరుగుతూ ఉండేది. మొత్తానికి రాక్షసుల కంటె దేవతలు బలవంతులు కాగోరి శివకేశవులు అండగా ఉండగా మందర పర్వతాన్ని కవ్వంగానూ, వాసుకిని తాడుగానూ ఉపయోగించి క్షీరసాగరాన్ని ఇరువురూ కలిసి చిలకగా మొదటగా వచ్చిన హాలాహలాన్ని లోకోద్ధరణ కోసం పరమశివుడు త్రాగి గరళంలో ఉంచుకోవడం జరిగింది. పిదప ఉద్భవించిన వాటిని ఒక్కొక్కరు ఒక్కొక్కటిగా (లక్ష్మీదేవి, ఐరావతం, కౌస్తుభం మొదలగునవి) తీసుకొనగా చివరికి అమృతం పుట్టినది. ఈ అమృతం దేవతలకు మాత్రమే దక్కవలెనని జగన్మాత మహావిష్ణువుకి చెప్పగా అతడు మోహినీ రూపాన్ని ధరించి రాక్షసులను ఏమార్చి దేవతలకు మాత్రమే అమృతం దక్కేటట్లు చేశాడు.

ఈ సందర్భంలో మోహినీదేవి రూపాన్ని చూసిన పరమశివుడు మోహపరవశుడై ఆమె వెనుకనే అడుగున అడుగిడి చివరకు ఆమెను చేరుకోగా ఒకానొక ఏకాంత ప్రదేశములో కామప్రచోదనము కాగా ఇరువురూ రమించడం జరిగింది. ఆ సందర్భమున వారికి ఒక బాలుడు జన్మించాడు. అతడు జన్మించగానే వారిపై దేవతాకోటి పుష్పవర్షం కురిపించింది. సత్యలోకం నుండి విధాత ప్రత్యక్షమై ముద్దులొలికే ఆ బాలుణ్ణి చూసి మురిసిపోయి హరిహర సుతుడు అని నామకరణం చేశాడు. తల్లి అయిన మోహిని తన కంఠమున అలంకరించిన మణిహారమును తీసి బాలుడి మెడలో వేసి మణికంఠుడని పిలిచినది. తండ్రియైన పరమశివుడు ఆ బాలుడిని పంచభూతాలకి అధిపతిని చేసి భూతనాథుడని పేరిడెను.

ఆ విధంగా హరిహరులకు జన్మించిన ఆ బాలుడు దివ్యలోకములో దిన దిన ప్రవర్ధమానుడవుతూ పెరగసాగాడు.

ఇదిలా ఉండగా మహిషాసురుడనే రాక్షసుడు అత్యంత బలవంతుడై ముల్లోకములను గడగడలాడించసాగాడు. అతడి యొక్క దుశ్చర్యలను దేవతలు తట్టుకోలేక జగన్మాత అయిన పార్వతీదేవి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకోగా ఆమె త్రిశక్తిరూపిణిగా రూపు దాల్చి (లక్ష్మీదేవి, సరస్వతీదేవి, పార్వతీమాతలు కలిసిన శక్తిగా) మహిషాసురుని వధించింది.

రాక్షస లోకంలో మహిషాసురుడు మరణించడంతో దేవతలకు రాక్షసుల వలన కలుగు ఆటంకాలు తొలిగాయి. అయితే మహిషాసురుని సోదరి యైన మహిషి తన అన్న మరణానికి దేవతలపై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంది. అందుకుగాను తనకు కావలసింది మరణం లేని జీవితంతో పాటుగా అత్యంత శక్తివంతురాలు కావాలని తలపోసింది. ఇందుకుగాను బ్రహ్మ గురించి తీవ్రమైన తపస్సు



చేయడం ప్రారంభించింది.

మహిషి చేస్తున్న తపస్సు వలన ముల్లోకములు కకావికలం కాసాగాయి. అతి తీవ్రమైన ఆమె తపస్సుకి మెచ్చి ఒకానొక సందర్భమున బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకోమని అడిగాడు. అందలకామె మరణం లేని జీవితాన్ని ప్రసాదించమని కోరుతుంది. అందుకు విధాత మరణం లేని జీవితమును ప్రసాదించడం ఎవరికీ సాధ్యం కాదు. కావున మరియొక వరాన్ని కోరుకోమంటాడు.

అప్పుడు మహిషి ఈ విధంగా కోరుతుంది. ''తండ్రీ! విధాతా! నేను ఈ రాక్షస లోకాలలో జీవిస్తూ ఉన్నాను. హరిహరులకు జన్మించిన పుత్ర సంతానముతోనే నేను మరణించవలయును. అదియును నేను భూలోకమునకు వెళ్ళి అక్కడ నివసించడం జరగాలి. ఆ స్థితిలో హరిహరులకు జన్మించిన పుత్రసంతానం – భూలోకమునందు సంచరించినపుడు మాత్రమే అతడి చేతిలో నాకు మరణం సంభవించాలి. నేను ఈ రాక్షస లోకంలో నివసిస్తున్నంతకాలం ఎవరివల్ల గానీ నాకు మృత్యువు సంభవించకూడదు'' అని కోరుకుంటుంది.

మహిషి కోరుకున్నట్లే తను రాక్షస లోకాల నుండి భూలోకానికి వెళ్లినప్పుడు అక్కడ హరిహరుల సంగమం వలన జన్మించిన పుత్రుడి చేతిలోనే నీకు మరణం సంభవిస్తుంది అని విధాత వరమిస్తాడు.

బ్రహ్మదేవుడి నుండి ఆ విధంగా మరణం సంభవించకుండా తెలివిగా వరాన్ని పొందిన మహిషి తదనంతర కాలంలో విజృంభించి

దేవతలపై ప్రతీకారాన్ని తీర్చుకోసాగింది. ముల్లోకాలను అల్లకల్లోలం చేయసాగింది. మహిషి యొక్క దుశ్చర్యలకు, దురాగతాలకు దేవతలందరూ బీతి చెందారు. ఈ మహిషి యొక్క ఆగడాలు ఏవిధంగా అంతం చేయవలెనో అర్థం కాక అందరూ చింతాక్రాంతులయ్యారు.

దేవతల రాజైన దేవేంద్రుడు దేవతలందరినీ వెంటబెట్టుకుని కైలాసానికి వెళ్లి పరమేశ్వరునితో మహిషి యొక్క అకృత్యాలను, ఆగడాలను వివరిస్తాడు. బ్రహ్మదేవుడు ఇచ్చిన వరం వల్ల మహిషి తను భూలోకం చేరుకోనను ధీమాను కలిగియుంది. అంతియే కాకుండా హరిహరులకు కుమారుడు జన్మించే అవకాశం లేదని, అందువల్ల తనకు మరణం సంభవించదని భావించి ఈ అకృత్యాలను చేస్తోంది. కాబట్టి మహిషి అకృత్యాలకు అడ్డుకట్ట వేసి ఆమెను చంపవలెనంటే దానికి సరియైన ప్రణాళికను మీ త్రిమూర్తుల వలనే సాధ్యపడుతుంది అన్నాడు.

ఇంద్రుడి ద్వారా మహిషి గురించి తెలుసుకున్న పరమేశ్వరుడు స్థితికర్తయైన శ్రీమహావిష్ణువుని ధ్యానం చేయడంతో నారాయణుడు కైలాసంలో ప్రత్యక్షమై మహాశివుడి ద్వారా మహిషి గురించి తెలుసుకున్నాడు. తదుపరి పరమశివుడు శ్రీమహావిష్ణువుకు ప్రార్థన చేయగా విధాత కైలాసానికి చేరుకున్నాడు.

విషయం తెలుసుకున్న విధాత పథక రచన చేశాడు. అతడు హరిహరులతో మాట్లాడుతూ ''హరిహరులారా! మహిషి మరణించవలెనంటే మరలా మీ ఇద్దరి సంగమం జరిగి ఒక కుమారుడు భూలోకంలో జన్మించాలి. అంతేకాదు ఈ రాక్షస లోకంలో విరాజిల్లుతున్న మహిషిని భూలోకం వెళ్ళేటట్లుగా చేయాలి. మీరిరువురూ మీ యొక్క అంశలతో భూలోకానికి వెళ్ళి అక్కడ రమించాలి. అప్పుడు ఇంతకుమునుపు మీ సంగమం వలన జన్మించిన భూతనాథుని అంశ మరలా భూలోకంలో మీ కుమారుడుగా జన్మించాలి. అప్పుడు అతడి చేతిలో మహిషి మరణించగలదు'' అని చెప్పాడు.

అప్పుడు పరమేశ్వరుడు కైలాసంలో ఉన్న భూతనాథుణ్ణి పిలిచి విషయం తెలియచేసి ఏ సందర్భంలో భూలోకంలో తామిద్దరికీ జన్మించవలసిందీ చెప్పాడు. దానికి భూతనాథుడు తన యొక్క అంశని ఆ సందర్భంలో పంపి హరిహరులకు కుమారుడిగా జన్మిస్తానని చెప్పాడు.

అయితే మహిషిని భూలోకానికి పంపడానికి పరమశివుడు మన్మథుని ప్రయోగించి మన్మథబాణాలు వదిలి మహిషిని మోహపరవశమునకు గురయ్యేటట్లుగా చేశాడు. ఆమె కామవాంఛను తీర్చడానికి దత్తాత్రేయుడిని మగ మహిషిగా మారమని ప్రబోధం చేశాడు. మగమహిషిగా మారిన దత్తాత్రేయుడు మహిషికి ఎదురుపడి ఆమెను రాక్షస లోకాల నుండి భూలోకమునకు తీసుకొనిపోయి అలుదానదీ తీరమున స్థిరపడి అక్కడ వారిరువురూ కామక్రీడలో ఆనందాన్ని అనుభవిస్తూ మైమరచిపోయారు.

భూలోకములో పందళ రాజ్యమును రాజశేఖర పాండ్యన్ మహారాజు పరిపాలిస్తుండెడివాడు. అతడు గొప్ప శివభక్తుడు. అతడి భార్య సాధ్వీమణి గొప్ప విష్ణుభక్తురాలు. వారిరువురికీ వివాహం జరిగి అనేక సంవత్సరాలు గడుస్తున్నా సరే సంతానం కలగలేదు. ఈ విషయమై వారు ఎన్నో వ్రతాలు, నోములు చేసేవారు. పుత్రసంతానమును కలుగజేయమని వారిరువురూ వారి వారి ఇష్ట దైవములను ప్రార్థించారు.

ఆ దంపతుల ప్రార్థనను మన్నించి వారికి పుత్ర సంతానం అనుగ్రహించే సమయం దగ్గర పడింది.

ఈ స్థితిలో హరిహరులు వారియొక్క అంశలను భూలోకమునకు పంపి ఇరువురూ సంగమించడం జరిగింది. అపుడు వారికి ఒక శుభముహూర్తంలో భూతనాథుని అంశ కుమారుడిగా జన్మించడం జరిగింది. ఆ కుమారుడిని ఒక చెట్టు నీడలో ఉంచి వారిద్దరూ అదృశ్యమయ్యారు.

సరిగ్గా అదే సమయానికి వేట కొరకు వచ్చిన పందళ రాజైన రాజశేఖర పాండ్యుడు పంపానదీ తీరానికి వెళ్ళాడు. అక్కడ సర్పము యొక్క నీడన పవళించి ఏడుస్తూ ఉన్న బాలుని గాంచినంతనే అబ్బురపడి ఆనందముగా ఆ బాలుని తీసుకుని తన రాజ్యానికి వెళ్ళి మహారాణి సాధ్వీమణికి చూపించి ఆ బాలుని తమకు భగవంతుడిచ్చిన ప్రసాదంగా భావించి అక్కరగా పెంచుకుంటూ ఉన్నారు. కొద్ది కాలానికి మహారాణి మరియొక కుమారుడికి జన్మనిచ్చింది. ఆ బాలుడు కూడా అపురూపంగా పెరుగసాగాడు.

మణికంఠుడికి 5 సం॥లు దాటిన వెంటనే రాజశేఖర పాండ్యుడు అతనిని గురుకులానికి పంపించాడు. అక్కడ కొంతకాలముండి సకల శాస్త్రములు నేర్చుకుని అన్ని విద్యలలోను సిద్ధహస్తుడయ్యాడు. పిదప గురువుగారికి గురుదక్షిణగా మాటలు రాని, నేత్రములు లేని గురుపుత్రునికి రెండింటినీ ప్రసాదించాడు. అది చూసిన గురువుగారు మణికంఠుడిని దైవాంశ సంభూతుడిగా గుర్తించారు.

అంతేకాక మణికంఠుడు ఆ గ్రామాన్ని తన చోరవృత్తితో గడగడ లాడిస్తున్న ఒక దొంగను మంచివాడిగా మార్చి అతడిని తన భక్తుడిగాను మరియు స్నేహితుడుగాను మారుస్తాడు.

ఈవిధంగా సకల శాస్త్ర పారంగతుడైన మణికంఠుడు యుక్తవయస్సు లోనికి ప్రవేశించాడు. అప్పుడు తండ్రియైన రాజశేఖర పాండ్యుడు యువరాజ పట్టాభిషేకం చేయ సంకల్పించాడు.

మణికంఠుడికి యువరాజ పట్టాభిషేకం చేయడానికి ఇష్టపడని ఆ పందళరాజ్య మహామంత్రి మహారాణి యైన సాధ్వీమణి దగ్గరికి వెళ్ళి ''కన్నకొడుకు ఉండగా పెంచిన కొడుకు మరియు అడవిలో దొరికిన కుమారుడికి యువరాజ పట్టాభిషేకం భావ్యం కాదని దుర్బోధలు చేశాడు.

మహామంత్రి దుర్బోధలు ఆమె యొక్క మంచి మనసుని మార్చివేసింది. మణికంఠుడు యువరాజుగా పట్టాభిషిక్తుడు కాకూడదని కుట్రలు పన్నుతారు. అతడిపై కేరళరాజ్య మాంత్రికులతో అనేక ప్రయోగములు చేయించాడు. మాంత్రికుల మాయా ప్రభావాలకు గురి కాకుండా పరమేశ్వరుడు మణికంఠుణ్ణి రక్షించాడు. అంతటితో ఆగకుండా విషాహారాన్ని పెట్టారు. దానిని శ్రీహరి పంపిన

గరుత్మంతుడు ఆ ఆహారంలోని విషాన్ని తీసేసి అమృతాన్ని చిలికించి కాపాడాడు. ఈవిధంగా ఎన్నో కష్టాలను మణికంఠుడు ఎదుర్కొన్నాడు.

చివరకు మణికంఠుణ్ణి వదిలించుకోవడానికి తల్లియైన సాధ్వీమణిని తలనొప్పిగా ఉందని నాటకమాడమని మహామంత్రి ఆమెకు చెప్పాడు. తనకు అన్నగారైన మహామంత్రి చెప్పినట్లుగానే భరించలేని శిరోవేదనను అనుభవిస్తున్నట్లుగా సాధ్వీమణి నాటకమాడింది.

భార్య శిరోవేదన నిజమనుకుని రాజశేఖర పాండ్యుడు వైద్యులను పిలిపించాడు. అయితే వారు మహామంత్రి యొక్క ప్రలోభాలకు లోనై మహారాణి గారి శిరోవేదన పూర్తిగా నయమవ్వాలంటే అరణ్యములో అప్పుడే ప్రసవించి యున్న పులిపాలు త్రాగవలెనని చెప్పారు.

ప్రసవించిన పులి ఎదుటపడి దాని పాలను తీసుకొనివచ్చుట దుర్లభమని రాజుగారు చింతాక్రాంతుడయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మణికంఠుడు తన తల్లి వ్యాధి నయమగుటకు పులిపాలను తీసుకుని వస్తానని అరణ్యమునకు బయలుదేరి వెళ్ళాడు.

మధ్యదారిలో మణికంఠుడికి దేవేంద్రుడు ఎదురుపడి ఆయన యొక్క జన్మవృత్తాంతమును గురించి తెలియపరిచాడు. మహిషిని సంహరించే సమయం ఆసన్నమైందని చెప్పాడు. విషయం తెలుసుకున్న స్వామివారు ఇంద్రుడికి మరియు దేవతలకి అభయమునిచ్చి అలుదానది తీరము వైపు వెళ్ళాడు.

అప్పుడు మగ మహిషి రూపములో ఉన్న దత్తాత్రేయుడు తన మారు రూపును విడనాడి దేవలోకం వైపు పయనమయ్యాడు. మహిషి తన యొక్క ప్రియుడు కనబడకపోవడంతో విచారగ్రస్థురాలై మగ మహిషి కొరకు అన్వేషిస్తూ తిరగడం ప్రారంభించింది.

ఆ అన్వేషణలో మహిషికి నారదుడు ఎదురై "ఓ మహిషీ! నీ ఆగడాలు భూలోకమున పెచ్చుమీరుతున్నాయి. అందువలన నిన్ను సంహరించడానికి ఒక నరుడు ఇటువైపుగా వస్తున్నాడు. అతడిని సంహరించి నిన్ను నీవు రక్షించుకో" అని చెప్పాడు.

ఒక నరుడు తనని సంహరించడం అసంభవమని, తనే అతడిని సంహరిస్తానంటూ వెర్రికేకలు వేస్తూ మణికంఠుడు వచ్చే మార్గం వైపు పయనించింది.

కొంతసేపటికి ఇద్దరూ తారసపడ్డారు. ఇద్దరికీ భీకర యుద్ధం జరిగింది. మరణించిన మహిషిని అలుదానదీ తీరంలోకి తెచ్చి పడేస్తాడు మణికంఠుడు.

అంతట మహిషి లోనుండి శాపవిమోచనం పొందిన లీలావతి ప్రత్యక్షమై స్వామివారిని వివాహం చేసుకోమని ప్రార్థించింది. అందుకు స్వామివారు సమ్మతించక "ఈ జన్మలో నేను నిత్య బ్రహ్మచారినై సకల మానవాళికీ రక్షకుడినై ఉంటాను. కాబట్టి నిన్ను నేను వివాహం చేసుకోలేనని చెప్పారు.

అయితే స్వామివారు ఆమెకు ఒక వరాన్ని అనుగ్రహించారు. నీవు కూడా నా ప్రక్కనే మాళిగా పులోత్తమగా వెలుగొంది నాతోపాటుగా పూజలందుకుంటావు. దీక్షబూని నా దగ్గరకు వచ్చిన స్వాములను బాధించక కాపాడుతూ ఉండమని సెలవిచ్చారు.

స్వామివారు గొప్పవరాన్ని అనుగ్రహించినా లీలావతి (మంజు మాతాదేవి) మాత్రం తనని వివాహం చేసుకోమని పదే పదే ప్రార్థిస్తూ వేడుకుంది. అప్పుడు స్వామివారు ఆమెతో 41 రోజులు దీక్షబూని ఏనాడైతే నా భక్తులు కన్నెస్వామిగా నా దగ్గరకు రారో అప్పుడు వివాహం చేసుకుంటానని చెప్పారు.

తరువాత స్వామివారు పులి వాహనముగా దేవేంద్రుడిని చేసుకుని పందళ రాజ్యం లోకి ప్రవేశించారు. పులిమీద స్వారీ చేస్తూ పులిపాలతో వచ్చిన మణికంఠుని చూసి ప్రజలందరూ అచ్చెరువొంది మణికంఠుని దైవాంశ సంభూతునిగా భావించారు.

రాజశేఖర పాండ్యుడు మణికంఠునికి పట్టాభిషేకం చేయగోరాడు. అప్పుడు మణికంఠుడు తను రాజుగా అవడానికి ఇష్టపడక సోదరుడైన రాజ రాజ నుండుకి పట్టాభిషేకం చేయమని కోరాడు. అంతేకాక తన యొక్క అవతార రహస్యాన్ని తల్లితండ్రులిద్దరికీ పూర్తిగా వివరించాడు.

అప్పుడు తను చేసిన తప్పులను మన్నించమని మహామంత్రి మణికంఠుడి పాదాలపై పడ్డాడు. మణికంఠుడు అతణ్ణి మన్నిస్తాడు.

తండ్రియైన పందళరాజు "అయ్యా! నీ పట్టాభిషేకము కొరకు తయారు చేయించిన ఆభరణములనైన స్వీకరించుమనగా వారి ఆవేదనను గమనించిన మణికంఠుడు వారి అభీష్టమును మన్నించి ఈ విధముగా చెప్పాడు.

"తల్లితండ్రులైన మీరు నన్ను చాలా ప్రేమగా చూసుకుని అయ్యా+అప్పా అని పిలిచి మీ కన్నకొడుకు లాగా చూసుకున్నందుకు గాను నేను అయ్యప్పగా సుప్రసిద్ధుడినవుతాను. తరువాత ఇక్కడనుండి నేను ఒక శరమును సంధిస్తాను. ఆ శరము పడినచోట నాకు ఆలయమును నిర్మించండి. ఈ క్షణమే బయలుదేరి వెళ్ళి ఈ వేషముతో అక్కడ కూర్చుని భక్తులకు అభయమిస్తున్న రూపంలో వెలుస్తాను. ఆలయమునకు ముందు పద్దెనిమిది సిద్ధులకు సంకేతముగా మెట్లను నిర్మించవలెను. మాలధారణ చేసిన వ్యక్తి ఈ పద్దెనిమిది మెట్లపై నుండి ఆలయ ప్రవేశము చేసి నన్ను దర్శించుకొనవలెను.

ప్రతి మకరసంక్రాంతి పర్వదినాన జ్యోతిరూపమున నా భక్తులకు దర్శనమిస్తాను. మీరు నా పట్టాభిషేకమునకై చేయించిన ఆభరణములను నియమ నిష్ఠలతో ఆలయమునకు తీసుకొని వచ్చి పదునెట్టాంబడిని దాటి నా సన్నిధిలోకి వచ్చి నాకు అలంకరించవలెను. ఆ క్షణమున నన్ను దర్శించిన వారికి ఆయురారోగ్య ఐశ్వర్యములను, ముక్తిని ప్రసాదిస్తాను అని సెలవిచ్చారు.

స్వామివారు చెప్పిన విధముగా రాజశేఖర పాండ్యుడు పంపానది తీరాన 'శబరితల్లి' తపస్సు చేసిన స్థలమునెంచుకుని ఆ స్థలాన్ని శబరిమలై అని పిలుచుకుంటూ – అదేచోట ఆలయమునకు ముందర పద్దెనిమిది మెట్లతో రాజశేఖరపాండ్యుడు ఆలయం నిర్మించడం జరిగింది.

ఆ విధంగా అవతరించిన హరిహర సుతుడైన అయ్యప్ప నాటినుండి నేటివరకు మకర సంక్రాంతి నాడు జ్యోతిస్వరూపుడిగా దర్శనమిస్తూ తన భక్తులకు రక్షకుడిగా నిలుచుచున్నాడు.

**స్వామియే శరణం అయ్యప్ప**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అధికారుల మన్ననలు. గృహోపకర వస్తువులు సమకూర్చుకొనగలరు. వాహనయోగమున్నది. ఎప్పటి నుండి కాని పనులు ప్రేమతో సాధించుకొనగలరు. ప్రయాణములో అనుకూలం. స్త్రీలను చాలా జాగ్రత్తగా గమనించి దూరముగా ఉండండి. వినాయక సరస్వతి శివనామ స్మరణ చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలత. ధైర్యంగా ముందుకు సాగండి. విదేశ ప్రయాణములు. దూర ప్రయాణములు కలిసి రాగలవు. ఆటంకములు తొలగును. చాలా లౌకికంగా ఉండండి. అధికముగా లాభము. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు పరిస్థితులను గమనించి ఏ విధంగా మనము ముందుకు సాగాలో జాగ్రత్తగా ముందుకు సాగండి. ప్రతి విషయంలో బాధ్యతగా ఉండండి. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. సంఘంలో గౌరవించబడగలరు. దొంగతనము జరుగుటకు అవకాశం ఉన్నది. జాగ్రత్తగా ఉండండి. శివునికి మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు పేరు గొప్పకు పోతే అనుకోని ఖర్చులు ఒత్తిడి ఉంటుంది. ఏమరుపాటు లేకుండా ఉండవలసిన సమయం అర్థం చేసుకొనగలరు. ఒకటి కావాలి అంటే ఇంకొకటి వదులుకోవాలి. ఆదాయం ఉంటుంది. శ్రీవారి దర్శనం గోవింద నామాలు చేయండి.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు విలాసముగా ఉండాలని కోరికలు కలుగును బంధుమిత్రుల కలయిక స్థిరాస్థి విషయంలు కలసి రాగలవు. సుఖసంతోషములను ప్రోత్సహించి అదనంగా ధనం ఖర్చు చేయగలరు. ఆదిత్య హృదయ పారాయణ చేయండి. ధ్యానం యోగ చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులు అనవసర విషయములలో తలదూర్చి ఆరోగ్యమును పాడుచేసుకొనవలసి వస్తుంది. చాలా జాగ్రత్తగా ఉండాలి. దూర ప్రయాణములను వాయిదా వేయండి. అధికారులతో వినయంగా ఉండండి. తొందరపాటు నిర్ణయములు వాయిదా వేయండి. దుర్గాదేవి పూజలు చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకొన్న పనులు నిర్విఘ్నంగా చేయుటకు తగిన సమయం. తలచిన తలంపుగా మిత్రుల ఆదరాభిమానములతో పట్టు సాధించుకొనగలరు. ధైర్యముగా ముందుకు సాగండి. ప్రతి పనిలో కార్యసిద్ధి కోర్టు వ్యవహారములు రాజీ ప్రయత్నములతో పరిష్కారము. మహన్యాస రుద్రాభిషేకం చేయుట అవసరం.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది కాని ధనం నిలువదు. ప్రతి విషయంలో చాకచక్యంగా ఉండాలి. అన్నదమ్ములతో అక్కచెల్లెళ్ళతో తక్కువగా మాట్లాడవలసి ఉంటుంది. ఎంత సంపాదించినా ఎటుపోతుందో తెలియదు. గ్రామదేవత పూజలు చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు దూర ప్రయాణములు వాయిదా వేయుట మంచిది. అనారోగ్య సూచనలు కలిగి ఉన్నారు. ఖర్చులు వాయిదా వేయుట మంచిది. ఆర్భాటములకు సమయం కాదు. తక్కువగా మాట్లాడగలరు. తెలియని విషయములతో మాట్లాడరాదు. సూర్యుని ఆరాధన చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని రోజుల నుండి మనసులో తెలియని బాధ. మిగిలిన దోషములకు పెద్దలకు తర్పణలు, అమావాస్య తర్పణలు, పితృ దేవతలను సంతృప్తి చేయండి. చాలా ఒత్తిడి తగ్గుతుంది. కొన్ని బంధముల నుండి కోలుకొనుటకు అవకాశములు ఉన్నవి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. బంధుమిత్రుల కలయిక, ఆనందమును పొందగలరు. ఆస్తి పంపకముల గురించి వినయంగా పరిష్కరించుకొనుటకు అవకాశాలు కలిగి ఉన్నారు. ఆవేశమునకు సమయం కాదు. పితృ దేవతలను సంతృప్తి పరచండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా అందరితో కలిసి మెలిసి ఉత్సాహంగా ఉండగలరు. నూతన సంక్రాంతి వైభవములతో సంతృప్తిని పొందగలరు. పరమేశ్వరుని దయ పితృదేవతల సంతృప్తి చాలా తృప్తికరంగా ఉంటారు. తల్లిదండ్రుల ప్రేమకు పాత్రులు అగుదురు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**





**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. భగవద్గీత – ఎటువంటి అమృతం?
2. గోవిందదాసు స్వామివారికి ఎన్ని జన్మలు బాకీ ఉన్నారు?
3. కుమారస్వామికి నెమలిని ఇచ్చిందెవరు?
4. పావై – అంటే ఏమిటి?
5. శ్రీరాముడు అవతారాన్ని ఎక్కడ చాలించాడు?
6. గోపికలుగా జన్మించినదెవరు?
7. దేవసేన – ఎవరి కూతురు?
8. 12 మంది ఆళ్వారులలో స్త్రీమూర్తి ఎవరు?
9. గోవర్ధనగిరి – ఎక్కడ పుట్టింది?
10. కుమారస్వామి ఆయుధం పేరేమిటి?
11. హనుమంతుని వ్రతం ఎప్పుడు చేయాలి?
12. గోవర్ధన పర్వతాన్ని శపించిందెవరు?
13. తారకాసురుని తల్లితండ్రులెవరు?
14. కనకదాసు ఎవరి అంశతో జన్మించాడు?
15. స్వామివారి పశ్చిమ ముఖద్వారాన్ని ఏమంటారు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. కృత్తిక, 2. 2002 లో, 3. పరశురాముడు, 4. సోమగిరి యోగీంద్రుడు, 5. దామోదరుడు, 6. శల్యుడు – కర్ణుని, 7. నరులను బాధించేవాడు, 8. విశ్వకర్మ, 9. సూర్యుడు, 10. లీలాశుకుడు, 11. కర్మాబాయి, 12. కర్ణాటక హరిదాసులు, 13. అప్పన్న, 14. భగదత్తుడు, 15. మాధవీ ధర్మధ్వజులు

### సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి
2. యస్. ధర్మారావు
3. వి. కౌసల్య

పేరు: ______

చిరునామా: ______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**వనమాల రామలింగాచారి**